Prajalakshyam Telugu Daily

# ప్రజాలక్ష్యం

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 17 | సంచిక: 6 | కరీంనగర్ | ఆదివారం 31 మే 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## ఎసిబికి పట్టుబడిన సైబర్ సెక్యూరిటి ఇన్‌స్పెక్టర్

### 4 లక్షల లంచం తీసుకుంటుండగా పట్టివేత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 30 : సైబర్ నేరగాళ్ల ఆట కట్టించాల్సిన పోలీసే అడ్డంగా లంచం తీసుకుంటూ ఏసీబీ పట్టుపడ్డాడు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న బత్తుల మహేందర్ లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ పట్టుబడ్డాడు. ఒక సైబర్ మోసం కేసులో బాధితుడి కుటుంబ సభ్యులను ఇరికించకుండా ఉండాలంటే... ఏకంగా 9 లక్షల రూపాయలు లంచం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ మహేందర్ డిమాండ్ చేశాడు. ఇందులో భాగంగా బాధితుడి నుంచి

11లో

## విజయవాడ హైవేపై బస్సు దగ్ధం

- తృటిలో తప్పిన పెద్ద ప్రమాదం
- బస్సులో ఉన్న ప్రయాణికులు సురక్షితం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నల్లగొండ, మే 30 : హైదరాబాద్–విజయవాడ హైవేపై మరో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి సమీపంలో శనివారం తెల్లవారుజామున ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అగ్నికి ఆహుతైంది. హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న రెయిన్‌బో ట్రావెల్స్‌కు చెందిన బస్సులో మంటలు చెలరేగగా.. ప్రమాద సమయంలో 36 మంది ప్రయాణికులు

11లో

# మోటర్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీ చేయను

- ఉచిత విద్యుత్ ఆపేసినా రాజకీయాల నుంచి తప్పకుంటా
- లేకుంటే బిఆర్ఎస్ రాజకీయాల నుంచి తప్పకుంటుందా
- రైతుల ముసుగులో లబ్దికి కెసిఆర్ రాజకీయ ఎత్తుగడలు
- ధాన్యం కొరుగోళ్లలో కేంద్రం తీరు దుర్మార్గం
- కొనకపోతే బిజెపి ఎంపిల ఇళ్లముందు ధాన్యం పోస్తాం
- హరీష్‌రావు భవిష్యత్తు ఆయన చేతుల్లోనే లేదు
- మహేశ్ గౌడ్‌ది నాది విన్నింగ్ కాంబినేషన్
- మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 30 : తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ నిలిపివేసినా, మోటార్లకు మీటర్లు పెట్టినా తాము ఎన్నికల్లో పోటీ చేయబోమని, ఈ సవాల్‌కు బీఆర్ఎస్ సిద్ధమా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేస్తూ.. రాజకీయ లబ్ధి కోసమే కేసీఆర్ రైతుల ముసుగులో లైఫ్ లైన్ కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దేశంలోనే తొలిసారిగా రైతుల కోసం ప్రత్యేకంగా 'రైతు డిస్కం' ఏర్పాటు చేశామని, దీనివల్ల ప్రభుత్వానికి తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేసే వెసులుబాటుతో పాటు జవాబుదారీతనం పెరుగుతుందని స్పష్టం చేశారు. భారత రాష్ట్ర సమితికి సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. మోటార్లకు మీటర్లు

11లో





# పట్టణ పేదలకు సిఎం రేవంత్‌రెడ్డి కానుక

- తొలి విడతగా లక్ష, మలి విడత మరో లక్ష ఇళ్ల నిర్మాణం
- ఏడాదిలోగా లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక
- పేదవాని గుమ్మం వద్దకు ప్రజా ప్రభుత్వ పథకాలు
- ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శంకుస్థాపన
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 30 : పట్టణ పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా వారు నివసించే ప్రాంతాల పరిధిలోనే అధునాతనమైన ఇందిరమ్మ ఇళ్లను కట్టి ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. త్వరలో క్యూర్ పరిధిలో తొలివిడతగా మంజూరు చేసిన లక్ష ఇళ్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయడమేగాక ఏడాది తిరిగిలోగా వాటి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. శనివారం నాడు బంజారాహిల్స్‌లో నిర్మించబోయే

11లో

## కాంట్రాక్టర్ల ధర్నాకు బిఆర్ఎస్ మద్దతు

- వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలన్న కెటిఆర్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 30 : హైదరాబాద్ నగరంలో జరిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నిర్వహించిన ధర్నాకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మద్దతు తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్ర విమర్శలు చేస్తూ.. కాంట్రాక్టర్ల సమస్యలు, హామీల అమలు తీరుపై ప్రశ్నలు లేవనె త్తారు. ప్రజలకు న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..'కేసీఆర్ హయాంలో అధికారులకు స్వేచ్ఛనిచ్చి పని చేయమని చెప్పారు. ఒక్కో విద్యార్థి మీద ప్రత్యేక దృష్టి పెట్టి తొమ్మిదిన్నర ఏళ్ళు చదివించారు. కాంగ్రెస్ అధికారంలోకి

11లో

# తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపు

- జూన్ 4న అఖిలపక్ష భేటీ జరపాలని నిర్ణయం - కేశవరావు కమిటీ తొలి భేటీ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 30 : తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం నియమించిన కమిటీ శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఛైర్మన్ డా. కె. కేశవరావు అధ్యక్షతన సమావేశం అయ్యింది. కమిటీ సభ్యులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి లు సంబంధిత ఉన్నతాధికారులతో జరిపిన ఈ సమావేశంలో విధి విధానాలు, ఉద్యమకారుల సమాచార సేకరణ తదితర అంశాలపై చర్చించారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం ఈ నెల 15వ తేదీన జివో .679 జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కమిటీ సచివాలయంలో మొదటి సారి నేడు సమావేశమైంది.

11లో

## రైతులకు వాతావరణ సూచనలు

- తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమం
- ప్రారంభించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 30 : రాష్ట్రంలోని రైతులకు సమయానుకూల వాతావరణ సమాచారం, శాస్త్రీయ వ్యవసాయ సూచనలు అందిచేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమంను రాష్ట్ర సచివాలయంలో వ్యవసా య శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం అధికారికంగా ప్రారంభించారు.

11లో

## మోసపు హామీలతో గద్దెనెక్కి దగా

- కాంగ్రెస్ పాలనలో రైతులు మోసపోయారు
- బిజెపి ప్రజల్లోకి వెళితే తప్ప ప్రభుత్వం మేల్కోలేదు
- కేంద్రాన్ని విమర్శించడం తప్ప చేసిందేమీ లేదు
- మీడియా సమావేశంలో మండిపడ్డ కిషన్ రెడ్డి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 30 : మార్పు పేరుతో దొంగ మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. తెలంగాణ రైతాంగం పట్ల నిర్లక్ష్యంగా నిస్సిగ్గుగా వ్యవహరిస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేని విధంగా దళారులు, ప్రభుత్వం, రైస్ మిల్లర్ల చేతిలో రైతులు విలవిల్లాడుతున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వం చేతకాని తనం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. మంత్రులు ఏసీ రూముల్లో గడిపారని.. తమ ఎంపీలు, ఎమ్మెల్యేలు రైతుల దగ్గరికి

11లో

# పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం

- సిబిఎస్ఇ మూల్యంకనంలో లోపాలు దారుణం - అసమర్థ వ్యవస్థలపై దేశాన్ని నిర్మించలేమన్న కెటిఆర్ - విద్యార్థులకు అండగా పోరాడుతామని ప్రకటన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 30 : దేశంలో నీట్ పరీక్షల అక్రమాలపై రేగిన వివాదం ఇంకా చల్లబడకముందే, భారతీయ విద్యా వ్యవస్థ ప్రతిష్టను మరింత మసకబారుస్తూ సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాల వివాదం తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. ఇటీవలే విడుదలైన సీబీఎస్ఈ ఫలితాలలో డిజిటల్ మూల్యాంకనం లోపాల కారణంగా తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ మార్కుల తారుమారు వ్యవహారం దేశవ్యాప్తంగా దాదాపు 18.5 లక్షల మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనలో ముంచెత్తింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. న్యాయం కోసం ఉధృతంగా పోరాడుతున్న విద్యార్థులకు తన పూర్తి మద్దతును ప్రకటిస్తూ.. దేశ భవిష్యత్తును ఇలాంటి కుళ్ళిన, అసమర్థ వ్యవస్థల మీద ఎంతమాత్రం నిర్మించలేమని హెచ్చరించారు. ఈ మొత్తం వ్యవహారంలో గతంలో తెలంగాణను కుదిపేసిన ఒక చేదు జ్ఞాపకం మళ్లీ తెరపైకి వచ్చిందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. 2019లో తెలంగాణలో ఇంటర్మీడియట్ ఫలితాలను అస్తవ్యస్తం చేసి, పలువురు విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైన 'గ్లోబరేనా' సంస్థే ఇప్పుడు కేవలం తన పేరును మార్చుకుని, సీబీఎస్ఈ నుంచి అంతకంటే పెద్ద కాంట్రాక్ట్‌ను దక్కించుకోవడం అత్యంత దురదృష్టకరమని మండిపడ్డారు. కేంద్ర బోర్డు నిర్లక్ష్యం వల్లే ఇప్పుడు దేశవ్యాప్తంగా ఇంత పెద్ద గందరగోళం నెలకొందని విమర్శించారు.



నాడు గ్లోబరేనా వ్యవహారంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిం చిందని కేటీఆర్ గుర్తుచేశారు. లోపాలను వెలికితీసేందుకు తక్షణమే ముగ్గురు నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, ఆ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా తప్పు చేసిన సంబంధిత అధికారులను పదవుల నుంచి తక్షణమే తొలగించామని కేటీఆర్ వివరించారు. అంతేకాకుండా, బాధ్యురాలైన సదరు సంస్థపై కోర్టులో చట్టపరమైన క్రిమినల్ చర్యలు కూడా తీసుకున్నామని ప్రస్తావించారు. ఇంతటి చెడ్డ పేరు ఉన్న ఒక అసమర్థ సంస్థను సీబీఎస్ఈ బోర్డు ఎలా

11లో

## సింగరేణిపై బాల్క సుమన్ వ్యాఖ్యలు

- కేసు పెట్టి అరెస్ట్ చేసిన పోలీసులు
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూనే ఉంటానన్న బాల్క సుమన్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 30 : బీఆర్ఎస్ పార్టీ కీలక నేత బాల్క సుమన్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. సింగరేణిపై చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. బాల్క సుమన్‌ను నాంపల్లి కోర్టుకు తరలించారు. పోలీసులు అరెస్ట్ చేయడా నికి ముందు బాల్క సుమన్ మీడియాతో మాట్లాడుతూ.. ' నేను ఎక్కడికీ పారిపోలేదు. తెలంగాణ భవన్‌లోనే ఉన్నా. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే జైలుకు పంపుతున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నాపై 250కి పైగా కేసులు పెట్టారు. క్యాతనపల్లి ఎన్నిక సమయం లోనూ నన్ను జైల్లో పెట్టారు. ఇప్పుడు కూడా

11లో

## బిఆర్ఎస్ నేతలవి దుర్మార్గపు ఆలోచనలు

- అందులో భాగంగానే బాల్క వ్యాఖ్యలు
- మండిపడ్డ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,మే 30 :బీఆర్ఎస్ పొలిటికల్ డ్రామాలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బలయ్యాడని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. ఇటీవల కాలంలో బీఆర్ఎస్ నాయకులు వాడుతున్న

11లో

## బాల్క సుమన్ వ్యాఖ్యలు దుర్మార్గం

- అందుదే అరెస్ట్ చేసిన పోలీసులు
- బల్క సుమన్ వెనుక కెసిఆర్ కుట్ర దాగివుంది
- మీడియాతో ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 30 : బాల్క సుమన్ అరెస్ట్ కావడానికి కారణం ఆయన మాటలేనని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. గాంధీభవన్ లో ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ మీడియాతో మాట్లాడుతూ... బాల్క సుమన్ అరెస్ట్ కావడానికి ఆయన మాటలే కారణం. సుమన్ వ్యాఖ్యల వెనక కేసీఆర్ కుట్ర ఉంది. మీకు కోపం ఉంటే మాపై దాడి చేయండి. సామాన్య ప్రజలు తిరిగే రైళ్లపై మీకు ఎందుకు అంత అక్కసు. రైళ్లలో తిరిగేది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేదలే. మీకు ఓట్లేయలేదని పేదలపై

11లో

# ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**- పెండింగ్ కేసుల త్వరిత పరిష్కారం, మహిళలపై నేరాల విచారణలో వేగం పెంచాలి**
**- అక్రమ ఇసుక రవాణా, గుడుంబా, గుట్కా, పేకాటపై కఠిన చర్యలు తీసుకోవాలి**
**- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటి, మే 30 : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేర నియంత్రణ, పెండింగ్ కేసుల పరిష్కారం, ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యల్లో మరింత చురుకుదనం ప్రదర్శించాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఆయన పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తు పురోగతి, వారెంట్ల అమలు, పోలీస్ సిబ్బంది పనితీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, కమిషనరేట్ పరిధిలో నమోదవుతున్న కేసుల దర్యాప్తులో పారదర్శకత, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా 2025 సంవత్సరానికి ముందు నమోదై దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ కేసులను ప్రాధాన్యతతో విచారించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను గుర్తించి వెంటనే సరిదిద్దే చర్యలు చేపట్టాలన్నారు. మహిళలపై నేరాలకు సంబంధించిన కేసుల్లో విచారణ, నిందితుల అరెస్టులు, సాక్ష్యాల సేకరణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రాపర్టీ, బాడిలీ అఫెన్స్ కేసుల దర్యాప్తును చట్టబద్ధంగా, పారదర్శకంగా నిర్వహించాలని పేర్కొన్నారు. గ్రేవ్ కేసుల పురోగతిని డీసీపీలు, అదనపు డీసీపీలు వారానికొకసారి సమీక్షించాలని ఆదేశించారు. ఆర్థిక నేరాలకు సంబంధించిన కేసుల్లో చట్ట ప్రకారం నిందితుల ఆస్తులను జప్తు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కిడ్నాపింగ్, మిస్సింగ్ కేసుల్లో బాధితులను గుర్తించడంలో జాప్యం జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఇటువంటి కేసుల్లో ఆలస్యం ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందన్నారు. ఎన్‌డీపీఎస్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలను న్యాయస్థాన అనుమతితో త్వరితగతిన నిర్వీర్యం చేయాలని సూచించిన సీపీ, సైబర్ క్రైమ్, ఎన్‌డీపీఎస్ కేసుల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన నేరస్థులను గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న నాన్-బెయిలబుల్ వారెంట్ల అమలుపై ప్రత్యేక దృష్టి సారించి కన్విక్షన్ శాతం పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యకలాపాల్లో భాగంగా అక్రమ ఇసుక రవాణా, గుడుంబా తయారీ, పేకాట, గుట్కా విక్రయాలు, రేషన్ బియ్యం అక్రమ రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఇటువంటి అక్రమాలను అరికట్టాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించడం ప్రతి అధికారి బాధ్యత అని పేర్కొన్న సీపీ, పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని, వారి ఫిర్యాదులపై తక్షణ స్పందన చూపాలని సూచించారు. ప్రజల నుంచి నేరుగా అందే ఫిర్యాదుల ఆధారంగా వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, సీపీ కార్యాలయం ద్వారా అందే ఫిర్యాదులపై కూడా వేగంగా స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించే అధికారులను సహించేది లేదని హెచ్చరించిన సీపీ, పోలీస్ సిబ్బంది విధిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగించాలని సూచించారు. విధి నిర్వహణలో ప్రజలకు ఆదర్శంగా నిలవాలని, కార్యాలయాలు, విధి నిర్వహణ ప్రాంతాల్లో హెల్మెట్ లేకుండా ఎవరికీ అనుమతి ఇవ్వవద్దని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి, అదనపు డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, పెద్దపల్లి ఏసీపీ కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సీఐలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.



# కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతు చేసి రైతులకు సాగునీరు అందించాలి

**- మాజీ కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 30 : రాష్ట్రప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసి రైతులకు సాగునీరు అందించాలని బీజేపీ జాతీయ నాయకులు, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ డిమాండ్ చేశారు. మాజీ కేంద్ర మంత్రి దత్తాత్రేయ శనివారం గోదావరిఖనిలో పర్యటించారు. ఈ మేరకు స్థానిక గంగానగర్ లోనీ బీజేపీ నాయకులు బల్మూరి అమరేందర్ రావు నివాసానికి వచ్చిన దత్తాత్రేయకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంజీవ రెడ్డి, స్థానిక బిజెపి నాయకులు ఘనస్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దత్తాత్రేయ మాట్లాడుతూ మేడిగడ్డ ప్రాజెక్టుపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ స్పష్టమైన రిపోర్టు ఇచ్చిందని, లక్ష కోట్ల రూపాయలతో నిర్మించిన ప్రాజెక్టు ప్రజలకు పనికి రాకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంకు ప్రాజెక్టును రిపేరు చేయించడంలో చిత్తశుద్ధి లేకుండా పోయిందని ఆరోపించారు. ఉత్తర తెలంగాణలోని రైతులు సాగునీరులేక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిన మూడు బ్యారేజీల్లో నీరు లేకపోవడం ద్వారా భూగర్భ జలాలు అడుగంటాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసి రైతులకు సాగు నీరు అందించాలని కోరారు. ఈ విలేకరుల సమావేశం లో బీజేపీ జిల్లా అధ్యక్షులు కర్ర సంజీవరెడ్డి, బల్మూరి వనిత, అమరేందర్ రావు, మెరుగు హనుమంతు గౌడ్, కోమల్ల మహేష్, కాసిపేట శివాజీ, అర్జున్ రావు, పిడుగు కృష్ణ, సుల్వ లక్ష్మీ నర్సయ్య, క్యాతం వెంకటరమణ, సిరిగ సంజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ పర్యాటక ప్రాంతాలకు పూర్వవైభవం

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మే 30 : మెదక్ జిల్లాలోని పురాతన పర్యాటక ప్రదేశాలను పూర్వ వైభవంతో సంతరించుకునేలా తుది రూపు తీసుకువచ్చే విధంగా టూరిజం శాఖ సమన్వయంతో వసతులు కల్పించేలా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ తెలిపారు. శనివారం వీడియో సమావేశ హాల్లో మెదక్ పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై డెక్కన్ టెరైన్ స్వచ్ఛంద సంస్థ,మీర్ ఖాన్ సభ్యులు ఈడియం సందీప్,యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్ తో కలెక్టర్ సమీక్షించారు.

ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూడు రోజులపాటు జిల్లాలో పర్యాటక ప్రాంతాలను డెక్కన్ టెరైన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఈడీఎం, యువజన క్రీడల నిర్వహణ అధికారి సందర్శించారని వారితో శనివారం సమావేశం ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో పర్యాటక ప్రాంతాలను సందర్శించి అనుభవాలను తెలుసుకోవడం జరిగిందన్నారు.పర్యాటక ప్రాంతాలకు పూర్వ వైభవం తీసుకువచ్చేలా వసతులు కల్పనపై చర్చించడం జరిగింది అన్నారు. సమగ్ర ప్రణాళికలు రూపొందించుకొని వాటిని పటిష్టంగా అమలు చేస్తూ పర్యాటక శోభ ఉట్టిపడేలా ఆ ప్రాంతాలను టూరిజం అధికారుల,డెక్కన్ టెరైన్స్ స్వచ్ఛంద సంస్థ సమన్వయంతో చర్యలు చేపడతామని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెల్లడించారు. అంతకుముందు మెదక్ టూరిజం ప్రాంతాల చరిత్ర ఆనవాళ్లు సంబంధించిన వీడియో క్లిప్పింగ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈడియం సందీప్ జిల్లా కలెక్టర్ గారికి సుదీర్ఘంగా వివరించారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ ఓ రామచంద్ర రాజు,డెక్కన్ టెరైన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మీర్ ఖాన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు విజయవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, మే 30 : జూన్ 2న నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా, విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కలెక్టరేట్ ప్రాంగణంలో జరిగే వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వేదికను పూలతో ఆకర్షణీయంగా అలంకరించాలని, వేడుకల ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర అవతరణ వేడుకలకు ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులను ఆహ్వానించాలని తెలిపారు. వేడుకలకు హాజరయ్యే అతిథుల కోసం తగిన సీటింగ్, తాగునీటి సౌకర్యం, సౌండ్ సిస్టమ్, షామియానా తదితర ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా స్టాళ్లను ఏర్పాటు చేయాలని, పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున ఉదయం నిర్ణీత సమయానికి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, హౌసింగ్ పీడీ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్, హార్టికల్చర్ అధికారి రమణ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం బహిరంగ సభను విజయవంతం చేయండి

**- డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణ**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మే 30 : కొమురం భీం జిల్లాలో మొట్టమొదటిసారిగా జిల్లాకు విచ్చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఆత్రం సుగుణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం జనకాపూర్ లోని డిసిసి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్చార్జ్ అజ్మీర శ్యాం నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్, మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ తో కలసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వెనుకబడిన కొమురం భీం జిల్లాను అభివృద్ధి చేసే లక్ష్యంతో ముఖ్యమంత్రి జిల్లాకు రానున్నట్లు తెలిపారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని తెలిపారు. పివిజిటీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. జిల్లాలో పెండింగ్ లో ఉన్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల మంజూరు కోసం కృషి సీఎం దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని వివరించారు. సీఎం పర్యటనలో భాగంగా జూన్ 1న కేరా మేరీ మండలం కోలం కొఠారి గ్రామంలోని 28 ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించడంతోపాటు కోలం గిరిజనులతో ముఖాముఖి కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం సాయంత్రం ఐదు గంటలకి కాగజ్ నగర్ ఎక్స్ రోడ్ సమీపంలో బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సీఎం బహిరంగ సభకు జిల్లా వ్యాప్తంగా పార్టీ కార్యకర్తలు నాయకులు అత్యధిక సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కొమురం భీం జిల్లా నుంచి రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు, రెండు లక్షల ఆసరా పెన్షన్ల మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు తారీక్, భీమ్రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గాదవేణి మల్లేష్, కార్యదర్శి శంకర్, నాయకులు దీపక్ ముండే , జక్కయ్య, వాసుదేవ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# జొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ - 84 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ... - విఓఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా, - విఓఏలకు ఎమ్మెల్యే సంఘీభావం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



నిర్మల్, మే 30 : రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని, దళారులకు జొన్నలు విక్రయించి నష్టపోవద్దని ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ లి అన్నారు. శనివారం రోజున తానూర్ మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్, మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులకు క్వింటాల్‌కు రూ.3,699 కనీస మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకు పంటను తీసుకురావాలని రైతులకు సూచించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా పారదర్శకంగా చెల్లింపులు జరుగుతాయని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం తానూర్ రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 84 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఇదే సందర్భంగా తానూర్ మండలంలో విధులు నిర్వహిస్తున్న వీవోఏలకు ఎమ్మెల్యే సంఘీభావం ప్రకటించారు. వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామస్థాయిలో ప్రజలకు సేవలు అందించడంలో వీవోఏల పాత్ర కీలకమని ఆయన పేర్కొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఆసిఫాబాద్, మే 30: రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లాలోని కెరమెరి మండలం కొఠారి కొత్తగూడ గ్రామానికి జూన్ 1వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారులు రానున్న సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, గృహ నిర్మాణ శాఖ పి.డి. ప్రకాష్ రావు లతో కలిసి ఏర్పాట్లతో పాటు ముఖ్యమంత్రి చేతుల మీదుగా గృహప్రవేశాలు చేయనున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరిత మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లను చక్కగా అలంకరించాలని, గ్రామస్తులతో సహ పంక్తి భోజనంతో పాటు లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమం ఉన్నందున సమావేశ వేదిక వద్ద పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలని తెలిపారు. హెలిప్యాడ్ నుండి గ్రామంలో వచ్చే దారిలో స్వాగత తోరణాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని, పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని తెలిపారు. ముఖ్యమంత్రి, మంత్రులకు ఘనంగా స్వాగతం పలికేలా అధికారులు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేటలో కలెక్టర్ అంకిత్ విస్తృత పర్యటన

**- యంగ్ ఇండియా గురుకులాలు, ఇందిరమ్మ ఇండ్ల పనులు వేగవంతం చేయాలి**
**- జూన్ 2 నాటికి పూర్తయిన ఇళ్లను గృహప్రవేశాలకు సిద్ధం చేయాలి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి కొత్తగూడెం, మే 30 : జిల్లా కలెక్టర్ అంకిత్ శనివారం అశ్వారావుపేటలో పర్యటించి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణాలు, తహసీల్దార్ కార్యాలయం, ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా పాఠశాలను సందర్శించిన కలెక్టర్, పనుల నాణ్యత, పురోగతిని పరిశీలించి అన్ని ప్రమాణాలతో నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలకు అనుసంధాన రహదారులు, అంతర్గత రోడ్లు, విద్యుత్, తాగునీటి వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను నిర్మిస్తోందని, జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఐదు గురుకులాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరానికి అందుబాటులోకి తేవాలని పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, భూ భారతి, సాదా బైనామా, భూ సర్వే దరఖాస్తుల పరిష్కారంపై తహసీల్దార్ కిషోర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను కూడా సమీక్షించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాలు నిర్వహించాలని ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడిన కలెక్టర్, వారి సమస్యలు తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మున్సిపాలిటీ 15వ వార్డులో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. మండలంలో మంజూరైన 957 ఇళ్లలో 926 నిర్మాణాలు ప్రారంభమయ్యాయని, 200 ఇళ్లు పూర్తయ్యాయని అధికారులు వివరించారు. మున్సిపాలిటీ పరిధిలో మంజూరైన 136 ఇళ్లలో 129 నిర్మాణాలు ప్రారంభమై 52 ఇళ్లు పూర్తయ్యాయని తెలిపారు. పూర్తయిన, చివరి దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను జూన్ 2 నాటికి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రారంభం కాని ఇళ్లను వెంటనే గ్రౌండింగ్ చేసి పనులు మొదలుపెట్టాలని సూచించారు. పేదల సొంతింటి కల సాకారం చేసే ఇందిరమ్మ ఇండ్ల పథకం విజయవంతానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. ఈ పర్యటనలో తహసీల్దార్ కిషోర్, మున్సిపల్ కమిషనర్ దిలీప్ రెడ్డి, హౌసింగ్ ఏఈ మదన్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# బాలికలు, మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మే 30 : బాలికలు, మహిళలు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో మహిళ వారోత్సవాలలో భాగంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ పార్లమెంట్ కార్యక్రమానికి జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా సంక్షేమ అధికారి స్వరూపారాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధి ప్రమీలలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు, బాలికలు తమ హక్కులు, చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు మహిళలు, బాలికల హక్కులపై అనేక చట్టాలు తీసుకువచ్చాయని, సమాజంలో మహిళలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకునేలా అధికారు లు కృషి చేయాలని తెలిపారు. మహిళలు, బాలికలు చట్టాలను గౌరవించాలని, బాల్య వివాహాలపై సమాచారం అందితే వెంటనే అధికారులకు తెలియజేయాలని, విద్యార్థులు తాము చదువు కునే పాఠశాలలను దేవాలయాలుగా భావించాలని తెలిపారు. ఈ సందర్భం గా ఫుల్లాస్ కార్యక్రమంలో భాగంగా సిర్పూర్ యు మండల కేంద్రానికి చెందిన 74 ఏళ్ల వృద్ధురాలు మెస్రం జిజాబాయి ఉల్లాస పరీక్ష వ్రాసి ఉత్తీర్ణులైన సందర్భంగా కలెక్టర్ సాలువాతో సన్మానించి అభినందించారు. మాక్ పార్లమెంట్ ద్వారా హక్కులు, చట్టాలపై వివరించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు, మహిళలు, బాలికలు పాల్గొన్నారు.

# గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో ప్రాణ్యకు చోటు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మే 30 : మెదక్ పట్టణానికి చెందిన ఐదేళ్ల చిన్నారి ఎర్ర ప్రసాద్ కుమార్తె ఎర్ర ప్రాణ్య గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించింది.ఎర్ర ప్రాణ్యా ఫిబ్రవరి 2న హైదరాబాద్ నగరంలో నిర్వహించిన కీబోర్డు ప్రతిభ పోటీలలో పాల్గొని గంట పాటు కీబోర్డును ఆపకుండా వాయిస్తూ రికార్డు సృష్టించారు.ఈపోటీల్లో 22 దేశాల నుంచి 2000 మంది కీబోర్డ్ వాయిద్యా కారులు పాల్గొన్నారు.ఇందులో ప్రతిభ కనబర్చిన 777 మందికి రికార్డుల్లో చోటు లభించింది. ప్రాణ్యాకు శుక్రవారం గచ్చిబౌలిలోని విక్టరీ ఆడిటోరియంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్లు అందజేశారు.



# వరద ముప్పు నివారణకు చర్యలు : మేయర్ మహంకాళి స్వామి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), మే 30 : కాలువల్లో యుద్ధ ప్రాతిపదికన పూడిక తొలగించి వరద ముప్పు నివారిశీచడానికి చర్యలు తీసుకుంటున్నామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా శనివారం ఒకటవ డివిజన్ లో డిప్యూటీ మేయర్ పాత పెల్లి ఎల్లయ్య , అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు), కమిషనర్ జె, అరుణ శ్రీతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మడిపెల్లి మల్లేష్ వారికి స్వాగతం పలికి కాలనీ సమస్యలను ప్రత్యక్షంగా చూయించారు. మేయర్ ఆదేశాలతో జెసిబి, బ్లేడ్ ట్రాక్టర్, చైన్ జె సిబి, బాబ్ కార్ట్, జెట్టిశీగ్ యంత్రం, పారిశుద్ధ్య సిబ్బంది సహాయంతో పి కె. రామయ్య కాలనీ పట్టణ ప్రకృతి వనం ప్రక్కన ఉన్న వీధుల్లో పూడుక పోయి ఉన్న ఉపరి తల కాలువను పూర్తిగా శుభ్రం చేయించారు. తుప్పలు, పొదలు, పిచ్చి చెట్లు పెరిగి చెట్ల కొమ్మలు రోడ్డు మీదకు వచ్చి నడవడానికి కూడా వీల్లేకుండా ఉన్న వీధుల్లో బ్లేడ్ యంత్రం సహాయంతో వాటిని తొలగించారు . దీంతో దారులు విశాలంగా మారాయి. పట్టణ ప్రకృతి వనంలో పెరిగిన పిచ్చి చెట్లను కూడా తొలగించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం భూగర్భ జలాలు పెరగడానికి రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ ఎక్కువ సంఖ్యలో నిర్మించవలసియున్న దృష్ట్యా ఈ స్థలంలో ఇంకుడు గుంతల ఏర్పాటుకు గుంతలు తీసి సిద్ధం చేశారు. కార్యక్రమం అనంతరం మేయర్ మాట్లాడుతూ కాలనీ ఏర్పడిన నాటి నుండి కూడా కాలువల్లో పూడిక తీసిన ఆనవాళ్ళు లేవని అన్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పూర్తి స్థాయిలో పూడిక తొలగించడానికి అవసరమైన పక్షంలో ఒకటవ డివిజన్‌లోనే మరికొన్ని రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ చేపడతామని అన్నారు. గతంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న పికె రామయ్య కాలనీలో ఎమ్మెల్యే చొరవతో రహదారులు విశాలంగా నిర్మించడం జరిగిందని అన్నారు. యుజిడి ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. మిగిలిపోయిన యుజిడి, రోడ్లను కూడా డిఎంఎఫ్‌టి, ఎన్‌టిపిసిసి ఎస్ఆర్ నిధులతో నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. స్పెషల్ డ్రైవ్ లో మునిసిపల్ సిబ్బంది చాలా బాగా పని చేస్తున్నారని కితాబునిచ్చారు. డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య మాట్లాడుతూ ఏళ్ల తరబడి కాలువల్లో నిలిచిపోయిన పూడిక తొలగింపు ఇప్పుడు జరుగుతున్నదని అన్నారు. ఎమ్మెల్యే కృషి తో అభివృద్ధి చురుగ్గా జరుగుతున్నదని అన్నారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), కమిషనర్ జె. అరుణ శ్రీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఋతుపవన కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వర్షాకాలం రాకముందే కాలువల్లో పూడిక తొలగించే పనులను ప్రారంభించడం జరిగిందని అన్నారు. వరద ప్రభావం ఉండే మురుగునీటి కాలువలలో పూడిక తొలగింపు పనులు చురుగ్గా సాగుతున్నాయని అన్నారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని పారిశుద్ధ్య నిర్వహణ పై ప్రత్యేక దృష్టి పెట్టి మరింత మెరుగుపరుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వెంగళ బాపు, నగర పాలక సంస్థ ఎస్ ఇ గురువీర, డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి, ఎఇ తేజస్విని, సానిటరి ఇన్స్ పెక్టర్ సంపత్, సీనియర్ అకౌంటెంట్ రాజ్ కుమార్, జవాన్ సూర్య, నగర పాలక సంస్థ సిబ్బంది, మెప్మా ఆర్‌పిలు పాల్గొన్నారు.



# బాల్య వివాహాల రహిత జిల్లాగా పెద్దపల్లి

## - ఉల్లాస్ పరీక్షల్లో 34,620 మంది మహిళలు ఉత్తీర్ణులు
## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, మే 30 : జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలన, మహిళా సాధికారత, అక్షరాస్యత పెంపు కోసం చేపట్టిన కార్యక్రమాలు విశేష ఫలితాలు సాధించాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో స్నేహ కిశోర బాలికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని విధానాలు రూపొందించడమే ప్రజాస్వామ్య వ్యవస్థ గొప్పతనమన్నారు. ఉల్లాస్ కార్యక్రమం కింద జిల్లాలో చదువు రాని మహిళలకు 5 వేల మంది వాలంటీర్ల సహకారంతో అక్షరాస్యత బోధించగా, మార్చిలో నిర్వహించిన పరీక్షల్లో 34,620 మంది మహిళలు 100 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. జూలైలో మరో 35 వేల మంది మహిళలకు పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనంతరం జిల్లాలోని మూడు మున్సిపాలిటీలు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, 14 మండలాల పరిధిలోని 263 గ్రామ పంచాయతీల్లో బాల్య వివాహాలు జరగడం లేదని ధృవీకరిస్తూ పెద్దపల్లి జిల్లాను బాల్య వివాహాల రహిత జిల్లాగా ప్రకటించారు. మహిళలపై అఘాయిత్యాలు, వేధింపులు, వివక్ష నిర్మూలనకు అందరూ కృషి చేయాలని పిలుపునిస్తూ మహిళల భద్రత, గౌరవ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కాళిందిని, జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్, సంబంధిత అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# 37 ఏళ్ల నిష్కళంక సేవలకు వందనం



## - జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ప్రశంసలు- క్రమశిక్షణ, నిజాయితీ, విధి నిబద్ధతకు ప్రతీకగా నిలిచిన ఎస్పై సుబ్బరాజుకు ఘన వీడ్కోలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే 30: పోలీసు శాఖలో క్రమశిక్షణ, నిజాయితీ, విధి నిర్వహణలో అంకితభావానికి చిరునామాగా నిలిచిన జిల్లా పోలీసు కార్యాలయం కంట్రోల్ రూమ్ ఎస్పై సుబ్బరాజుకు జిల్లా పోలీసు శాఖ ఘనంగా వీడ్కోలు పలికింది. 37 సంవత్సరాల పాటు ప్రజా భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ కోసం నిర్విరామంగా సేవలందించిన ఆయన పదవీ విరమణ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమం హృద్యంగా సాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సునిత రెడ్డి సుబ్బరాజు దంపతులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, "పోలీసు ఉద్యోగం కేవలం ఒక వృత్తి కాదు.. సమాజ భద్రత కోసం చేసే త్యాగయాత్ర. ఆ యాత్రను 37 సంవత్సరాల పాటు నిబద్ధతతో కొనసాగించిన సుబ్బరాజు ప్రతి పోలీసు ఉద్యోగికి ఆదర్శప్రాయులు" అని పేర్కొన్నారు. 1989లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా తన సేవా ప్రస్థానాన్ని ప్రారంభించిన సుబ్బరాజు, తన కృషి, క్రమశిక్షణ, పట్టుదలతో అంచెలంచెలుగా ఎదిగి సబ్ ఇన్‌స్పెక్టర్ హోదాను అందుకున్నారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల్, వనపర్తి జిల్లాల్లో వివిధ బాధ్యతలు నిర్వహించిన ఆయన, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో సైతం ధైర్యసాహసాలతో విధులు నిర్వర్తించి ప్రశంసలు అందుకున్నారు. సర్వీసు కాలమంతా ఎటువంటి ప్రతికూల వ్యాఖ్యలు లేకుండా నిష్కళంకంగా విధులు నిర్వర్తించడం ఆయన వ్యక్తిత్వానికి, సేవా తత్వానికి నిదర్శనమని ఎస్పీ కొనియాడారు. కష్టపడి పనిచేసే వారిని చరిత్ర ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని, సుబ్బరాజు గారి సేవలు పోలీసు శాఖకు గర్వకారణంగా నిలుస్తాయని పేర్కొన్నారు. అలాగే యువ పోలీసు సిబ్బంది సుబ్బరాజు విధి నిబద్ధత, ప్రజల పట్ల మానవీయ దృక్పథం, సహోద్యోగులతో స్నేహపూర్వక వైఖరిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పదవీ విరమణ ఉద్యోగానికి మాత్రమేనని, సేవాభావానికి కాదని పేర్కొంటూ, ఇకపై కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ అనంతరం ప్రభుత్వం అందించే జీపీఎఫ్, ఇన్సూరెన్స్, ఇతర ఆర్థిక ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. అదనపు ఎస్పీ రాజేష్ మీనా, ఐపీఎస్., వనపర్తి డీఎస్పీ గిరిబాబు, డీసీఆర్‌బీ డీఎస్పీ బాలాజీ నాయక్, వనపర్తి సీఐ సుగంధరత్నం, కొత్తకోట సీఐ రాంబాబు, ఆత్మకూరు సీఐ శివకుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు, ఇతర పోలీసు అధికారులు, సుబ్బరాజు కుటుంబ సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# హౌస్ లిస్టింగ్ సర్వేకు ప్రజలు సహకరించాలి

## కలెక్టర్ కోయ శ్రీహర్ష

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పెద్దపల్లి, మే 30 : జనాభా గణన–2027లో భాగంగా నిర్వహిస్తున్న హౌస్ లిస్టింగ్ సర్వేకు ప్రజలు పూర్తి సహకారం అందించి, ఎన్యూమరేటర్లకు వాస్తవ సమాచారాన్ని ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కోరారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన హౌస్ లిస్టింగ్ సర్వేలో కలెక్టర్ స్వయంగా పాల్గొని వివరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి నిర్మాణం, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వంట ఇంధనం, కమ్యూనికేషన్ తదితర వివరాలు సర్వేలో నమోదు అవుతాయని తెలిపారు. ఈ సమాచారం ప్రభుత్వ అభివృద్ధి ప్రణాళికలు, మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనకు ఉపయోగపడుతుందని చెప్పారు. సర్వేలో ఇచ్చే సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంటుందని, దాని వల్ల ఎలాంటి సంక్షేమ పథకాలు రద్దు కావని లేదా లబ్ధిదారుల అర్హతలపై ప్రభావం ఉండదని స్పష్టం చేశారు. ప్రజలు అపోహలకు తావివ్వకుండా సర్వే సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని ఎన్యూమరేటర్లు, పర్యవేక్షకులు నిబంధనల మేరకు ప్రతి ఇంటిని సందర్శించి సర్వేను పారదర్శకంగా, నాణ్యతతో నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో సంబం ధిత అధికారులు పాల్గొన్నారు.

# ఇంధన ధరల పెంపుపై నిరసనగా సైకిల్ యాత్ర

## - జూన్ 2 తర్వాత కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఉంటే అధికారులపై చర్యలు - ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



యాదాద్రి భువనగిరి, మే 30 : పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు నిరసనగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శనివారం యాదగిరిగుట్ట నుంచి తుర్కపల్లి వరకు సైకిల్ యాత్ర చేపట్టారు. ఇంధన ధరల పెంపుతో సామాన్య ప్రజలపై అదనపు భారం పడుతోందని, కేంద్ర ప్రభుత్వం వెంటనే ధరలను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. సైకిల్ యాత్ర సందర్భంగా మల్లాపూర్, దత్తాయిపల్లి, వెంకటాపురం గ్రామాల మీదుగా తుర్కపల్లి మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. కేంద్రాల్లో ధాన్యం నిల్వలు అధికంగా ఉండటం, లారీల కొరత కారణంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే, జూన్ 2 నాటికి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పూర్తిగా తరలించాల్సిందేనని స్పష్టం చేశారు. ఆ తేదీ తర్వాత కూడా కేంద్రాల్లో ధాన్యం కనిపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వెంటనే అదనపు లారీలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని గోదాములకు తరలించాలని, అవసరమైతే ఇతర ప్రాంతాల నుంచి హమాలీ కార్మికులను రప్పించి లోడింగ్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం వెంకటాపురం గ్రామంలో మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్‌కు పలుచోట్ల లీకేజీలు ఉన్న విషయాన్ని గుర్తించిన ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి సీతక్కతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. తాగునీటి వృథాను అరికట్టేందుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరగా, మంత్రి సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పర్యటనలో భాగంగా ప్రజలు తమ గ్రామాల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని బీర్ల అయిలయ్య పేర్కొన్నారు.



# కార్మిక క్రీడాకారుడు ప్రవీణ్ కుమార్ ఉద్యోగ విరమణ

## - ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికిన అధికారులు, ఆత్మీయులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 30 : సింగరేణి సంస్థలో 39 సంవత్సరాలపాటు సుదీర్ఘకాలం సేవలందించి ఆర్జీ–3 ఓసియం–1లో ఈపీ ఫిట్టర్‌గా ఉద్యోగ విరమణ పొందిన కార్మిక క్రీడాకారుడు బచ్చ ప్రవీణ్ కుమార్ ను అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, సహోద్యోగులు ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. శనివారం ఓసియం–1 బేస్ వర్క్‌షాప్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి ఆర్జీ–3 జీఎం సుంకర మధుసూదన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రవీణ్ కుమార్, ప్రభావతి దంపతులను శాలువాలతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ప్రవీణ్ కుమార్ క్రమశిక్షణ, నిబద్ధత, సేవాభావానికి ప్రతీకగా నిలిచారని కొనియాడారు. విధుల్లో తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడంతోపాటు అందరితో స్నేహపూర్వకంగా మెలిగేవారని ప్రశంసించారు. అత్యుత్తమ నైపుణ్యం కలిగిన ఉద్యోగిని సంస్థ కోల్పోవడం నష్టమే అయినప్పటికీ ఉద్యోగ విరమణ అనివార్యమని పేర్కొన్నారు. అనంతరం ఆర్జీ–3, అడ్రియాల ప్రాజెక్టు సీనియర్ క్రీడాకారులు ప్రవీణ్ కుమార్‌ను సన్మానించి షటిల్ రాకెట్‌ను బహుకరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో అధికారులు శంకర్, పాపయ్య, సుధాకర్ రెడ్డి, కాశీ విశ్వేశ్వర్ రావు, నసీర్ అహ్మద్, రఘు కుమార్, సత్యనారాయణ, సాయి స్వరూప్, కార్మిక సంఘాల నాయకులు నక్క రమేష్, సదానందం, క్రీడాకారులు హరికిషన్, ముకేశ్ కుమార్, చంద్రపాల్, శేషగిరి, అల్లం రమేష్, కేఎల్ఎన్ ప్రసాద్, గంధం శ్రీనివాస్, నరసింహారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శివ, బుగ్గాజి, జక్కుల దామోదర్, పూర్ణాకర్, వాసు, రవి, శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ పాలనలో సంక్షోభంలో ప్రజలు... ప్రచార ఆర్భాటంలో కేంద్ర ప్రభుత్వం...

## - దేశాన్ని అప్పులు, నిరుద్యోగం, ధరల భారంతో నెట్టేస్తున్న కేంద్ర ప్రభుత్వం
## - ఏఐసీసీ వనపర్తి జిల్లా అధ్యక్షుడు జి. నాగార్జున

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే 30 : దేశ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో చేతులెత్తేసి ప్రచార ఆర్భాటానికే పరిమితమైందని ఏఐసీసీ వనపర్తి జిల్లా అధ్యక్షుడు జి. నాగార్జున తీవ్ర స్థాయిలో విమర్శించారు. శుక్రవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరిగిపోతుండగా కేంద్ర ప్రభుత్వం మాత్రం ప్రజల బాధలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా కుదేలవుతున్నా ధరల నియంత్రణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రతి ఏడాది కోట్లాది ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన బీజేపీ ప్రభుత్వం యువతను నిరాశపరిచిందని అన్నారు. చదువుకున్న యువకులు ఉద్యోగాల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతుండగా కేంద్ర ప్రభుత్వం గణాంకాల మాయాజాలంతో నిరుద్యోగ సమస్యను దాచిపెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. దేశానికి వెన్నెముకైన రైతాంగం తీవ్ర సంక్షోభంలో చిక్కుకుపోయిందని, పెరుగుతున్న సాగు వ్యయాలు, ఎరువులు, విత్తనాల ధరలు, పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను విపరీతంగా పెంచి ప్రజలపై భారాన్ని మోపారని, దీని ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థ మొత్తంపై పడిందని తెలిపారు. పెరిగిన ఇంధన ధరల కారణంగా రవాణా వ్యయం పెరిగి ప్రతి వస్తువు ధర ఆకాశాన్నంటుతోందని అన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, వ్యాపారాలు తీవ్ర ఆర్థిక ఒత్తిడిలో కొట్టుమిట్టాడుతున్నాయని, ఉపాధి కల్పించే రంగాలను బలోపేతం చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ పథకాల ప్రచారం భారీగా ఉన్నప్పటికీ వాటి ఫలితాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎంతవరకు చేరుతున్నాయనే అంశంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. దేశంలో ఆర్థిక అసమానతలు పెరుగుతుండగా కొద్దిమంది కార్పొరేట్ సంస్థలకే ప్రయోజనం చేకూరే విధంగా ప్రభుత్వ విధానాలు ఉన్నాయనే అభిప్రాయం ప్రజల్లో బలపడుతోందని అన్నారు. ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన పారదర్శకత, జవాబుదారీతనం అంశాల్లో కూడా ప్రభుత్వం ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా తప్పించుకుంటోందని ఆరోపించారు. దేశ సమగ్ర అభివృద్ధి, యువత భవిష్యత్, రైతాంగ సంక్షేమం, ధరల నియంత్రణ, ఉపాధి కల్పన వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురాని ప్రచార రాజకీయాలు ఎంతకాలం సాగవని, దేశ ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని జి. నాగార్జున హెచ్చరించారు.



# కోతుల, కుక్కల బెడదను నివారించాలి

## - మున్సిపల్ కమిషనర్‌కు బీఆర్ఎస్ వినతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, మే 30 : భువనగిరి పట్టణంలో వీధి కుక్కలు, కోతుల బెడద రోజురోజుకు పెరుగుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ భువనగిరి పట్టణ బీఆర్ఎస్ పార్టీ శాఖ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, పార్టీ నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇటీవల తారకరామనగర్‌లో ఓ బాలుడు కోతుల దాడిలో కన్ను కోల్పోయాడని, హౌసింగ్ బోర్డు ప్రాంతంలో మరో బాలుడు తీవ్రంగా గాయపడిన ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ మున్సిపల్ పాలకవర్గం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అత్యవసర పరిస్థితుల్లో సమావేశాలు నిర్వహించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిన అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. సుప్రీంకోర్టు కూడా వీధి కుక్కల నియంత్రణపై ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో భువనగిరి పట్టణంలోని 35 వార్డుల్లో ఉన్న కుక్కలు, కోతులను వెంటనే పట్టుకుని ప్రజలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా విభాగంలో భారీ అవినీతి జరిగిందనే ఆరోపణలు చాలా కాలంగా వస్తున్నాయన్నారు.

# ధాన్యం తూకం వేయడంలో జాప్యం చేయవద్దు

## - సేకరణ ప్రక్రియ మరింత వేగవంతం చేయాలి - జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
## - ధాన్యం కొనుగోళ్ళపై అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల, మే 30: కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని తూకం వేయడంలో జాప్యం చేయవద్దని, సేకరణ ప్రక్రియ మరింత వేగవంతం చేసి సజా వుగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ళు, తూకం వేగవంతం చేసి లోడింగ్ చేయడం, అపరల్ పార్క్, గోదాములు, రైస్ మిల్లుల్లో అన్ లోడింగ్, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ, తదితర అంశాలపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాల శాఖ, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా, రవాణా, తదితర శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ శనివారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రోజూ వారీగా కొనుగోళ్ళ శాతం పెరిగేలా సంబంధిత పర్యవేక్షణ చేయాలని, ఈ దిశగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేయడంలో జాప్యం చేయకుండా చూడాలని అన్నారు. సేకరణ ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని, తుది దశలో ఉన్న కేంద్రాలు త్వరితగతిన పూర్తయ్యేలా చూసి అక్కడి నుండి వాహనాలు, హమాలీలను ఇతర కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. ధాన్యం తడవకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామనే భరోసా క్షేత్ర స్థాయిలో కల్పించాలని సూచించారు. మిల్లర్లు వేగవంతంగా అన్ లోడింగ్ చేసుకునేలా పర్యవేక్షణ చేయాలన్నారు. కేటాయించిన లక్ష్యం చేరుకోవడంలో జాప్యం చేస్తున్న మిల్లర్లతో మాట్లాడి వేగం పెంచేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుండి సేకరించిన ధాన్యానికి సంబంధించి ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.

ప్రజాలక్ష్యం
సంపాదకీయం

## జనాభా కాదు... మౌళిక వసతులు ఆలోచించండి !

దేశంలో ప్రస్తుతం ఉన్న జనాభాకే సరైన మౌళిక సదుపయాలు లేవు. విద్య,వైద్యం అందించే స్థితిలో ప్రభుత్వాలు లేవు. అలాగే నిత్యావసరాలు అందడం లేదు. ఉండడానికి ఇల్లు లేదు. దేశంలో అత్యధిక జనాభాకు కనీస గూడు కూడా కరువే. ఘనత వహించిన పాలకుల తీరు కారణంగా ప్రజలు నానా అగచాట్లు పడుతున్నా పాలకులకు పట్టింపు లేదు. ధాన్యం దిగుబడులు పెరుగుతున్నా, వాటిని సకాలంలో సేకరించే యంత్రాంగం లేదు. ఉన్న జనాభాను పనులకు ఉపయోగించుకునే తెలివి లేకుండా పోయింది. ఇదంతా కూడా కేవలం వ్యవస్థాగత లోపంతో పాటు, పాలకులకు చిత్తశుద్ది లేకపోవడం, పరిపాలనానుభం లేకపోవడం ప్రధాన కారణంగా చూడాలి. ఇలాంటి సమయంలో ఈ మధ్య ఎపి సిఎం చంద్రబాబు పిల్లలను కనండి.. డబ్బులు పడేస్తాను అంటూ ప్రచారంతో ఊదరగొడుతున్నారు. తను ఒక్క కొడుకునే కన్నాడు. తన కొడుకు లోకేశ్ కూడా ఒక్క పిల్లాడిని కని మిన్నకున్నారు. చంద్రబాబు పిలుపు ఇంటికి పనికిరాదా అన్నది చెప్పాలి. కనీస మౌళిక వసతులు కల్పించేందుకు చంద్రబాబు పనిచేస్తున్నారా అన్నది చెప్పాలి. ఇవేవీ కల్పించ కుండా పిల్లలను కని పడేసతే వారికి తిండి,బట్ట, చదువు సంధ్యా, వైద్యం ఎవరు అందిస్తారో చెప్పాలి. ఇందుకు గ్యారెం టీ ఇవ్వగలరా అన్నది చెప్పాలి. ఇప్పుడున్న పిల్లలకు ఈ రకమైన వసతులు కల్పించడానికి ఏం చేస్తున్నారో చంద్రబాబు తో సహా పాలకులంతా ప్రకటించాలి. దేశాన్ని అభివృద్ది వైపు తీసుకుని వెళ్లే బదులు ఇలా తిరోగమనం వైపు తీసుకుని వెళ్లే యత్నంలో రాజకీయ కోణం తప్ప మరోటి లేదు. జనాభా నియంత్రణ లేకపోవడంతో దేశంపై ఎంతగా భారం పడుఉతందో చెప్పడం లేదు. ప్రజలు త్యాగాలు చేస్తుంటే... నాయకులు భోగాలు అనుభవిస్తున్నారు. కేవలం సీట్లు పెంచుకోవడం అన్న ధ్యాస తప్ప మరోటి లేదు. జనాభా పెరిగితే రేపటి అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లలో కోత ఉండదన్న దురుద్దేశం ఇందులో దాగి ఉందనడంలో సందేహం లేదు. దక్షిణాది రాష్ట్రాల జనాభా పెరుగుదల రేటు గణనీయంగా తగ్గిన కారణంగా నియోజక వర్గాల పునర్విభజన జరిగితే, నష్టపోతాం కనుక జనాభాను పెంచాల్సి ఉందని,అందుకు మహిళలు ఎక్కువ మంది పిల్లలను కనాలని చంద్రబాబు నాయుడు సెలవిచ్చారు. ఎక్కడకు వెళ్లినా , కార్యక్రమం ఏదైనా జనాభా పెంచాల్సిన అవసరాన్ని నొక్కి చబుతున్నారు. ముగ్గురు అంతకన్నా ఎక్కువ మంది పిల్లలను కనే మహిళ లకు, పిల్లలకు ప్రోత్సాహకాలను కూడా ప్రకటించారు. మూడవ సంతానానికి రూ.30 వేలు, నాల్గవ సంతానానికి రూ.40 వేలు నగదు సహాయం చేస్తామని, ఆర్థికాభివృద్ధి బాగుంటే మరింత ఎక్కువ ఇవ్వడానికి కూడా సిద్ధమని ప్రకటించారు. అసలు ఈ పిల్లలను కనడానికి కనీసం ఆస్పత్రి సౌకర్యాలు లేని ఎన్నో గ్రామాలు ఉన్నాయి. ముందుగా ఆయా గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలన్న ఆలోచన కూడా రావడం లేదు. ఎవరి ప్రయోజనాల కోసం మహిళలు ఎక్కువ మంది పిల్లలను కనాలో చెప్పాలి. పిల్లను కనడం వల్ల వచ్చే సౌలభ్యం ఏమిటో చెప్పాలి. ఈ ప్రోత్సాహ కాలు ప్రకటించడం ద్వారా గ్రామీణ మహిళల కుటుంబాల్లో డబ్బు కోసం ఒత్తిడి పెరుగుతోంది. ఈ విషయం చంద్ర బాబు గ్రహించినట్లు లేదు.ప్రోత్సాహకాలు మాత్రమే మహి ళలు ఆరోగ్యంగా, గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి, పిల్లలు సురక్షితమైన వాతావరణంలో పెరగడానికి అవకాశాలు కల్పిస్తాయని భరోసా ఇవ్వగలరా అన్నది చెప్పాలి. కార్పొరేట్ సంస్థలకు చౌకగా శ్రామికులను సరఫరా చేయడానికి, మహిళలను ఇంటికి పరిమితం చేయడానికి మాత్రమే ఇది ఉపయోగ పడుతుంది. దేశ జనాభా ఇప్పటికే విపరీతంగా పెరిగింది. బాల్యం అంతా వెట్టిలో సాగుతోంది. జనాభా పెరుగుదల దేశంలో అసమానతలను పెంచింది. నిరుద్యో గం, ద్రవ్యోల్బణం, అభద్రత, హింస, అత్యాచారాలు, అశాం తి పెరిగినట్లుగా అన్ని గణాంకాలు, నివేదికలు తెలియచేస్తు న్నాయి. మహిళల విద్య, ఉపాధి, పౌష్టికతకు సంబంధించిన అంశాలలో వెనకబడుతున్నాం. ఇటువంటి దుర్భర పరిస్థితు లలో ఎక్కువ మంది పిల్లల్ని కనండి అని సూచించడం ద్వారా గ్రామీణ కుటుంబాల్లో భారం మోపడం తప్ప మరోటి కాదు. పిల్లను కనడానికి సరైన ఆస్పత్రులు లేవు. పెంచడానికి సరైన భద్రత లేదు. పెంచిన తరవాత చదివించేం దుకు సరైన పాఠశాలలు లేవు. వారిని సమర్థులైన పౌరులుగా తీర్చిదిద్దడా నికి అనువైన వాతావరణం లేదు. ఇవన్నీ ఒక ఎత్తయితే మహిళలు పిల్లల్ని కనే క్రమంలో శారీరక, మానసిక మార్పు లు, ఒత్తిళ్లకు లోనుకావాల్సి ఉంటుంది. వాటిని అధిగమిం చడానికి అవసరమైన వైద్యం ఎక్కువ శాతం మహిళలకు అందుబాటులో లేదు. మరీ ముఖ్యంగా గ్రామీణ, గిరిజన మహిళలకు ఇలాంటి సమస్య ఎక్కువ. డోలీ లేకుండా గర్భిణిని తరలించే సౌకర్యం కల్పించని పాలకులు ఇక గుర్తుకు రావ దం లేదు. సమాజంలో మార్పులు వస్తున్నా, ఆర్థిక స్వాతం త్ర్యం పెరిగినా ఇంకా మహిళలు అణచివేతకు గురవు తున్నారు. 21 ఏళ్లు నిండినప్పటి నుంచి మహిళల మీదపెళ్లి ఒత్తిడి పెరుగుతంది. పెళ్లి అయితే పిల్లలను కనమని ఒత్తిడి కుటుంబ సభ్యుల నుంచి ఉంటుంది. ఇక ప్రోత్సాహకాలు ఇస్తున్నారంటే ఆ ఒత్తిడి మరింత తీవ్రంగా ఉంటుంది. ఇప్ప టికే చాలా మంది మహిళలు కెరీర్, కుటుంబం రెండింటిని బ్యాలెన్స్ చేసుకోవడంలో అనేక ఒత్తిళ్లకు గురవుతున్నారు. వెనకటికి లాగా ఉమ్మడి కుటుంబాలు లేవు. నాణ్యమైన విద్య, వైద్య సదుపాయాలు అందరికీ అందుబాటులో ప్రభుత్వ అజమాయిషీలో తీసుకుని రావడంపై ముందుగా పాలకులు దృష్టి సారించాలి. ఇస్తామన్న ప్రోత్సాహక డబ్బు ఇందుకోసం వెచ్చించాలి. అందరూ ఉపాధిని హక్కుగా పొందగలిగేలా పరిస్థితిని సృష్టించాలి. స్కూళ్లతో పాటు ఆటస్థలాలు, పార్కులు, సాంస్కృతిక వికాసం కోసం లైబ్రరీలు, పాటలు, డాన్సులు నేర్పే సంస్థలను కూడా ప్రభుత్వమే ఏర్పాటు చేయాలి. అప్పుడు జనాభా నియంత్రణను ఎవ్వరు కూడా పాటించరు.

# తొలిదశ తెలంగాణ ఉద్యమ అవలోకనం

## (1969-2026)







తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 1969లో ఉదృతంగా జరిగిన తొలి దశ ఉద్యమానికి 57ఏళ్ళు నిండాయి. యాభై ఏడేళ్ల ప్రజా ఉద్య మాల ఫలితంగా 2, జూన్ 2014న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటైంది...

సెప్టెంబర్ 17,1948 వరకు స్వతంత్ర దేశంగా ఉన్న తెలంగాణ ప్రాంతం, స్వతంత్ర భారత దేశంలో 1948 నుండి అక్టోబర్,1956 వరకు హైదరాబాద్ స్టేట్‌గా, ఆ తర్వాత నవంబర్ ఒకటి 1956 నుండి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ వలస పాలనలో అన్ని రంగాల్లో భరించరాని వివక్షలను ఎదుర్కొని ఇప్పుడు మళ్ళీ స్వతంత్ర రాష్ట్రంగా ఏర్పడి పన్నెండు ఏళ్ళు పూర్తి చేసుకుంటున్నది.

1969 తొలి దశ ఉద్యమంలో ఆనాటి హుజూరాబాద్ తాలూకా విద్యార్థి సమితి నాయకునిగా క్రియాశీలంగా పని చేసిన నాకు ఆనాటి ఉద్యమ సంఘటనలను ఈ తరం యువకులతో మళ్ళీ పంచుకోవాలని అనిపించింది... నేను గతంలో ఈ విషయాలను,అనేక పత్రికలకు ఇచ్చిన ఇంటర్వ్యూ లలోను, నేను రాసిన వ్యాసాల్లోను కూడా ప్రస్తావించాను ...

1969లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమాన్ని పూర్తిగా విద్యార్థులు ఉద్యోగులు, ఉపాధ్యాయులు అగ్రభాగాన నిలిచి నడిపించారు. తెలంగాణ ప్రాంత ప్రజల హక్కుల పరిరక్షణ కోసం ప్రారంభమైన ఈ ఉద్యమం, కొద్ది రోజుల్లోనే ప్రత్యేక రాష్ట్ర ఏర్పాట ఉద్యమంగా తీవ్రరూపం దాల్చింది. ఈ ఉద్యమంలో ప్రజల భాగస్వా మ్యం కూడా ఉంది, కాని, మలిదశ ఉద్యమంలో పాల్గొన్న సబ్బండ వర్గాల ప్రజలు నాటి ఉద్యమంలో లేరు.

1969లో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి నాయకత్వంలో ఏర్పడిన తెలంగాణ ప్రజా సమితి ఆధ్వర్యంలో ఉద్యమం రాజకీయ నాయకుల ప్రవేశంతో కొనసాగింది. ప్రజా సమితికి అను బంధంగా ఏర్పడిన తెలంగాణ విద్యార్థి సమితికి డాక్టర్ మల్లికార్జున్ నాయకత్వం వహిం చారు. తొలిదశ ఉద్యమం అర్థాంతరంగా ముగిసిపోయిన అనంతర కాలంలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ఉత్తరప్రదేశ్ గవర్నరుగా, రెండు సార్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రిగా పనిచేశారు. అలాగే తెలంగాణ విద్యార్థి సమితి అధ్యక్షునిగా పనిచేసిన డాక్టర్ మల్లికార్జున్ మెదక్ లోక సభ్యునిగా ఎన్నికై శ్రీమతి ఇందిరాగాంధీ ప్రభుత్వంలో కేంద్రమంత్రిగా పనిచేశారు. తెలంగాణ ప్రజా సమితికి అధ్యక్షునిగా డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ఉన్న కమిటీలో అప్పటి హుజూరాబాద్ శాసన సభ్యులు పోల్సాని నరసింగరావు ప్రధాన కార్యదర్శిగా వున్నారు. మాజీ మంత్రి శ్రీమతి టి.ఎస్.సదాలక్ష్మి, ఇ.వి. పద్మనాభన్, ఎం. ఎం.హాషిమ్ లాంటి వారు ఎందరో మిగతా క్రియాశీల కార్యవర్గంలో వుండేవారు.

అయితే, అప్పటి హుజూరాబాద్ ఎమ్మెల్యేగా ఉన్న పోల్సాని నరసింగరావుకు ముఖ్య అనుచరునిగా ఉన్న మాణిక్యాపూర్ గ్రామానికి చెందిన ఎదులాపురం లింగయ్య అప్పటి హుజూరాబాద్ ఉన్నత పాఠశాల విద్యార్థి సంఘం నాయకులుగా ఉన్న ఆవునూరి సమ్మయ్య, నల్ల సుధాకర్ రెడ్డి, నలుబాల వెంకటస్వామి, మహమ్మద్ అబ్దుల్ కరీం, తాళ్లపల్లి లక్ష్మయ్య, సయ్యద్ ఇంతియాజుద్దీన్ లకు పోల్సాని నరసింగ రావును, తద్వారా తెలంగాణ ఉద్యమాన్ని పరిచయం చేయడం జరి గింది. అప్పటి విద్యార్థి నాయకులను, విద్యార్థులను తెలంగాణ ఉద్య మంలోకి తీసుకు రావడంలో ఎదులాపురం లింగయ్య కీలకపాత్రను పోషించారు.

అప్పట్లో కరీంనగర్ జిల్లాలో ఏడు తాలుకాలు మాత్రమే వుండేటివి. అందులో హుజూరాబాద్ తాలూకా ఒకవైపు వెల్ది, వేగురుపల్లి గ్రామాలు, మరోవైపు కట్కూరు, కన్నారం గ్రామాలు సరిహద్దులుగా విస్తరించి ఉండేది. హుజురాబాద్ తాలూకా తెలంగాణ ప్రజా సమితిఅధ్యక్షుడుగా కోర్కల్ గ్రామానికి చెందిన గోవిందరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా హుజూరాబాద్ గ్రామ సర్పంచ్, ప్రముఖ న్యాయవాది బహునూతులు జగన్నాథ నాయుడు. మిగతా కార్యవర్గంలో పరిపాటి జనార్దన్ రెడ్డి, ఏ.కె.విశ్వనాథరెడ్డి, దుగ్గిరాల వెంకటరావు, ఎర్రంరాజు కృష్ణంరాజు, కొత్త కిష్టా రెడ్డి,మారపల్లి ఏలీయా, కేతిరి సాయిరెడ్డిలు వుండేవారు. అలాగే తెలంగాణ ప్రజా సమితికి అనుబంధంగా ఏర్పడిన హుజురాబాద్ తాలూకా తెలంగాణ విద్యార్థి సమితికి అధ్యక్షునిగా నల్ల సుధాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆవునూరి సమ్మయ్యలు ఎన్నికైనారు. కుటుంబ సమస్యల వల్ల నల్ల సుధాకర్ రెడ్డి కొన్ని రోజులు ఉద్యమానికి దూరం కావడంతో ఆయన స్థానంలో నలుబాల వెంకటస్వామి విద్యార్థి సమితి అధ్యక్షునిగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం తెలంగాణ వ్యాప్తంగా ఉదృతంగా కొనసాగు తున్న రోజులవి. అప్పటి ఉద్యమంలో "ఇడ్లీ సాంబార్ గో బ్యాక్", అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ "ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి గోబ్యాక్", "ఆంధ్ర ఉద్యోగుల్లారా, ప్రజలారాగో బ్యాక్' అంటూ విద్యార్థి లోకం కళాశాలలు, పాఠాశాలలను బహిష్కరించి ఉవ్వెత్తున వీధుల్లోకి రావడం జరిగింది.అప్పట్లో కరీంనగర్ జిల్లాలో మూడే డిగ్రీ కళాశాలలు కరీంనగర్,జగిత్యాల,జమ్మికుంట లలో ఉండేటివి.అప్పటికింకా ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో జూనియర్ కళాశాల వ్యవస్థ ఏర్పాటు కాలేదు.ఆనాటి ఉద్యమంలో హైస్కూల్ విద్యార్థులే కీలక పాత్ర పోషించారు. హుజూరాబాద్ పాటు, ఈ ప్రాంతంలో ఉన్న ఆంధ్ర ప్రాంతం ఉద్యోగు లను, ప్రజలను బలవంతంగా పంపించివేయడం జరిగింది. ఈ క్రమంలోనే ఇక్కడినుండి వెళ్లకుండా పోలీసుల సహాయంతో భీష్మించుకుని తిష్ట వేసిన అప్పటి హుజూరాబాద్ సబ్ ట్రెజరీ అధికారి ఆంధ్ర ప్రాంతానికి చెందిన ప్రహ్లాద రావు ఇంటిని అప్పటి యువజన నాయకుడు కాట్రపల్లి సుగుణాకర్ సహాకారతో నల్ల సుధాకర్ రెడ్డి, ఆవునూరి సమ్మయ్యలు కలిసి దగ్ధం చేసిన సంఘటన అప్పట్లో తెలం గాణ వ్యాప్తంగా సంచలన కలిగించింది.ఈ సంఘటనలో సుధాకర్ రెడ్డి, సమ్మయ్యలను పోలీసులు అరెస్ట్ చేయడం జరిగింది. అలాగే ఆంధ్ర ప్రాంతానికి చెందిన రాజబాబు అనే భూస్వామి కేశవపట్నం గ్రామ ప్రాంతంలో భూములు కొనుగోలు చేసి వ్యవసా యం చేస్తుండే వాడు. వందలాది మంది విద్యార్థులు, యువకులు హుజురాబాద్ నుండి లారీల్లో కేశవపట్నం వెళ్లి రాజబాబు భూము ల్లోని పంటలను ధ్వంసం చేయడం జరిగింది. ఇప్పటి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో అప్పట్లో బిటిఎస్ (బేసిక్ ట్రైనింగ్ స్కూల్) ఉండేది.అందులో అధ్యాపకునిగా పనిచేసిన ఆంధ్ర ప్రాంతా నికి చెందిన ప్రముఖ రచయిత తాడిగిరి పోతరాజు ఇంటిని కూడా విద్యార్థులు మూకుమ్మడిగా దగ్ధం చేశారు. ఇలాంటి అనేక సంఘటన లతో ఈ ప్రాంతంలోని ఆంధ్ర ప్రజలందరు భయభ్రాంతులకు గురై తమ ప్రాంతాలకు వెళ్లిపోయారు. మరి కొందరికి కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో అప్పటి జిల్లా కలెక్టర్ మాల కొండయ్య ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో తలదాచుకున్నారు.

హుజురాబాద్ తాలూకాలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం తీవ్రం కావడంతో ప్రభుత్వం హుజూరాబాద్ పట్టణానికి ప్రభుత్వం రెండు బెటాలియన్ల సి.ఆర్.పి.ఎఫ్. (సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్)ను పంపించింది. పట్టణంలోని వేరు, వేరు సంఘటనల్లో అప్పటి విద్యార్థి నాయకులైన నల్ల సుధాకర్ రెడ్డి, ఆవునూరి సమ్మయ్యలను సిఆర్‌పిఎఫ్ పోలీసులు పట్టుకుని చితకబాదారు. మరో సంఘటనలో అప్పట్లో హుజూరాబాద్ పోలీస్ స్టేషన్లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేసిన తిరుపతి రెడ్డి ఆకారణంగా విద్యార్థి నాయకులైన ఆవునూరి సమ్మయ్య, నలుబాల వెంకటస్వామిలను అరెస్ట్ చేసి పోలీసు లాకప్ లో నిర్బంధించి చిత్రహింసలకు గురిచేశారు. ఈ సంఘటనకు స్పందిం చిన అప్పటి హుజురాబాద్ తాలూకా రాజకీయ నాయకులందరూ ఒక్కటై న్యాయవాది, టిపిఎస్ నాయకులు జగన్నాథ నాయుడు ఇంటి వద్ద జరిగిన సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ తిరుపతి రెడ్డి చేత సదరు విద్యార్థి నాయకులకు క్షమాపణ చెప్పించారు.

హుజూరాబాద్ ప్రాంతంలో ఉద్యమ తీవ్రతను తగ్గించాలన్న ప్రభుత్వ నిర్ణయంతో పోలీసులు కేసరి బాబురావు, ఆవునూరి సమ్మయ్య, నల్ల సుధాకర్ రెడ్డి, మహమ్మద్ అబ్దుల్ కరీం, అపరాజ భిక్షపతి లను అరెస్ట్ చేసి కరీంనగర్ జిల్లా జైల్కు పంపించడం జరిగింది. తొలిదశ తెలంగాణ ఉద్యమంలో హుజూరాబాద్ ప్రాంతం నుండి జరిగిన మొట్టమొదటి అరెస్టులు ఇవే... అప్పుడు హుజూరాబాద్ ఎస్ఐ గా ఉన్న మాధవరావు, సిఐ (ఈయన పేరు మరిచిపోయాను), ఎస్‌బి కానిస్టేబుల్ హన్మయ్యలతో పాటు మరి ఇద్దరు కానిస్టేబుల్స్‌తో కలసి ఇళ్లపై దాడులు చేసి వీరిని అరెస్ట్ చేశారు. అప్పటికే జిల్లా విద్యార్థి సమితి నాయకునిగా ఉన్న కరీంనగర్ కాపువాడకు చెందిన రామచంద్ర(రామచంద్రం అప్పట్లో కరీంనగర్ మల్టీ పర్పస్ హైస్కూల్ విద్యార్థి సంఘానికి అధ్యక్షునిగా వుండేవారు) తో పాటు మరికొందరు ఆ జైల్లోనే వున్నారు. 16 రోజుల జైల్ నిర్బంధం తర్వాత జగిత్యాల సబ్ కలెక్టర్ బెయిల్ మంజూరు చేయడంతో పోలీసులు వీరిని అర్ధరాత్రి పూట నీరుకుళ్ల గ్రామ వాగువద్ద వదలివేశారు. వీరు జైల్లో ఉన్నప్పుడే ఉప్పల్ గ్రామం నుండి పులుగం లక్ష్మీనారాయణ, చిటికేసి నారాయణ, రాజయ్య అనే ముగ్గురు యువకులను ఇదేకారణంగా అరెస్ట్ చేసి జైల్లో పెట్టారు. మేం జైల్లో ఉన్నప్పుడే 1969 లో కరీంనగర్లో భూమి కంపించిన సంఘటన ఇప్పటికి మరచిపోలేని జ్ఞాపకం.వీరి తర్వాత అరెస్టై జైలుకు వచ్చిన హుజూరాబాద్ తాలూకా ప్రజా సమితి నాయకుడు పరిపాటి జనార్ధనరెడ్డి(ఈయన 1972,78లలో రెండు సార్లు కమలా పూర్ ఎమ్మెల్యేగా పనిచేశారు) ధైర్యాన్ని అందించారు. జైల్ నుండి విడుదలైనప్పుడు వచ్చిన కుటుంబ సభ్యులపై ఆనాడు పోలీసులు లాఠీ ఛార్జ్ చేయడం జరిగింది. ఇదే కేసులో అరెస్ట్ అయిన నలుబాల వెంకటస్వామిని అనారోగ్య కారణాల వల్ల పోలీసులు వదలివేయగా, తాళ్లపల్లి లక్ష్మయ్య పోలీసులకు దొరక్కుండా తప్పించుకున్నాడు.

అలాగే అప్పట్లో ఆంధ్ర ప్రాంతానికి చెందిన వ్యక్తి హుజూరాబాద్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ గా పనిచేసే వారు. ఉద్యమంలో భాగంగా ఆంధ్ర ప్రాంత ఉద్యోగులను సాంఘిక బహిష్కరణకు గురిచేయాలన్న పిలుపుతో సదరు మేజిస్ట్రేట్ ఇంటికి ఎవ్వరు వెళ్లకుండా అడ్డుకోవడం జరిగింది. దీనికి అప్పటి యువ న్యాయవాది కేతిరి సాయిరెడ్డి తో పాటు ఆవునూరి సమ్మయ్య, నలుబాల వెంకటస్వామి కారకులన్న కారణంతో అరెస్ట్ చేసి వరంగల్ సెంట్రల్ జైల్ కు పంపించారు. సెంట్రల్ జైలు తెలంగాణ ఉద్యమకారులతో నిండిపోవడంతో ఒక్క కేతిరి సాయిరెడ్డిని జైల్లో ఉంచి,ఆవునూరి సమ్మయ్య, వెంకటస్వామిలను జైలు పక్కనే నూతనంగా నిర్మించిన కాకతీయ మెడికల్ కాలేజీ భవనంలోఒక రోజు నిర్బంధించి విడుదల చేశారు.

అప్పట్లో మా విద్యార్థులపై పెట్టిన కేసులన్నింటిని ప్రముఖ న్యాయవాది బి.జగన్నాథనాయుడు, ఆయన వద్ద జూనియర్ న్యాయవాదిగా పనిచేసిన కేతిరి సాయిరెడ్డిలు ఉచితంగా వాదించేవారు. అదేవిధంగా, ఉద్యమంలో భాగంగా బావుపేట గ్రామం వద్ద రైలు పట్టాలు తొలగించా రన్న కారణంగా ఆ గ్రామానికి చెందిన శరభయ్య (మాజీ సర్పంచ్)తో పాటు మరికొందరు యువకులను అరెస్ట్ చేసి జైల్లో పెట్టారు. తెలంగాణా తొలిదశ ఉద్యమంలో అప్పటి టీఎన్జీవో నాయకులు ఎదులాపురం లింగయ్య, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు మహమ్మద్ మురాద్ హుస్సేన్, శంషేర్ ఖాన్ ల నాయకత్వం ఉద్యమంలో క్రియాశీలంగా పనిచేసింది. హుజూరాబాద్ లోని అప్పటి కేదారి హటరీటల్ కు ఎదురుగా గోల్ చావిడికి (పురాతన గ్రంథాలయం) ముందు ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో ప్రజలు నెల రోజుల పాటు నిరాహార దీక్షలు చేశారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘించి దీక్షలు చేస్తున్నారన్న కారణంగా హుజూరాబాద్ సర్పంచ్, న్యాయవాది బి. జగన్నాథ నాయుడు, అడెపు సిద్దప్ప, అవునూరి మచ్చయ్య, గంగి శెట్టి శ్రీహరి, గంగిశెట్టి సత్యనారాయణ, అవునూరి సమ్మయ్యలతో పాటు మరో 15 మందిని అరెస్ట్ చేసి కరీంనగర్ జైలో వారం రోజుల పాటు నిర్బంధించారు. నేను, నా తండ్రిగారైన స్వాతంత్ర్య సమరయోధుడు ఆవునూరి మచ్చయ్య ఇద్దరం ఇదే సందర్భంలో ఒకే సారి జైలు జీవితాన్ని గడిపినం.

డాక్టర్ మర్రి చెన్నారెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రజాసమితికి వ్యతిరేకంగా శ్రీధర్ రెడ్డి అనే విద్యార్థి నాయకుని నాయకత్వంలో పోటీ ప్రజాసమితి ఏర్పడింది. పోటీ ప్రజా సమితి హుజూరాబాద్ తాలూకా బాధ్యతలను అప్పట్లో సింగాపూర్ గ్రామ సర్పంచ్‌గా ఉన్న ఒడితెల రాజేశ్వర్ రావు నిర్వహించేవారు. దీనికి అనుబంధంగా ఏర్పడిన పోటీ విద్యార్థి సమితికి న్యాయవాది కేసరి శేషయ్య నాయకత్వం వహించేవారు. 1969 తెలంగాణ తొలి దశ ఉద్యమం ఈ ప్రాంతంలో అదే సంవత్సరం ఫిబ్రవరి నెలలో ప్రారం భమై అక్టోబర్ నెలలో ముగిసింది. ఈ ఏడాదిలోనే విద్యా ర్థులు తమ విద్యా సంవత్సరాన్ని కోల్పోవడం జరిగింది.

1969 తొలిదశ ఉద్యమానికి 57 ఏళ్ళు నిండిన సందర్భంగా ఆ ఉద్యమంలో క్రియా శీలంగా పని చేసిన నాకు 1990 తర్వాత ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షతో మలిదశలో కొనసాగిన అనేక ఉద్యమాల్లో కూడా క్రియాశీలంగా పనిచేసే అవకాశం లభించింది. తెలంగాణ ఐక్య కార్యాచరణ సమితి, తెలంగాణ జనసభ, తెలంగాణ విద్యావంతుల వేదిక,తెలంగాణ జె.ఏ.సి, తెలంగాణ ప్రజాఫ్రంట్, తెలంగాణ జర్నలిస్టుల ఫోరం, తెలంగాణ రచయితల వేదిక లాంటి వేదికల్లో భాగ స్వామిగా, హుజూరాబాద్ ప్రాంత ఉద్యమానికి నాయకత్వం వహించడం జరిగింది.

తొలి దశ ఉద్యమం స్వల్పకాలమే జరిగినప్పటికీ అది ఆంధ్ర ప్రాంత ప్రజల్లో భయాన్ని సృష్టించింది. మలి దశ ఉద్యమం ప్రజా స్వామిక పద్ధతుల్లో దీర్ఘ కాలంగా కొనసాగి సకల జనుల సమ్మెగా మారి, ఎందరో విద్యార్థి, యువకుల ఆత్మ బలిదానాలు, అన్ని వర్గాల ప్రజల పోరాటాలు, అనేక త్యాగాలతో స్వతంత్ర రాష్ట్రాన్ని సాధించుకోవడం జరిగింది. తొలి,మలిదశ ఉద్యమాలకు సంబం ధించిన సంఘటనలన్నీనా "గవాయి" పుస్తకంలో 2016లోనే వివ రంగా రాసాను.

తొలి దశ తెలంగాణ ఉద్యమానికి 57 ఏళ్ళు నిండిన తరుణంలో ఆనాటి జ్ఞాపకాలను మరొక సారి అవలోకనం చేసుకోవడం జరిగింది. ఏవైనా సంఘటనలు గాని, వ్యక్తుల పేర్లు గాని తప్పిపోతే అవి ఉద్దేశ్యపూర్వకంగా కాదు, యాదృచ్ఛికంగా మాత్రమేనని గమనించాలి.

పై రెండు ఫోటోలలో... ఒకటి : 1969 లో అప్పటి తెలంగాణ ప్రజా సమితి రాష్ట్ర నాయకులు ఇ.వి. పద్మనాభన్ నాయకులు హుజూరాబాద్ కు వచ్చిన సందర్భంగా హుజూరాబాద్ టి.పి.ఎస్. నాయకులు, టి.వి.ఎస్.నాయకులు. రెండవది: తొలి దశ ఉద్య మానికి యాభై ఏళ్ళు నిండిన సందర్భంగా హుజూరాబాద్ తాలూకా నుండి తొలి సారి అరెస్టైన ఐదుగురిలో నలుగురు ఎడమ నుండి కుడికి ఆవునూరి సమ్మయ్య, మహమ్మద్ అబ్దుల్ కరీం, నల్ల సుధాకర్ రెడ్డి, అపరాజ భిక్షపతి. ఇంకొకరు కేసరి బాబురావు అంతకు ముందే అమరులయ్యారు.

2019 అనంతర కాలంలో మహమ్మద్ అబ్దుల్ కరీం,నల్ల సుధాకర్ రెడ్డి,అపరాజ భిక్షపతి లు కూడా అమరత్వం పొందారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన తొలి, మలి దశల్లో హుజూరాబాద్ ప్రాంతంలో జరిగిన ఉద్యమాల్లో క్రియాశీలంగా పాల్గొన్న నాకు ఎనలేని జాప్యం జరిగినప్పటికీ, స్వరాష్ట్ర సాకారం జరిగిందన్న తృప్తి మాత్రం మిగిలింది...

**కొసమెరుపు: 2, జూన్ 2014 న ఏర్పడిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రానికి జరిగిన తొలి ఎన్నికల సందర్భంగా పోలీసులు నన్ను హుజూరాబాద్ తహసీల్దారు ముందు బైన్డోవర్ చేసిన సంఘటన ఆశ్చర్యంగానే కాదు,నాకు ఆందోళనను కూడా కలిగించింది...**

**– ఆవునూరి సమ్మయ్య,**
**తొలి, మలి దశల తెలంగాణ ఉద్యమకారుడు.**

# విద్య, వైద్య రంగాల అభివృద్ధికి సిఎస్ఆర్ నిధులు

**- ప్రజా సంక్షేమానికి సమర్థవంతంగా వినియోగించాలి - మంత్రి దామోదర రాజనర్సింహ**

**- సిఎస్ఆర్ నిధుల కేటాయింపు పై సంగారెడ్డి జిల్లా అధికారులు, - పరిశ్రమల ప్రతినిధులతో సమీక్ష సమావేశం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సంగారెడ్డి, మే 30 : కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా, పారదర్శకంగా వినియోగించి సామాజిక అభివృద్ధికి దోహదపడే విధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశమందిరంలో సంబంధిత శాఖల అధికారులు, వివిధ పరిశ్రమలు, కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సీఎస్ఆర్ సమీక్ష సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి జిల్లాకు ఆయా పరిశ్రమల నుండి సి ఎస్ ఆర్ కింద ఎన్ని నిధులు వచ్చాయి,ఎంత ఖర్చు చేశాం, ఈ సంవత్సరం ప్రతిపాదనలు గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో విద్య, వైద్యం, తాగునీరు, పారిశుధ్యం, మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వైద్య సంస్థల మౌలిక సదుపాయాల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులను ప్రాధాన్యతతో కేటాయించాలని సూచించారు. జిల్లాలోని పరిశ్రమలు తమ సామాజిక బాధ్యతలో భాగంగా ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకొని ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగే అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. జిల్లాలోని ఆయా అవసరాలను గుర్తించి, కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో వాష్ రూమ్స్ , కాంపౌండ్ వాల్స్ , కిచెన్ షేడ్స్, డైనింగ్ హాల్,డార్మెంటరీ, బెడ్స్, అదనపు క్లాస్‌రూమ్‌ల నిర్మాణం, ఫర్నిచర్, తాగునీటి సౌకర్యాలు, పారిశుధ్య వసతుల కల్పనకు సీఎస్ఆర్ నిధులను ప్రాధాన్యతగా వినియోగించాలని మంత్రి తెలిపారు. సీఎస్ఆర్ ప్రతిపాదనల అమలు,




పురోగతిపై సంబంధిత అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టి, ప్రతిపాదిత పనులు సకాలంలో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. జిల్లాలోని పరిశ్రమలు సామాజిక అభివృద్ధిలో భాగస్వాములై ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు తోడ్పడాలని పిలుపునిచ్చారు.సీఎస్ఆర్ కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై మంత్రి వారికి పలు సూచనలు చేసారు. ప్రజా ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, ఆర్డీవోలు, సంబంధిత శాఖల అధికారులు, పరిశ్రమలు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పెద్దపల్లి, మే 30 : 2026-27 విద్యా సంవత్సరానికి జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్)లో 1వ, 5వ తరగతుల ప్రవేశాలకు అర్హులైన ఎస్సీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. 1వ తరగతి నాన్ రెసిడెన్షియల్‌లో 70, 5వ తరగతి రెసిడెన్షియల్‌లో 73 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కాగా గ్రామీణ ప్రాంతాల అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారి ఆదాయం రూ. 2 లక్షల లోపు ఉండాలి. 1వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసే విద్యార్థులు 01-06-2020 నుంచి 31-05-2021 మధ్య జన్మించి ఉండాలి. ఒక కుటుంబం నుంచి ఒకరికి మాత్రమే అర్హత ఉంటుంది. దరఖాస్తు ఫారాలను జూన్ 5 వరకు జిల్లా కలెక్టర్ కాంప్లెక్స్‌లోని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో పొందవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తులను అవసరమైన ధ్రువపత్రాలతో జూన్ 6 సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలి. జూన్ 10న లాటరీ పద్ధతిలో విద్యార్థుల ఎంపిక చేపడతామని కలెక్టర్ తెలిపారు. మరిన్ని వివరాలకు 9014327045, 9989354155 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# భువనగిరిలో జెండర్ రిసోర్స్ సెంటర్ ప్రారంభం

**- ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ తంగెళ్లపల్లి శ్రీవాణి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



యాదాద్రి భువనగిరి, మే 30 : మహిళల సమస్యల పరిష్కారం, కుటుంబ వివాదాల నివారణకు తోడ్పడే ఉద్దేశంతో డీఆర్‌డీఏ-సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండర్ రిసోర్స్ సెంటర్ (జీఆర్‌సీ) ను భువనగిరి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తంగెళ్లపల్లి శ్రీవాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ, కుటుంబ సమస్యలు, మహిళల హక్కులు, లింగ వివక్ష, గృహ హింస, ఆరోగ్యం, పోషకాహారం వంటి అంశాలపై బాధితులకు ఉచితంగా న్యాయ, మానసిక సలహాలు అందించడం కేంద్రం ప్రధాన లక్ష్యమని తెలిపారు. మండల స్థాయి సోషల్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ కేంద్రం పనిచేస్తుందని, అవసరమైన వారు నేరుగా వచ్చి సేవలు పొందవచ్చని సూచించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ తంగెళ్లపల్లి శ్రీవాణి రవికుమార్‌ను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ యాసిన్, జడ్పీ డిప్యూటీ సీఈవో శ్రీనివాస్, ఎంపీడీవో దినకర్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రసాల శిరీష, కార్యదర్శి ఏదునూరి వాణి, కోశాధికారి కవిత, ఏపీఎం పాశికంటి మల్లేశం, సీసీలు అఫ్సర్, అలివేలు, మల్లేష్, కవిత, అకౌంటెంట్ పుష్పతో పాటు జీఆర్‌సీ సోషల్ యాక్షన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# వర్షపు నీటి ప్రతి బొట్టును భూమిలోకి పంపాలి..

**-జల సంచయ్ పనుల ఫోటోలు వెంటనే అప్‌లోడ్ చేయాలి -పెండింగ్ దరఖాస్తులు, అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం సహించం -జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే 30 : జల సంచయ్ జన్ భాగేదారి (జెఎస్‌జెబి) కార్యక్రమం కింద జిల్లాలో పూర్తయిన అన్ని పనులకు సంబంధించిన ఫోటోలను యుద్ధ ప్రాతిపదికన ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం ఉదయం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, జల సంచయ్ జన్ భాగేదారి కార్యక్రమం, నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్, జాతీయ ఉపాధి హామీ పథకం అమలుపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జల సంచయ్ జన్ భాగేదారి కార్యక్రమంపై సమీక్షిస్తూ, జిల్లాలో పడే ప్రతి వర్షపు నీటి బొట్టును భూమిలోకి ఇంకించి భూగర్భ జలాలను పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1.14 లక్షల పనులు పూర్తి చేశామని, వాటన్నింటికి సంబంధించిన ఫోటోలను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియకు రేపు సాయంత్రం వరకు మాత్రమే గడువు ఉండటంతో అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పనులను పూర్తి చేయాలని సూచించారు. నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్‌పై సమీక్ష నిర్వహిస్తూ, నిరుపేద కుటుంబ యజమాని మరణించిన సందర్భంలో కుటుంబానికి రూ. 20 వేల ఆర్థిక సహాయం అందించే ఈ పథకాన్ని అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేయాలని ఆదేశించారు. 2017 నుంచి కుటుంబ యజమానిని కోల్పోయిన కుటుంబాల వివరాలను సేకరించి వారికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలకు సూచించారు. ప్రతి పంచాయతీ కార్యదర్శి, టెక్నికల్ అసిస్టెంట్ బాధ్యతగా తీసుకుని బాధిత కుటుంబాల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఎంపీడీవో ద్వారా ఆమోదం పొందేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు కేవలం 265 దరఖాస్తులు మాత్రమే అందాయని, వాటిలో 205 దరఖాస్తులు ఎంపీడీవో లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతీయ ఉపాధి హామీ పథకంపై సమీక్షిస్తూ జిల్లాలో 1,00,602 యాక్టివ్ జాబ్ కార్డులు ఉన్నాయని, వాటిలో కనీసం 40 శాతం మంది కూలీలకు ప్రతిరోజూ ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి గ్రామపంచాయతీలో ఇంకుడు గుంతలు మంజూరు చేయడంతో పాటు కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, ప్రభుత్వ భవనాల్లో వర్షపు నీటి సంరక్షణ కోసం ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి పనులు పూర్తి చేయాలని సూచించారు. రాబోయే వన మహోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని మొక్కలు నాటేందుకు అవసరమైన గుంతలను ముందుగానే తవ్వించి సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అంకితభావంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్. ఖీమ్యా నాయక్, జడ్పీ సీఈఓ యాదయ్య, డీఆర్‌డీఓ పీడీ ఉమాదేవి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మరిపెడలో భారీగా బెల్లం పానకం ధ్వంసం...

**10 ద్విచక్ర వాహనాలు సీజ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, మే 30 : అక్రమ సారా తయారీ, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. శనివారం ఉదయం 5 గంటల నుండి 7 గంటల వరకు మరిపెడ మండలం పరిధిలోని కోటియా తండా గ్రామ పంచాయితీలో ఉన్న చౌల తండా, జాల్ తండా, అర్లగడ్డ తండాల్లో పోలీసులు కట్టుదిట్టమైన కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ తనిఖీలో సుమారు 50 లీటర్ల సారా, 4 క్వింటాళ్ల బెల్లం, 50 కిలోల పట్టికను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమ సారా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 1000 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. పత్రాలు సక్రమంగా లేని 10 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. అక్రమ కార్యకలాపాల నియంత్రణలో భాగంగా ఇటువంటి తనిఖీలు మరింత విస్తృతంగా కొనసాగుతాయని మరిపెడ సీఐ ఎల్. పవన్ కుమార్ అన్నారు. మరిపెడ ఎస్ఐ గంద్రాతి సతీష్ మాట్లాడుతు మండల పరిధిలో అక్రమ సారాయి నిర్మూలన కోసం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని గ్రామాల్లో తరచూ తనిఖీలు నిర్వహిస్తూ నేర కార్యకలాపాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. ఈ కార్డన్ అండ్ సెర్చ్‌లో చిన్నగూడూరు ఎస్ఐ కుశ్ కుమార్‌తో పాటు 25 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి

**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**- ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సిరిసిల్లలో పరిశీలన**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల, మే 30 : వైద్యులు, సిబ్బంది రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శనివారం జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఐ ఎం యూ, ఐసీయూ, ఎస్ఎన్ సీయూ, మెటర్నిటీ వార్డుల్లో పరిశీలించి.. రోగులతో మాట్లాడారు. వైద్య సేవలపై ఆరా తీశారు. రోజు ఎంత మంది పేషెంట్లు వస్తున్నారో అని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది నిత్యం సమయానుసారంగా అందుబాటులో ఉండాలని సూచించారు. ఎండాకాలం నేపథ్యంలో ప్రజలకు జాగ్రత్తలు తెలియజేయాలని పేర్కొన్నారు. వైద్య సేవలు ఎలా ఉన్నాయి? ఆసుపత్రిలో వైద్య సేవలు ఎలా అందుతున్నాయని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆరా తీశారు. చిన్నారితో ఉన్న మహిళతో మాట్లాడారు. ఆసుపత్రికి ఎప్పుడు వచ్చారు? పాప ఆరోగ్య పరిస్థితి తదితర అంశాలు అడిగి తెలుసుకున్నారు.



**ఉన్నత విద్యను అభ్యసించాలి**

ఐఎంయూ వార్డులో చికిత్స పొందుతున్న బాలుడు, బాలికతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ఏ అనారోగ్య సమస్యతో వచ్చారో.. ఆరా తీసి.. ఎక్కడి వరకు చదువుకున్నారు. అడిగి తెలుసుకున్నారు. తంగళ్ళపల్లి మండలం మండేపల్లిలోని అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, ఐటీఐలో స్వయం ఉపాధి కోర్సులు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వారు పూర్తి వివరాలతో వెళ్లి కలవాలని తెలిపారు. కోర్సుల్లో ఉచిత విద్య ఉంటుందని, మంచి ఉపాధి దొరుకుతుందని పేర్కొన్నారు. పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పరిశీలనలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, వైద్యులు సంతోష్, సుమన్ మోహన్ రావు, తహసీల్దార్ మహేష్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.



# లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి (దేవరకద్ర), మే 30: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా దేవరకద్ర నియోజకవర్గంలోని చిన్న చింతకుంట మండలానికి చెందిన 21 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు ఎంపికైన లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని త్వరితగతిన గృహ నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తూ అర్హులందరికీ ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. లబ్ధిదారులు తమకు ప్రొసీడింగ్స్ అందజేసిన ఎమ్మెల్యేకు, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.





# బాల్య వివాహాలకు చెక్ పెట్టాలి

**- రక్తహీనతపై అప్రమత్తం కావాలి: - కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**- పోక్సో చట్టంపై అవగాహన పెంచుకోవాలి... - ఎస్పీ సునీతా రెడ్డి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే 30 : అమ్మాయిలు బాల్య వివాహాలను ధైర్యంగా వ్యతిరేకించాలని, రక్తహీనత వంటి ఆరోగ్య సమస్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పిలుపునిచ్చారు. బాలికలు పోక్సో చట్టంపై అవగాహన పెంచుకుని ప్రతి అంశాన్ని ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్నేహ (కిశోర బాలికల సంఘాలు) మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలికలు ప్రధానమంత్రి, స్పీకర్, ఎంపీల పాత్రలను పోషిస్తూ మాక్ పార్లమెంట్‌ను ఉత్సాహంగా నిర్వహించారు. మహిళా సంక్షేమం, మహిళల ఆరోగ్యం, అభివృద్ధి, వరి కొనుగోలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పలు సామాజిక అంశాలపై చర్చించి తమ అభిప్రాయాలను వెల్లడించారు.

కార్యక్రమంలో మాట్లాడిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, కిశోర బాలికల కోసం ప్రత్యేక సంఘాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సమాజంలో ఐక్యత, అవగాహన ఎంతో అవసరమని పేర్కొన్నారు. మాక్ పార్లమెంట్ ద్వారా బాలికల్లో నాయకత్వ లక్షణాలు, ప్రజా సమస్యలపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. విద్యార్థినులు రక్తహీనత, మహిళా ఆరోగ్యం, సామాజిక సమస్యలపై ప్రశ్నలు అడగడం సంతోషకరమని పేర్కొన్న కలెక్టర్, ప్రతి ఒక్కరూ రక్తహీనత పరీక్షలు చేయించుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా స్ఫూర్తి పొంది యువతులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. బాల్య వివాహాలు సమాజ అభివృద్ధికి అడ్డంకిగా మారతాయని, వాటిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సూచించారు. ఉన్నత విద్య పూర్తయ్యే వరకు వివాహాల గురించి ఆలోచించవద్దని బాలికలకు సూచించారు. గత మూడు సంవత్సరాల్లో జిల్లాలో 60 బాల్య వివాహాలను గుర్తించినట్లు వెల్లడించారు. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం అందితే వెంటనే 1098 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.

జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి మాట్లాడుతూ, బాలికలు మధ్యలో చదువులు మానేయకుండా ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ లక్ష్యాలను సాధించాలని అన్నారు. ప్రస్తుత కాలంలో బాలికలు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని, వాటిని అవగాహనతో అధిగమించాలని సూచించారు. యాంటీ సోషల్ ఎలిమెంట్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరికీ పోక్సో చట్టంపై అవగాహన ఉండాలని తెలిపారు. ఏ అంశాన్నైనా ప్రశ్నించే ధైర్యం పెంపొందించుకోవాలని, అవసరమైన సందర్భాల్లో స్పష్టంగా "నో" చెప్పగలిగే ఆత్మవిశ్వాసాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన కమిషన్ చెక్కులు, ఎఫ్‌పీఓ సంఘాలకు సంబంధించిన చెక్కులను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. బాలికల సంరక్షణకు సంబంధించిన అవగాహన వాల్ పోస్టర్లను కూడా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ ఉమాదేవి, డీఎస్పీ బాలాజీ నాయక్, డీసీఓ రాణి, డీఐఓ జ్యోతి, డీడబ్ల్యూఓ సుధారాణి, డీఎంహెచ్‌వో సాయినాథ్ రెడ్డి, డీఐఈఓ నరేంద్ర, కేజీబీవీ అధికారులు, మహిళా సమాఖ్య ప్రతినిధులు, విద్యార్థినులు, స్నేహ సంఘాల సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# పదవి విరమణ పొందిన ఇంజనీర్ రాందాస్

**సన్మానం చేసిన ఎఐటియుసి నాయకులు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటి (గోదావరిఖని), మే 30 : సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని జిడికె 11వ ఇంక్లైన్ లో పిట్ ఇంజనీర్ గా విధులు నిర్వహించిన శ్రీ రాందాస్ శనివారం పదవీ విరమణ పొందిన సందర్భంగా, గుర్తింపు సంఘం ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆధ్వర్యంలో గని పై ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను రాందాస్ దంపతులకు పూల బొకే అందించి, శాలువా కప్పి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. రాందాస్ దంపతుల శేష జీవితం ఆనందంగా ఆరోగ్యంగా ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గని అధికారులతో పాటు ఏఐటియుసి నాయకులు సిద్దమల్ల రాజు, నాయిని శంకర్, గొడిశల నరేష్, జాన్ కెనడీ, జక్కుల శ్రీనివాస్, పర్లపెల్లి రామస్వామి తదితరులు పాల్గొని రాందాస్ సేవలను కొనియాడారు.



## కుల మతాల కతీతంగా గ్రామ ప్రజలు కలిసి జీవించాలి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, మే 30 : గ్రామ ప్రజలంతా కుల మతాల కతీతంగా కలిసి మెలిసి ఒకే కుటుంబంలా బతకాలని కార్పొరేషన్ 29వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మరాజుల రజని కోరారు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామంలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు కుల వివక్షతను రూపుమాపి ప్రజలంతా ఐక్యంగా ఉండాలని దళితులను చిన్న చూపు చూడవద్దని కార్పొరేటర్ రజిని కోరారు అంబేద్కర్ లాంటి మహనీయులు చూపిన మార్గంలో నడుస్తూ దళిత కాలనీ సమస్యల పరిష్కారం అభివృద్ధి కోసం పనిచేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ పాలన అధికారి మర్రిశంకర స్వామి జూనియర్ అసిస్టెంట్ కె శ్రీనివాస్ అంతర్గాం పోలీస్ అధికారి సంతోష్ దళిత సంఘాల ప్రతినిధులు మాజీ సర్పంచ్ ఎన్నికల శంకరయ్య నాయకులు కాంపల్లి చంద్రయ్య అర్జునపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పంట అవశేషాలు కాల్చిన వారిపై చర్యలు తీసుకోండి

### - ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి ఎస్పీకి వినతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, మే 30 : పంట అవశేషాలను కాల్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి వినతిపత్రం అందించారు. మహబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో శబరీష్‌ని మరిపెడ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి మర్యాద పూర్వకంగా శనివారం కలిశారు. వ్యవసాయ శాఖ అవగాహన కల్పించినప్పటికీ కొంత మంది రైతులు తమ పంట అవశేషాలను కాల్చడం వలన భూమి భూసారం దెబ్బతిని దిగుమతి రాకపోగా, మంటలతో పక్కనే ఉన్న జామాయిల్,ఆయిల్ ఫామ్ మొక్కలు మోటార్లు, పైపులు కాలిపోవడం, భారీ ఎత్తున ఆస్తి నష్టం, ప్రాణ నష్టం సంభవిస్తు న్నాయని దీనిపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకునే విధంగా దిశా నిర్దేశం చేయాలని వారిని కోరారు. దీనికి స్పందించిన ఎస్పీ తమ సిబ్బందిని మరింత అప్రమత్తం చేస్తామని అన్నారు.



## ఉద్యోగాన్ని బాధ్యత కాకుండా సేవగా భావించిన టీచర్ విమల

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, మే 30 : అంగన్వాడీ టీచర్ గా 43 సంవత్సరాలు ఉద్యోగ బాధ్యత అనుకోకుండా సేవయే లక్ష్యమని నిరంతరం శ్రమించిన అంగన్వాడి టీచర్ పెండ్యాల విమల అంగన్వాడీ టీచర్లకు ఆదర్శం స్ఫూర్తిగా నిలుస్తోందని పలువురు అన్నారు. శనివారం అంతర్గాం మండలం మొర్మూర్ గ్రామ అంగన్వాడీ కేంద్రంలో 43 సంవత్సరాలు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన విమలను ఘనంగా సత్కరించి సన్మానించి మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రంలో విమల నేర్పించిన ఓనమాలు నేర్చుకున్న వారు ఎందరో ఈనాడు ఉన్నత చదువులు ఉన్నత స్థానాలలో ఉన్నారని ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గుర్తు చేశారు. విమల ఉద్యోగ విరమణ చేసినప్పటికీ ఆమె చేసిన సేవలు నిరంతరం అందరిని గుర్తు చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మగ్గిడి స్వరూప శ్రీనివాస్, మండల పరిషత్ అధికారి తిరుపతి, కార్యదర్శి ఎస్.కమల, పెద్దపల్లి జిల్లా పిడి వేణు గోపాల్ రావు, సిడిపిఓ అలేఖ్య పటేల్, స్వరూప రాణి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు హరి లత, కుక్కల గూడూర్ మాజీ ఎంపీటీసీ బొడ్డు రాయమల్లు, శివాలయ ఆలయ కమిటీ అధ్యక్షులు వియ్యాల సుధాకర్, విమల సత్యనారాయణ శర్మ కుటుంబ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ పై బిఎల్వోలతో సమావేశం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 30 : భారతీయ జనతా పార్టీ మేడిపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న ఓటర్ లిస్ట్ ప్రక్షాళన (సర్) కార్యక్రమంపై (బిఎల్వో) 02లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నూతనంగా ఎన్నికైన ముంజ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ మేడిపల్లి మండల అధ్యక్షులు చిట్యాల సురేష్ మాట్లాడుతూ, మండలంలోని అన్ని గ్రామాలలో అంగన్‌వాడీ టీచర్లు (బిఎల్వోలు) నిర్వహిస్తున్న ఓటర్ లిస్ట్ మ్యాపింగ్ కార్యక్రమా నికి అందరూ సహకరించాలని కోరారు. అలాగే గ్రామస్థాయిలో జరుగుతున్న ఓటరు ప్రక్షాళన విధివిధానాలను పార్టీ కార్యకర్తలు, బిఎల్వోలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంట్ కో-కన్వీనర్ క్యాతం దశరథ్ రెడ్డి, దమ్మన్నపేట గ్రామ సర్పంచ్ లక్ష్మీపతి, గుండ్లపల్లి గ్రామ సర్పంచ్ శ్రావణి రవికుమార్, మాజీ సర్పంచ్ తౌటి తిరుపతి రెడ్డి, బత్తుల రమేష్, భారతీయ జనతా పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోస్కి మధు, మండల నాయకులు హనుమాడ్లు, ఉపాధ్యక్షులు ఆదే రమేష్, హన్మంత్ చారి, మండల నాయకులు దాసరి రఘు, గణేష్, బూత్ అధ్యక్షులు బోయిని రఘు, నరేందర్, అల్లే రాజేష్, సత్యనారాయణ, గంగాధర్, వార్డ్ మెంబర్లు మెట్టు ప్రకాష్, ఉరుమడ్ల మహేష్, రాజు, భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరపాలి

### - జూన్ 2 వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

### - కలెక్టర్ ఆదర్శ్ సురభి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే 30 : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను జూన్ 2న ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణపై జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించిన కలెక్టర్, వేడుకల విజయవంతమైన నిర్వహణకు సంబంధించి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. జూన్ 2న సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించే అధికారిక వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించేలా అన్ని శాఖలు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, అధికారులు, ఆహ్వానితులు, వివిధ రంగాల ప్రతినిధులకు ఆహ్వాన పత్రికలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమ వేదిక, అతిథుల కూర్చునే ఏర్పాట్లు, పార్కింగ్, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వేడుకల సందర్భంగా పోలీసు గౌరవ వందనం నిర్వహించడంతో పాటు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమ ప్రాంగణంలో తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, రాష్ట్ర ఆవిర్భావ పోరాట స్ఫూర్తిని ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేసే విధంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రదర్శన స్టాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వేడుకల నిర్వహణలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్, ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, జెడ్పీ సీఈఓ యాదయ్య, సీపీఓ హరికృష్ణ, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అచ్చాదిన్ ఆగాయే అన్నాడు మోడి సచ్చే ధరలు పెంచాడు

### - పెంచిన ధరలుదించాలి - ప్రజాపంథానేతడిమాండ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




రామగుండం, మే 30 : బిజెపి మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాతనే ప్రజలకు మాటల కానుక కార్పొరేట్ కంపెనీలకు మూటల కానుకలు ఇస్తున్నారని సిపిఐ ఎంఎల్ (మాస్ లైన్) ప్రజాపంథా పెద్దపల్లి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ ఆరోపించారు శనివారం. పెద్దపెల్లి జిల్లా కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో ప్రజాపంథా ఆధ్వర్యంలో పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు దించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన నిరసన రాస్తారోకో అనంతరం మాట్లాడారు. అచ్చా దిన్ ఆగయే అంటూ ప్రజలకు పెట్రోల్ డీజిల్ నిత్యావసర సరుకులను పెంచి సచ్చే తట్టు చేస్తున్న మోడీకి బుద్ధి చెప్పాలని శ్రీనివాస్ అన్నారు. బిజెపి మతతత్వ పార్టీ అని ప్రజలకు చెప్పాలని కోరుతున్నాం ఎన్నడూ లేనివిధంగా ప్రపంచ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధర తగ్గుతున్నప్పటికీ పెట్రోల్ మాత్రం తగ్గడం లేదని కార్పొరేట్ కంపెనీలు సమర్ కంపెనీలకు ఇష్టం వచ్చినట్లుగా దోచుకోమని మోడీ సెలవిచ్చారని శ్రీనివాస్ ఆరోపించారు. పేద ప్రజలు మాత్రం పెట్రోలు కొనకండి బంగారం కొనకండి తిండి తినకండి పొదుపుగా ఉండండి అదే దేశభక్తి అంటూ చల్లగా సెలవిస్తున్నాడని ఈ మాటల మర్మం తెలుసుకొని మనం మసలాలని శ్రీనివాస్ కోరారు. పెంచిన పెట్రోల్ డీజిల్ నిత్యావసర సరుకుల ధరలు దించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపట్టి మోడీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పిస్తామని అన్నారు. మన చేతిలో ఉన్న సెల్ ఫోన్ ద్వారా పెట్రోల్ డీజిల్ నిత్యావసర వస్తువుల ధరలు దించాలని సోషల్ మీడియా ద్వారా తమ తమ నిరసనలు కేంద్ర ప్రభుత్వానికి చేరే విధంగా పోస్టులు పెట్టాలని శ్రీనివాస్ ప్రజలను కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు గుమ్మడి వెంకన్న ఆడేపు శంకర్ గొల్లపల్లి చంద్రన్న పివైఎల్ రాష్ట్ర నాయకులు భూషణ వేణి కృష్ణ ఈసంపల్లి రాజేందర్ బుషిపాక దేవన్న రవి శ్రీనివాస్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల సదస్సుకు భారీగా తరలిరండి

### - కేకే కమిటీ సభ్యులతో కీలక సమావేశం విజయవంతం చేయాలి: - మండ్ల దేవన్న నాయుడు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే 30 : హైదరాబాద్‌లో ఈ నెల 31న నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల సదస్సు, కేకే కమిటీ సభ్యులతో జరిగే సమావేశానికి ఉద్యమకారులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి మండ్ల దేవన్న నాయుడు పిలుపునిచ్చారు. ఆయన శనివారం విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఈ కీలక సమావేశం జరగనుందని తెలిపారు.తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల సమస్యలు, సంక్షేమం, భవిష్యత్ కార్యాచరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీతో చర్చలు జరగనున్నాయని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్‌ప్రభుత్వ హయాంలో పదేళ్లపాటు తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను నిర్లక్ష్యం చేశారని, ఉద్యమకారులకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారుల సమస్యలను గుర్తించి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం స్వాగతించదగిన పరిణామమన్నారు. అలాగే ఉద్యమకారులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు, 250 గజాల ఇంటి స్థలాలు అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం అభినందనీయమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు ఇది న్యాయం చేసే దిశగా కీలక అడుగుగా అభివర్ణించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్న ముఖ్యమంత్రి గా. రేవంత్ రెడ్డి కు, వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి కి ఉద్యమకారుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. వనపర్తి జిల్లా నుంచి తెలంగాణ ఉద్యమకారులు, ప్రజా సంఘాల నాయకులు, యువత పెద్ద సంఖ్యలో సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని మండ్ల దేవన్న నాయుడు కోరారు. ఈ సమావేశంలో ఉద్యమకారుల హక్కులు, సంక్షేమ చర్యలు, భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

# ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి : ఏఐఎస్ఎఫ్ వినతి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, మే 30 : మోత్కూరు మండలంలోని పలు గ్రామాల్లో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ మాట్లాడుతూ, వలిగొండ--తిరుమలగిరి ప్రధాన రహదారిపై మోత్కూరు మండలంలోని పాలడుగు, దత్తప్పగూడెం, అనాజిపురం, పాటిమట్ల గ్రామాల వద్ద భారీ వాహనాలు, గూడ్స్ లారీలు అధిక వేగంతో సంచరిస్తున్నాయని తెలిపారు. గ్రామస్తులు రహదారిని దాటే సమయంలో తరచూ ప్రమాదాలు జరుగుతూ ప్రాణనష్టం సంభవిస్తున్నందున ఆయా గ్రామాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. అలాగే మోత్కూరు-రాయగిరి రహదారిలో రాజన్నగూడెం గ్రామ సమీపంలో రోడ్డు దెబ్బతిన్న కారణంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో మరమ్మతు పనులు చేపట్టి, తగిన హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలపై వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జిట్టా గౌతమ్, కర్ణాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి నదిలో డీసిల్టేషన్ రద్దు చేయాలని వినతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ములుగు, మే 30 : గోదావరి నదిలో డిస్టిలేషన్ రద్దు చేయాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో శనివారం నాడు ములుగు జిల్లా అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రత్నం రాజేందర్ మాట్లాడుతూ గోదావరి నదిలో డీసిల్టేషన్ ను రద్దు చేయాలి అని వెంక టాపురం మండలం యాకన్న గూడెం గ్రామం నుండి సుడిబాక గ్రామం వరకు గోదావరి నదికి కరకట్ట నిర్మించాలి అని, పాత పద్ధతుల్లోనే ఇసుక క్వారీలను కొనసాగించాలి అని,2018 నుండి పెండింగ్ లో ఉన్న బోనస్ వెంటనే చెల్లించాలి అని ఇసుక ద్వారా వచ్చే లాభాలను ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి కేటాయించాలి అని వెంకటాపురం మండలంలోని ఎదిర, సూరవీడు,బోదాపురం, గ్రామపంచాయతీలలో వివిధ గ్రామాలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీతమ్మసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ పేరుతో వెంకటాపురం మండలం గోదావరి నదిలో సుమారు 15 కిలోమీటర్ల విస్తీర్ణంలో గోదావరి నదిలో 4 వేల ఎకరాలలో సుమారు 3 కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుకను తొలగించాలని ప్రభుత్వ ఉన్నత అధికారులు ప్రభుత్వ అనుమతికి వేచి చూస్తున్నారు.గత నాలుగు సంవత్సరాలుగా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టులో తీర్పు పెండింగ్ ఉండి,ఆగిపోయిన సీతమ్మ సాగర్ కు వెంకటాపురం మండలంలో గోదావరి నదిలో ఈ డిసిల్టేషన్ కేవలం ఇసుక మాఫియా బడా బాబుల కోసం చేపడు తున్నట్లు అనుమానం వస్తుంది అన్నారు.సీతమ్మ సాగర్ ప్రాజెక్టు కు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ మండలంలో మూడు కోట్ల క్యూబిక్ మీటర్లు ఇసుక ద్వారా కోట్ల రూపాయలు లాభం పొందేది ఇసుక కాంట్రాక్టర్ లే కానీ ఈ ప్రాంత గిరిజనులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది అన్నారు.గోదావరి నదిలో కోట్లాది క్యూబిక్ మీటర్ల ఇసుకను తీయడం వల్ల పర్యావరణ ఒకవైపు,మరోవైపు గోదావరిలో భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉంది తద్వారా ఈ ప్రాంత వ్యవసాయం తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది,సాగునీరు,తాగు నీరు సమస్యలను గిరిజనులు ఎదుర్కోవాల్సి వస్తుంది అన్నారు.గత కొద్ది సంవత్సరాలుగా వస్తున్న తీవ్రమైన వరదలకు గోదావరి ఒడ్డున ఉండే సాగుభూములు వందల సంఖ్యలో కోతలకు గురి అవుతున్నాయి.బి దీంతో రైతు కుటుంబాలు జీవన ఉపాధి కోల్పోతున్నారు.ఇసుక క్వారీల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని ఏజెన్సీ ప్రాంతాల్లో రోడ్లు,విద్య,వైద్యం మెరుగైన సౌకర్యాలు కొరకు ఇసుక ఆదాయాన్ని వెచ్చించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు దామెర కిరణ్,రత్నం ప్రవీణ్,కొర్ర రాజు, తోకల రవి,బాలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



## రాయగిరి దుర్గామాత ఉత్సవాలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఆహ్వానం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, మే 30 : భువనగిరి పట్టణంలోని రాయగిరి దుర్గామాత ఉత్సవాలను జూన్ 2,3తేదీలలో ఘనంగా నిర్వహించనున్న నేపథ్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణ వివరాలను మంత్రికి తెలియజేసి, ప్రత్యేక కార్యక్రమాలకు హాజరై దుర్గామాత ఆశీస్సులు పొందాలని కోరారు. ఆహ్వానాన్ని స్వీకరించిన మంత్రి ఉత్సవాల విజయవంత నిర్వహణకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్య క్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ పల్లెర్ల యాదగిరి, నర్ర శేఖర్. రఘుమా రెడ్డి, సుధగాని రాజు నర్సింహా, మధు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ సభ్యత్వానికి గుగ్గిల్ల రవి గౌడ్ రాజీనామా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జగిత్యాల, మే 30 : తెలంగాణ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు గుగ్గిల్ల రవి గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఐఎఫ్ఎస్ (రిటైర్డ్), తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్ ఎం.వినోద్ కుమార్ కు రాజీనామా లేఖ పంపినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రవి గౌడ్ మాట్లాడు తూ.. గల్ఫ్ కార్మిక ఉద్యమ నేపథ్యం కలిగిన వ్యక్తిగా నాకు కమిటీలో సభ్యత్వం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తదితర పెద్దలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి సూచనలు అందించడం, అలాగే గల్ఫ్ బోర్డు సమగ్ర గల్ఫ్ ఎన్నారై విధానాన్ని రూపొందించడం కోసం ప్రభుత్వం తేది 10.04.2025న అధ్యయన కమిటీని ఏర్పాటు చేసిందని, అయితే దాదాపు 14 నెలలు పూర్తవుతున్న ప్పటికీ, ప్రభుత్వం, అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రుల నుండి తగిన సహకారం అందకపోవడం వల్ల కమిటీ తన విధులను ఆశించిన స్థాయిలో నిర్వర్తించలేకపోయిందన్నారు. గల్ఫ్ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్న నేపథ్యంలో, తీవ్ర మనస్తాపానికి గురై, తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ సభ్యత్వానికి రాజీనామా సమర్పిస్తున్నానని రవి గౌడ్ తెలిపారు. దయచేసి తన రాజీనామాను ఆమోదించాలని కోరారు.

## ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మామిడి రైతులకు శిక్షణ కార్యక్రమం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జగిత్యాల, మే 30 : ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో శనివారం మేడిపల్లి మండలంలోని పోరుమల్ల గ్రామంలో మామిడి తోటల్లో కోతల అనంతరం తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ.. మామిడి తోటలలో కాయలు తెంపిన వెంటనే చెట్లు ఒత్తిడికి గురై బలహీనపడి వడలిపోయే ఆస్కారం ఉంటుందని, కావున చెట్లకు నీరు పుష్కలంగా అందించాలని సూచించారు. సంవత్సరం పొడ వునా పాటించవలసిన నెల వారి సాగు పద్ధతుల గురించి రైతులకు వివరించారు. అదేవిధంగా ప్రతి సంవత్సరం పూత విపరీతంగా వచ్చినప్పటికీ, పురుగు మందులు విచ్చలవిడిగా వాడడం వలన తేనెటీగలు తోటలను సందర్శించకపోవడం వలన పరాగ సంపర్కం జరగక, పిందె తక్కువగా ఏర్పడి తక్కువ దిగుబడి రావడం జరుగుతుందని తెలిపారు. కాయలు తెంపిన వెంటనే కార్బన్డిజం కలిపిన ద్రావణంలో కడిగి మార్కెట్ కు పంపితే కాయలపై సోన మరకలు పోయి మంచి ధర పలుకుతుందని వివరించారు. ఉద్యాన శాఖ ద్వారా అందిస్తున్న వివిధ అభివృద్ధి పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పోరుమల్ల గ్రామ సర్పంచ్ అంజన్న, ఉప సర్పంచ్ ప్రణయ్, హెచ్ ఈవో అనిల్ కుమార్, కట్లకుంట, పోరుమల్ల రైతులు పాల్గొన్నారు.



## మద్దులపల్లి పంట పొలాల్లో భారీ అగ్నిప్రమాదం

### - మంటల అదుపుకు ఫైర్ సిబ్బంది తీవ్ర యత్నం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాటారం, మే 30 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ పూర్ మండలంలోని మద్దులపల్లి గ్రామంలో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు సంభవించిన షార్ట్ సర్క్యూట్ కారణంగా పంట పొలాల్లో నిల్వ ఉంచిన కొయ్య కాళ్లకు మంటలు అంటుకుని వేగంగా వ్యాపించాయి. మంటలు శరవేగంగా వ్యాపిస్తూ సమీప ప్రాంతాలకు చేరుకునే ప్రమాదం ఉండటంతో స్థానిక సర్పంచ్ సరిత వెంటనే అగ్నిమాపక శాఖ అధికారు లకు సమాచారం అందించారు. దీంతో రెండు ఫైర్ ఇంజన్లు ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడానికి సహాయక చర్యలు చేపట్టాయి. అగ్నిమాపక సిబ్బంది, గ్రామస్థుల సహకారంతో మంటలు మరింత విస్తరించకుండా నిరోధించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ ఘటనలో పంట పొలాల్లో నిల్వ ఉంచిన కొంత వ్యవసాయ సామగ్రి దగ్ధమైనట్లు సమాచారం. ఘటన స్థలంలో ఉప సర్పంచ్ లచ్చిరెడ్డి, గ్రామ పెద్దలు, స్థానిక రైతులు పాల్గొని సహాయక చర్యల్లో భాగస్వాములయ్యారు. అగ్నిప్రమాదానికి గల పూర్తి నష్ట వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.




# ప్రజాస్వామ్య స్ఫూర్తిని విద్యార్థుల్లో పెంపొందించడమే లక్ష్యంగా మాక్ పార్లమెంట్

### - జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ - మన హక్కులు - మన గొంతు" నినాదంతో మాక్ పార్లమెంట్ నిర్వహణ- సభాపతులుగా, మంత్రులుగా మారిన విద్యార్థినులు




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మే 30 : ప్రజాస్వామ్య స్ఫూర్తిని విద్యార్థుల్లో పెంపొందించడమే లక్ష్యంగా మాక్ పార్లమెంట్ నిర్వహణ ఉద్దేశ్యం అని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. శనివారం, బాలల హక్కులు, బాలికల భద్రత, విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, సామాజిక సమస్యలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో 99 రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ–గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్నేహ సంఘాల సభ్యుల మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు.జిల్లాలోని వివిధ మండలాల నుంచి ఎంపికైన బాలికలు సభాపతి,మంత్రులు,ప్రతిపక్ష సభ్యులు,ప్రజా ప్రతినిధుల పాత్రలను పోషిస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థ పనితీరును ప్రత్యక్షంగా నిర్వహించారు.సభా నిర్వహణ, చర్చలు, ప్రశ్నోత్తరాల ద్వారా తమ ఆలోచనలను ధైర్యంగా వ్యక్తపరిచారు.మాక్ పార్లమెంట్లో విద్యార్థులు బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నిర్మూలన,బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలికల భద్రత, విద్యా సౌకర్యాలు, ఆరోగ్య సేవలు,పోషకాహారం, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లో బాలికల విద్యాభివృద్ధికి మరిన్ని అవకాశాలు కల్పించాలని, పాఠశాలల్లో పరిశుభ్రమైన మరుగుదొడ్లు,సురక్షిత వాతావరణం, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు. బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు బాల కార్మిక (నిషేధం మరియు నియంత్రణ) చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని విద్యార్థులు కోరారు. ప్రతి బాలుడు విద్యను పొందే హక్కు కలిగి ఉన్నందున చిన్నారులను పనుల్లో నిమగ్నం చేయకుండా పాఠశాలల్లో చేర్పించేందుకు సమాజం బాధ్యత వహించాలని అభిప్రాయపడ్డారు. బాలికల భద్రతకు సంబంధించి పోక్సో చట్టం, సైబర్ నేరాల నివారణ, గుడ్ టచ్–బ్యాడ్ టచ్, మహిళా హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 వంటి అంశాలపై మరింత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని,సైబర్ వేధింపులు లేదా మోసాలు ఎదురైతే వెంటనే 1930 హెల్ప్ లైన్ను సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. బాలికలు తమ హక్కులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని,నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన పెంపొందించేందుకు మాక్ పార్లమెంట్ వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. యుక్త వయసు బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిందే ఈ స్నేహ సంఘాలు అని,ప్రతి గ్రామ పంచాయతీలో ఈ సంఘాలు ఏర్పాటు అయ్యాయన్నారు. బాలికల రక్షణ,సంరక్షణ కింద బాల్య వివాహాల నిర్మూలనకు 1098 చైల్డ్ లైన్ నంబర్ లో సంప్రదించాలని,ఇంట్లో ఏమైనా సమస్య తలెత్తితే సఖి సహాయ కేంద్రం 181, పోలీస్ 100 కు డయల్ చేయాలని, అలాగే రాష్ట్రంలో గుట్కా, పొగాకు, గంజాయి విక్రయాలు,సరఫరాపై నిషేధం ఉందని, అలాంటి అలవాట్లకు ఎవరైనా బానిస అయితే, విక్రయాలకు ఎవరైనా పాల్పడితే ఈగల్ బృందం 1908 టోల్ ఫ్రీ నంబర్ కు సమాచారం అందించాలని కోరారు. పాఠశాలల్లో తరగతి గదులు, మూత్రశాలలు,మరుగుదొడ్లు వంటి వాటి గురించి ఈ స్నేహ సంఘాలు చర్చించాలని, రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పోక్సో చట్టం, బాల్య వివాహ నిరోధక చట్టం, బాల రక్షణకు సంబంధించిన ఇతర చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఏవైనా వేధింపులు, హింస (లేదా) భద్రతా సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే ఫిర్యాదు చేసే విధంగా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థుల్లో మంచి నడవడి, నైతిక విలువలు,పరస్పర గౌరవ భావన పెంపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. బాలికలు విద్య,ఆరోగ్యం, భద్రతతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని,తమ భవిష్యత్తును తామే నిర్మించుకునే స్థాయికి ఎదగాలని సూచించారు. జీవితంలో ఏరంగాన్ని ఎంచుకున్నా కష్టపడి పనిచేస్తూ ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని తెలిపారు. సాధికారత అంటే కేవలం ఉద్యోగం (లేదా) ఆర్థిక స్వావలంబన మాత్రమే కాదని, సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం,ఆత్మగౌరవం, సమాజానికి ఉపయోగపడే విధంగా జీవించడం కూడా సాధికారతలో భాగమేనని వివరించారు. బాలికలు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకొని, వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. పనిచేసే ప్రతి సందర్భంలో నైతిక విలువలు పాటించాలని, జీవితంలో ఎంత ఉన్నత స్థాయికి చేరుకున్నా నీతి, నిజాయితీ, మానవతా విలువలతో రాజీ పడకూడదని చెప్పారు. మంచి వ్యక్తిత్వమే జీవిత విజయానికి పునాదిగా నిలుస్తుందని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా 14000 మంది నిరక్షరాస్యులు అక్షరాస్యులుగా తీర్చిదిద్దారని అన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బాలికల భద్రతకు సంబంధించిన చట్టాలు, సైబర్ భద్రత,స్టాకింగ్ వంటి నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని చెప్పారు. మాక్ పార్లమెంట్ ద్వారా విద్యార్థుల్లో వక్తృత్వ నైపుణ్యాలు, నాయకత్వ సామర్థ్యాలు, సమస్యలను విశ్లేషించే దృక్పథం, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన పెంపొందుతుందని తెలిపారు. బాలికల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమన్నారు. ఆరోగ్యకరమైన జీవన విధానాలను అలవర్చుకోవడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థినులకు ఉన్నత విద్య, కెరీర్ అవకాశాలు, లక్ష్య సాధన కోసం అనుసరించాల్సిన మార్గాలపై ప్రత్యేక అవగాహన ఉండాలని తెలిపారు. తమ అభిరుచులు, ప్రతిభకు అనుగుణంగా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. బాలికల భద్రత దృష్ట్యా గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి విద్యార్థులు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని,వాటి వల్ల బాలికల విద్య,ఆరోగ్యం,భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. మహిళలు,బాలికల రక్షణ కోసం అమలులో ఉన్న పోక్సో (గూజూూ) చట్టం,స్టాకింగ్ వంటి నేరాలపై అవగాహన పెంపొందించాలని తెలిపారు.

ఎవరైనా వేధింపులకు పాల్పడితే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఆన్లైన్ మోసాలు, వేధింపులపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. అనంతరం మాక్ పార్లమెంట్ లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే ఉల్లాస్ కింద ట్రైనర్, లెర్నర్ లకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, జెడ్పి సీఓ ఎల్లయ్య, డిఆర్డిఓ శ్రీనివాసరావు, డీఎస్పీ ప్రసన్నకుమార్, డిడబ్ల్యు ఓ హేమా భార్గవి,అడిషనల్ డిఆర్డిఓ సరస్వతి సంబంధిత శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కిశోర బాలికలు పాల్గొన్నారు.

# జూన్ 2న డిపెండెంట్ ఉద్యోగులకు నియామక పత్రాలు ఇవ్వాలి

### - సమస్యలు పరిష్కరించకుంటే జూన్ రెండో వారంలో సమ్మె
### - సింగరేణికి రావాల్సిన రూ.56 వేల కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలి
### - జూన్ 3న అన్ని జీఎం కార్యాలయాల ఎదుట ధర్నాలు.
### - ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, మే 30: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న మెడికల్ అన్‌ఫిట్ కార్మికుల డిపెండెంట్లుగా ఉద్యోగాలకు ఎంపికైన సుమారు 400 మంది యువతకు నియామక పత్రాలు అందజేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం భూపాలపల్లిలోని ఏఐటీయూసీ కొమురయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుపై ఇటీవల కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలు, ఉప ముఖ్యమంత్రితో జరిగిన సమావేశంలో పలు కీలక సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో డిపెండెంట్ ఉద్యోగాలకు ఎంపికైన కార్మికుల పిల్లలకు నియామక పత్రాలు అందజేయాలని కోరామని, ఈ విషయంలో ప్రభుత్వం స్పందించకపోతే జూన్ 3న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జీఎం కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం కూడా సమస్య పరిష్కారం కాకపోతే జూన్ రెండో వారంలో సమ్మెకు పిలుపునివ్వనున్నట్లు స్పష్టం చేశారు. కారుణ్య నియామకాలలో గతంలో అమలులో ఉన్న విధానాన్ని కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. అలాగే కార్మికుల సొంతింటి పథకం అమలు, మారుపేరు సమస్యల పరిష్కారం వంటి అంశాలను కూడా ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. 1982–83 కాలంలో ఎంప్లాయ్‌మెంట్ కార్డుల ఆధారంగా మారుపేర్లతో ఉద్యోగాల్లో చేరిన కార్మికులు ప్రస్తుతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. సింగరేణి కార్మికులపై విధిస్తున్న పెర్క్స్ ఇన్‌కమ్ ట్యాక్స్‌ను రద్దు చేయడంతో పాటు, సింగరేణి సంస్థకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గోల్డెన్ స్కీమ్ ద్వారా పదవీ విరమణ పొందిన కార్మికులకు ప్రస్తుతం కేవలం రూ.1,000 పింఛన్ మాత్రమే అందుతోందని, వారికి ఆసరా పింఛన్‌తో పాటు ఇతర సంక్షేమ పథకాలు కూడా వర్తింపజేయాలని కోరారు. కార్మిక సమస్యలను గుర్తింపు సంఘంగా అనేకసార్లు ప్రభుత్వం, యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా ఆశించిన స్థాయిలో చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, లేకపోతే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జూన్ 3న జరిగే ధర్నా కార్యక్రమంలో డిపెండెంట్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శులు గురుజేపెల్లి సుధాకర్ రెడ్డి, ఆసిఫ్ పాషా, తోట రామ్‌చందర్, రవి తదితర నాయకులు పాల్గొన్నారు.

# రైతులకు సకాలంలో గిట్టుబాటు ధర, చెల్లింపులు అందేలా ప్రత్యేక చర్యలు

### - 460 మంది రైతులకు రూ.5.42 కోట్ల మొక్కజొన్న బకాయిల విడుదల.
### - జయశంకర్-భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ.

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్–భూపాలపల్లి, మే 30: రైతులకు సకాలంలో గిట్టుబాటు ధరతో పాటు పంటల చెల్లింపులు అందేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జిల్లాలో రైతుల నుంచి కొనుగోలు చేసిన మొక్కజొన్న (మైజ్) పంటకు సంబంధించి 460 మంది రైతులకు రూ.5.42 కోట్ల చెల్లింపులను మార్క్‌ఫెడ్ విడుదల చేసినట్లు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు విక్రయించిన మొక్కజొన్న పంటకు సంబంధించిన నగదు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు తమ పంటకు గిట్టుబాటు ధర పొందడంతో పాటు చెల్లింపులు ఆలస్యం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు.కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. చెల్లింపులు లేదా కొనుగోలు ప్రక్రియకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదురైతే రైతులు వెంటనే సంబంధిత కొనుగోలుకేంద్రాల అధికారులను సంప్రదించాలని సూచించారు. రైతుల సంక్షేమం, వారి పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న కలెక్టర్, రైతులకు అవసరమైన అన్ని విధాల సహకారం అందించేందుకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.




# బీఆర్ఎస్ పార్టీకి కాంపెల్లి కనకేష్ పటేల్ రాజీనామా

### - క్రియాశీలక సభ్యత్వంతో పాటు పార్టీ పదవులకు వీడ్కోలు.
### - కొత్తగూడెం నియోజకవర్గంలో నాయకత్వ లోపమే కారణమని వెల్లడి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 30 : భద్రాద్రి–కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుడు, పాల్వంచ లార్జ్ సైజ్డ్ కో–ఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి కనకేష్ పటేల్ బీఆర్ఎస్ పార్టీ క్రియాశీలక సభ్యత్వానికి, పార్టీ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు పాల్వంచ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తన రాజీనామా లేఖను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడికి పంపించినట్లు మీడియాకు తెలిపారు. రాజీనామా లేఖలో ఆయన పేర్కొన్న వివరాల ప్రకారం, 2014లో అప్పటి టీఆర్ఎస్, ప్రస్తుత బీఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడై పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీ పట్ల తనకున్న నిబద్ధతను గుర్తించి 2020లో పాల్వంచ లార్జ్ సైజ్డ్ కో–ఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షుడిగా అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. గత 12 సంవత్సరాలుగా పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తూ క్రియాశీలకంగా పనిచేసినప్పటికీ, గత రెండున్నర సంవత్సరాలుగా కొత్తగూడెం నియోజకవర్గంలో తీవ్ర నాయకత్వ లోపం కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన దిశానిర్దేశం చేసే నాయకత్వం లేకపోవడం వల్ల పార్టీ పరిస్థితి రోజురోజుకు బలహీనపడుతోందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై ప్రధాన ప్రతిపక్షంగా పోరాడాల్సిన పార్టీ కనీస కార్యక్రమాలను కూడా సమర్థవంతంగా నిర్వహించలేకపోతోందని విమర్శించారు. ఈ పరిస్థితుల కారణంగా పార్టీకి అంకితభావంతో పనిచేస్తున్న నాయకులు, ఉద్యమకారులు, కార్యకర్తలు తీవ్ర నిరాశకు గురవుతున్నారని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీలో కొనసాగడం సాధ్యం కాదనే నిర్ణయానికి వచ్చానని, అందుకే బీఆర్ఎస్ పార్టీ క్రియాశీలక సభ్యత్వంతో పాటు అన్ని పార్టీ బాధ్యతలకు రాజీనామా చేస్తున్నట్లు స్పష్టం చేశారు. తన రాజీనామాను తక్షణమే ఆమోదించాలని పార్టీ నాయకత్వాన్ని కోరారు. ఇంతకాలం తనకు సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులకు కాంపెల్లి కనకేష్ పటేల్ కృతజ్ఞతలు తెలిపారు.



# సమ్మర్ కోచింగ్ శిబిరాలను పరిశీలించిన కార్పొరేటర్ కాల్వ భాస్కర్ రావు

### - క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి జిల్లా ఖ్యాతిని పెంచాలి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 30 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్‌ఏ) ఆధ్వర్యంలో పాల్వంచ శ్రీనివాస కాలనీలోని జిల్లా క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను 48వ డివిజన్ కార్పొరేటర్ కాల్వ భాస్కర్ రావు శనివారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న చిన్నారులతో ముచ్చటించిన ఆయన, వేసవి ఎండలను సైతం లెక్కచేయకుండా క్రీడాకారులకు నాణ్యమైన శిక్షణ అందిస్తూ వారి ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తున్న క్రీడా శిక్షకులను అభినందించారు. క్రీడల ద్వారా శారీరక, మానసిక వికాసం సాధ్యమవుతుందని పేర్కొంటూ, శిక్షణ పొందుతున్న క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి అత్యధిక పతకాలు సాధించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఖ్యాతిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. అనంతరం అథ్లెటిక్స్ కోచ్ నాగేంద్ర, ఆర్చరీ కోచ్ కళ్యాణ్, టెన్నిస్ కోచ్ డేనియల్ రాంబాబు, అథ్లెటిక్స్ కోచ్ ఎర్రయ్య పవన్‌లను ప్రత్యేకంగా అభినందించి, వారి సేవలను కొనియాడారు. స్థానిక ఈవెంట్ మేనేజర్ కె. రమేష్ మాట్లాడుతూ, జిల్లాలో క్రీడల అభివృద్ధి కోసం తన వంతు సహకారం, ప్రోత్సాహం నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కె. మహీధర్, క్రీడా శిక్షకులు, క్రీడా ప్రముఖులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# వరుసగా 26 ఏళ్లుగా లాభాలు ఆర్జిస్తున్న ఏకైక ప్రభుత్వరంగ సంస్థ సింగరేణి

### - కార్మికులకు ఇచ్చిన హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడింది
### - కనీస వేతనాల సలహా మండలి అధ్యక్షుడు జన ప్రసాద్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, మే 30 : దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థల్లో వరుసగా 26 సంవత్సరాలుగా లాభాలు ఆర్జిస్తూ వస్తున్న ఏకైక సంస్థ సింగరేణి అని, అలాంటి సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు ఇచ్చినహామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిందని తెలంగాణ కనీస వేతనాల సలహా మండలి అధ్యక్షుడు, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జన ప్రసాద్ అన్నారు. భూపాలపల్లి పర్యటనలోభాగంగాశనివారం సింగరేణి గెస్ట్‌హౌస్‌లో భూపాలపల్లి ఏరియా ఐఎన్టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బేతెల్లి మధుకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనంతరం జరిగిన ఎన్నికల్లో సింగరేణి ప్రభావిత ప్రాంతాల నుంచి 11 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ తరపున గెలుపొందడంలో కార్మికులు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో సింగరేణి కార్మికుల మద్దతు ఎంతో కీలకమని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు దాటినా సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీల అమలులో ఆశించిన పురోగతి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘమైన ఐఎన్టీయూసీ కూడా కార్మికుల సమస్యల పరిష్కారంలో అనుకున్న స్థాయిలో ఫలితాలు సాధించలేకపోయిందని అంగీకరించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినట్లు తెలిపారు. సింగరేణి కార్మికులు ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన నేపథ్యంలో వారికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ నెల 25న మంత్రి శ్రీధర్ బాబు చొరవతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన సమావేశంలో సింగరేణి సమస్యలపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. బొగ్గు శాఖ కార్యదర్శి, సింగరేణి డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్న ఆ సమావేశంలో కార్మికుల సమస్యలను సమగ్రంగా వివరించినట్లు చెప్పారు. దేశంలో ఏ ప్రభుత్వ రంగ సంస్థ కూడా వరుసగా 26 ఏళ్లపాటు లాభాలు ఆర్జించిన చరిత్ర లేదని,ఆ ఘనత ఒక్క సింగరేణికే దక్కిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి డివిడెండ్, రాయల్టీ, సెస్ రూపంలో వేల కోట్ల రూపాయల ఆదాయం అందిస్తున్న సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చేయడం సమంజసం కాదన్నారు. పాత విధానంలో మెడికల్ బోర్డు నిర్వహణ, మారుపేరు సమస్యల పరిష్కారం, సొంతింటి పథకం అమలు, పెర్క్స్‌పై విధిస్తున్న ఆదాయపు పన్ను రద్దు వంటి అంశాలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘంగా ఉన్న ఏఐటీయూసీ గత రెండున్నర సంవత్సరాలుగా బాధ్యతాయుతంగా వ్యవహరించలేదని విమర్శించారు. సమస్యలు పరిష్కారమైతే తమ వల్లే జరిగాయని చెప్పుకుంటూ, పరిష్కారం కాని సమస్యలకు మాత్రం ఐఎన్టీయూసీపై నెపం మోపుతున్నారని ఆరోపించారు.



# మంత్రి శ్రీధర్ బాబు జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు

### - గారేపల్లి భక్తాంజనేయ స్వామి ఆలయంలో కాంగ్రెస్ నాయకుల ప్రార్థనలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాటారం, మే 30 : తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదినం సందర్భంగా శనివారం కాటారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గారేపల్లి భక్తాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆలయంలో ప్రత్యేక అర్చనలు నిర్వహించి మంత్రి శ్రీధర్ బాబు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు సుఖశాంతులతో జీవించాలని ప్రార్థించారు. అలాగే మంథని నియోజకవర్గ అభివృద్ధికి ఆయన మరింత సేవలందించేలా భక్తాంజనేయ స్వామి కృపాకటాక్షాలు ప్రసాదించాలని కోరారు. మంత్రి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాటారం మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# ఖమ్మం--దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవేపై పెరుగుతున్న ప్రమాదాలు

## - పశువుల సంచారంతో వాహనదారుల అరచేతిలో ప్రాణాలు - అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సత్తుపల్లి, మే 30 : ఖమ్మం జిల్లా దేవరపల్లి సమీపంలోని గ్రీన్ ఫీల్డ్ హైవేపై రోజురోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు వాహనదారులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. రాష్ట్రంలోని కీలక రహదారుల్లో ఒకటైన ఈ హైవేపై పశువుల స్వైర విహారం ప్రమాదాలకు ప్రధాన కారణంగా మారిందని స్థానికులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో హైవేపై తగినంత వెలుతురు లేకపోవడం, పశువులు అకస్మాత్తుగా రోడ్డు మధ్యలోకి రావడం వల్ల తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని చెబుతున్నారు. అధిక వేగంతో ప్రయాణించే కార్లు, లారీలు, ద్విచక్ర వాహనాలు పశువులను తప్పించబోయి అదుపుతప్పుతున్న ఘటనలు పెరుగుతున్నాయి. ఇటీవల జరిగిన పలు ప్రమాదాల్లో వాహనదారులు గాయపడినప్పటికీ సంబంధిత అధికారులు పరిస్థితిని పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. రాత్రి సమయంలో ఈ మార్గంలో ప్రయాణించేందుకు చాలామంది భయపడుతున్నారని, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. సర్వీస్ రోడ్లు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడం, కొన్ని ప్రాంతాల్లో రోడ్లపై గుంతలు ఉండటం, హెచ్చరిక బోర్డుల కొరత వంటి సమస్యలు ప్రమాదాల ముప్పును మరింత పెంచుతున్నాయని తెలిపారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారిందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైవేపై పశువులు రాకుండా ఏర్పాటు చేయాల్సిన ఫెన్సింగ్ పలుచోట్ల దెబ్బతినగా, మరికొన్ని ప్రాంతాల్లో అసలు ఏర్పాటు చేయలేదని ఆరోపిస్తున్నారు. దీంతో సమీప గ్రామాల నుంచి పశువులు నేరుగా హైవేపైకి చేరుకుంటున్నాయని చెబుతున్నారు. ప్రతిరోజూ వందలాది వాహనాలు ప్రయాణించే ఈ మార్గంలో తక్షణమే భద్రతా చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. హైవేపై ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేయడం, రాత్రి వేళల్లో లైటింగ్ సదుపాయాలను మెరుగుపరచడం, పశువుల సంచారాన్ని నియంత్రించడం, ప్రమాద ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం వంటి చర్యలను వెంటనే అమలు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టకపోతే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు, వాహనదారులు హెచ్చరిస్తున్నారు. ప్రజల ప్రాణ భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# అత్యుత్తమ సేవలతోనే ప్రజల్లో గుర్తింపు

## - జిల్లా అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ములుగు, మే 30 : ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ కాదని ఆరోగ్యరీత్యా విరమణ అని జిల్లా అదనపు కలెక్టర్ సి హెచ్ మహేందర్ జి అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి మామిడాల ప్రకాష్ పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా వీడ్కోలు సమావేశంలో ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ సి హెచ్ మహేందర్ జి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి మాట్లాడుతూ 61 సంవత్సరాలు పూర్తి చేసుకున్న అనంతరం జిల్లా స్థాయి నుండి అటెండర్ స్థాయి వరకు ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పదవి విరమణ పొందాల్సి ఉంటుందని,పదవీ విరమణ పొందిన ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తమ కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. గతంలో పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులకు కొంతమేరకే లబ్ది పొందే అవకాశం ఉండేదని నేడు పలు రకాలుగా లబ్ధి పొందే అవకాశం లభించిందని అన్నారు. గ్రామస్థాయి నుండి జిల్లా అధికారి వరకు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న క్రమంలో ప్రజల మన్ననలు పొందడం గొప్ప విషయమని, అవే ప్రభుత్వ ఉద్యోగికి గౌరవం సంతృప్తి ఇస్తుందని అన్నారు. అత్యుత్తమ సేవలతోనే ప్రజల్లో గుర్తింపు వస్తుందని అన్నారు. పదవి విరమణ పొందిన ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి నిజమైన జీవితం ప్రారంభ మవుతుందని, ఆరోగ్యం ఐశ్వర్యం జీవితంలో ముఖ్యమైన అని అన్నారు.క్రింది స్థాయి ఉద్యోగం నుండి ఉన్నత స్థాయి ఉద్యోగం పొందడానికి ఉద్యోగం చేసే సేవలే గుర్తింపునిస్తాయని,ప్రతి ప్రభుత్వ ఉద్యోగి కష్టంతో ఇష్టంగా ఉద్యోగ బాధ్యత నిర్వహించాలని అన్నారు.పదవి విరమణ పొందుతున్న ఉద్యోగులు వారి జీవితాలు ఆరోగ్యకరంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వివిధ జిల్లా స్థాయి అధికారులు,మండల స్థాయి అధికారులు,సిబ్బంది, కుటుంబసభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# మే నెలలో 118 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించిన మణుగూరు ఏరియా

## - రెండు నెలల్లోనే లక్ష్యానికి మించి 21.17 లక్షల టన్నుల ఉత్పత్తి - మీడియా సమావేశంలో ఏరియా జీఎం దుర్గం రామచందర్ వెల్లడి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మణుగూరు, మే 30 : సింగరేణి మణుగూరు ఏరియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి లక్ష్యాలను అధిగమిస్తూ ముందుకు సాగుతోందని ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ తెలిపారు. శనివారం జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఏరియా పనితీరు వివరాలను వెల్లడించారు. మే నెలలో 9.55 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 11.28 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసి 118 శాతం ప్రగతి సాధించినట్లు తెలిపారు. అలాగే ఏప్రిల్ 1 నుంచి మే 30 వరకు 19.14 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 21.17 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి 111 శాతం లక్ష్యసాధన చేసినట్లు పేర్కొన్నారు. బొగ్గు రవాణాలో కూడా మణుగూరు ఏరియా మెరుగైన ఫలితాలు నమోదు చేసిందన్నారు. మే నెలలో 11.49 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేయగా, ఏప్రిల్ 1 నుంచి మే 30 వరకు మొత్తం 21.52 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు వివరించారు. ఓవర్‌బర్డెన్ (ఓబీ) తొలగింపు పనుల్లో మే నెలలో 12 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి గాను 10.18 లక్షల క్యూబిక్ మీటర్లు (85 శాతం) సాధించామని, ప్రోగ్రెసివ్‌గా 24 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి గాను 20.86 లక్షల క్యూబిక్ మీటర్లు (87 శాతం) పూర్తి చేసినట్లు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి పదవీ విరమణ, మెడికల్ ఇన్వాలిడేషన్, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు సంబంధించిన పెన్షన్, గ్రాట్యుటీ, బీమా, సంక్షేమ పథకాల చెల్లింపులు వేగవంతంగా పూర్తి చేసినట్లు జీఎం తెలిపారు. మే నెలలో 12 మంది ఉద్యోగులకు సీఎంపీఎఫ్, పెన్షన్ ప్రయోజనాలు అందించగా, 9 మందికి గ్రాట్యుటీ, 18 మందికి ఎఫ్‌బీఐఎస్ చెల్లింపులు చేసినట్లు వెల్లడించారు. అలాగే 4,394 సీపీఆర్ఎంఎస్ కార్డులు జారీ చేయగా, 242 కార్డుల పునరుద్ధరణ, కొత్త సభ్యత్వ కార్డులను అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్‌వో టు జీఎం బి. శ్రీనివాస చారి, ఏరియా ఇంజనీర్ ఆర్. శ్రీనివాస్, ఏరియా సెక్యూరిటీ అధికారి డి.వి. రామారావు, ఏజీఎం (ఐఈ) సీహెచ్. రాంబాబు, ఏజీఎం (పర్సనల్) ఎస్. రమేష్, పీఓ ఎంఎన్‌ఓసీ ఈ. శ్రీనివాస్, డీజీఎం రామకృష్ణ, డీజీఎం జి. శివప్రసాద్, డాక్టర్ శేషగిరి, ఫైనాన్స్ మేనేజర్ పి. రమేశ్, పర్యావరణ అధికారి జే. శ్రీనివాస్‌రావు, ఏరియా సెక్యూరిటీ అధికారి కే. శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# దళితులపై వివక్ష చట్టరీత్యా నేరం

## జిల్లా ఎస్సీ/ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బర్రె సుదర్శన్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, మే 30 : దళితులపై కుల వివక్ష, అంటరానితనం పాటించడం చట్టరీత్యా నేరమని, అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తామని యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్సీ/ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బర్రె సుదర్శన్ హెచ్చరించారు. దళితుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెల చివరి రోజున పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం భువనగిరి మండలం చీమలకొండూరు గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో కుల వివక్ష, అంటరానితనం వంటి చర్యలు చట్టవిరుద్ధమని, వాటిని ప్రోత్సహించిన వారిపైనా చర్యలు తీసుకుంటామని భువనగిరి డిప్యూటీ తహశీల్దార్ కళ్యాణ్ పేర్కొన్నారు. సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్ మాట్లాడుతూ బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, బడిఈడు పిల్లలు విద్యకు దూరమవడం బాలల హక్కుల ఉల్లంఘనగా పరిగణించాల్సి ఉంటుందని అన్నారు. దళితుల సమస్యలకు విద్యే శాశ్వత పరిష్కారమని ఆయన అభిప్రాయపడ్డారు. సమావేశంలో గ్రామంలోని పలు సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కళ్యాణ్, సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్, పోలీసు శాఖకు చెందిన వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ వడ్డే హరికృష్ణ, పంచాయతీ కార్యదర్శి ఈరబోయిన చంద్రయ్య, గ్రామ పాలన అధికారి బొట్ల రమేష్, ఆరోగ్య సిబ్బంది దివ్య, పుష్ప, అంగన్‌వాడీ టీచర్ రాజ్యలక్ష్మి, గ్రామస్తులు లక్ష్మీనర్సయ్య, రమేష్, పాండు, దేవయ్య, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి - కుటుంబానికి సమయం కేటాయించాలి

## - జయశంకర్-భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

## - పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులకు ఘన సన్మానం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 30 : వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడపాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ సూచించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీసు శాఖలో సుదీర్ఘకాలం పాటు సేవలందించి పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను పోలీసు అధికారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ, పోలీసు వృత్తి అత్యంత కఠినమైనదని, కుటుంబ సౌకర్యాలను పక్కనబెట్టి ప్రజల భద్రత, సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం సేవలందించడం పోలీసు సిబ్బంది ప్రత్యేకత అని అన్నారు. విధి నిర్వహణలో ఎన్నో ఒత్తిడులు,సవాళ్లు ఎదురైనా వాటిని అధిగమించి సమర్థవంతంగా పనిచేసిన రిటైర్డ్ అధికారుల సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని, జీవితంలోని కొత్త దశను సంతోషంగా ఆస్వాదించాలని సూచించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన అధికారులు సంధి ప్రతాప్‌రెడ్డి (ఏఎస్ఐ, డీసీఆర్‌బీ, భూపాలపల్లి), మదన నాగయ్య (ఏఎస్ఐ, రేగొండ పోలీస్ స్టేషన్), చింత సుధీర్ (ఏఎస్ఐ, కాటారం పోలీస్ స్టేషన్), మాచర్ల వైకుంఠం (ఏఆర్ హెడ్ కానిస్టేబుల్, జిల్లా హెడ్‌క్వార్టర్స్)లను వారి కుటుంబ సభ్యులతో కలిసి శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ రత్నం, వెల్ఫేర్ ఆర్ఐ సంతోష్ కుమార్, రిటైర్డ్ అధికారుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పోలీసు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పదవీ విరమణ పొందిన పోలీసు సిబ్బంది సేవలను గుర్తించి సన్మానించడం ద్వారా వారికి గౌరవం లభించడమే కాకుండా, ప్రస్తుతం విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందికి కూడా ఇది స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పలువురు అధికారులు అభిప్రాయపడ్డారు.

# 32 ఏళ్ల నిరుపమాన సేవలకు ఘన సన్మానం

## - సింగరేణి హెడ్ ఓవర్‌మన్ మహావీర్ చక్రవర్తికి వీడ్కోలు సభ

## - ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో ఘన సన్మానం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్-భూపాలపల్లి, మే 30: సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-ఓసీ-2 ప్రాజెక్టులో హెడ్ ఓవర్‌మన్‌గా విధులు నిర్వహించి 32 సంవత్సరాల సుదీర్ఘ సేవ అనంతరం పదవీ విరమణ పొందిన మహావీర్ చక్రవర్తిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. కేటీకే-ఓసీ--2 ప్రాజెక్టు ఐఎన్‌టీయూసీ పిట్ సెక్రటరీ పొనగంటి కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు, సహోద్యోగులు పాల్గొని ఆయనకు శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన భూపాలపల్లి ఏరియా ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ బేతెల్లి మధుకర్ రెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ రత్నం సమ్మిరెడ్డి, సెంట్రల్ సెక్రటరీ నరెడ్ల సంపత్ తదితరులు మహావీర్ చక్రవర్తి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా బేతెల్లి మధుకర్ రెడ్డి మాట్లాడుతూ, మహావీర్ చక్రవర్తి 32 ఏళ్లకు పైగా సింగరేణి సంస్థలో అంకితభావంతో పనిచేసి నేడు పదవీ విరమణ పొందడం ఒకవైపు ఆనందకరమైనదే అయినప్పటికీ, సంస్థకు ఆయనలాంటి అనుభవజ్ఞుడైన అధికారి దూరమవడం బాధాకర మన్నారు. తన సుదీర్ఘ సేవా కాలంలో ఒక్క ప్రమాద నివేదిక కూడా నమోదు కాకుండా విధులు నిర్వహించడం ఆయన క్రమశిక్షణ, పనితీరుకు నిదర్శనమని పేర్కొన్నారు. అధికా రులు, కార్మికుల మధ్య సమన్వయంతో పనిచేస్తూ అందరి మన్ననలు పొందిన మహావీర్ చక్రవర్తి భవిష్యత్తులో కుటుంబ సభ్యులతో సంతోషంగా, ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ బి. భరత్ కుమార్, సీనియర్ నాయకులు చేరాలు, బండ బాపు, మండల శ్రీనివాస్, రాజకిరణ్, కోమటి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణతో పాటు కార్మిక నేతగా రాణించడం శేషారత్నం ప్రత్యేకత

## - పదవీ విరమణ పొందుతున్న ఐఎన్‌టీయూసీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలికి ఘన సన్మానం

## - తెలంగాణ కనీస వేతనాల అమలు కమిటీ చైర్మన్ బి. జనక్ ప్రసాద్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్-భూపాలపల్లి, మే 30 : ఒకవైపు ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, మరోవైపు కార్మిక నాయకురాలిగా గుర్తింపు పొందడం మద్దినేని శేషారత్నం ప్రత్యేకత అని తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల అమలు కమిటీ చైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్ అన్నారు. భూపాలపల్లి సింగరేణి ప్రాంతంలోని మంజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందుతున్న మద్దినేని శేషారత్నం సన్మాన కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రస్తుతం సింగరేణి కోల్‌మెన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా కొనసాగుతున్న శేషారత్నం పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జనక్ ప్రసాద్ మాట్లాడుతూ ఆమె సేవలను కొనియాడారు. సింగరేణిలో పలు ఏరియాల్లో పనిచేస్తూ విశిష్ట సేవలు అందించి మంచి పేరు సంపాదించడమే కాకుండా, కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టీయూసీ వేదికగా విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. ఉద్యోగ బాధ్యతలు, కార్మిక సంఘ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ నాయకులు శేషారత్నంకు శాలువా కప్పి ఘనంగా సన్మానించి, ఆమె భవిష్యత్ జీవితం ఆనందంగా, ఆరోగ్యంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ఐఎన్‌టీయూసీ భూపాలపల్లి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బేతెల్లి మధుకర్ రెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కేంద్ర కమిటీ నాయకులు ధర్మపురి, వికాస్ యాదవ్, జోగు బుచ్చయ్య, పశునూటి రాజేందర్, రత్నం సమ్మిరెడ్డి, కొలిపాక నర్సింగరావు, చిప్పకుర్తి సదయ్య, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జ్ గడిపే చక్రపాణి, బొడ్డు అశోక్, రవికిరణ్, ఎనగంటి శంకర్ రెడ్డి, సజ్జనపు స్వామి, మండల శ్రీనివాస్, చేరాలు, చిరుత లక్ష్మీనారాయణ, ఏరియా ఆసుపత్రి ఫిట్ సెక్రటరీ మహబూబ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సన్మాన కార్యక్రమంలో సింగరేణి సీఎంఓ డాక్టర్ కిరణ్ రాజ్‌కుమార్, డాక్టర్ సురేష్, డాక్టర్ గోపీకృష్ణ తదితరులు శేషారత్నంకు శాలువా కప్పి జ్ఞాపిక అందజేసి అభినందించారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ ఫిట్ సెక్రటరీలు నల్ల రమేష్, మహబూబ్‌తో పాటు ఆసుపత్రి సిబ్బంది, కార్మిక సంఘ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# బాలికల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి: జిల్లా కలెక్టర్ అంకిత్

## - ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మాక్ పార్లమెంట్ నిర్వహణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 30 : బాలికల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, నిర్ణయ సామర్థ్యం, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మహిళా వారోత్సవాల సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లోని ఐడీఓసీ సమావేశ మందిరంలో గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కౌమారదశ బాలికలతో మాక్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించారు.

ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ అంకిత్ బాలికలు నిర్వహించిన మాక్ పార్లమెంట్‌ను పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిర్మూలన, మహిళల భద్రత, మహిళా హక్కులు, విద్య ప్రాధాన్యత, లింగ సమానత్వం వంటి అంశాలపై బాలికలు చర్చించారు. మాక్ పార్లమెంట్ ద్వారా పార్లమెంటరీ వ్యవస్థ, ప్రశ్నోత్తరాల సమయం, బిల్లుల ప్రవేశపెట్టడం, చట్టాల రూపకల్పన, ప్రజాప్రతినిధుల బాధ్యతలపై అవగాహన కల్పించారు. జిల్లాలో 15 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికల కోసం 529 స్నేహ గ్రూపులను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. స్వయం సహాయక సంఘాల తరహాలో పనిచేస్తున్న ఈ గ్రూపుల ద్వారా బాలికల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక చైతన్యం పెంపొందిస్తున్నామని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థ, చట్టసభల పనితీరు, పౌరుల హక్కులు, బాధ్యతలపై ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాలని సూచించారు. అనంతరం బాలికలు జిల్లా ఎస్పీ రోహిత్ రాజుతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. గంజాయి, బెల్ట్ షాపులు, గుడుంబా ప్రభావం, సోషల్ మీడియా ప్రమాదాలు, బాల్య వివాహాలు వంటి అంశాలపై బాలికలు అడిగిన ప్రశ్నలకు ఎస్పీ సమాధానాలు ఇస్తూ చట్టపరమైన అవగాహన కల్పించారు. జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి బాలల హక్కులు, బాల్య వివాహాల నిర్మూలన, బాలల రక్షణ చట్టాలు, గృహహింస నివారణ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి అధికారి విద్యాచందన, అదనపు డీఆర్‌డీఓ బి. నీలేష్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సోయం సుజాత, జడ్పీ సీఈఓ ఉ డీఈఓ నాగలక్ష్మి, సీపీఓ సంజీవరావు, డీడబ్ల్యూఓ స్వర్ణ లెనినా, డీపీఎంలు, ఏపీఎంలు, కిశోర బాలికల సంఘాల సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామిక తెలంగాణ అమరవీరుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి

## - తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ పిలుపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కాటారం, మే 30 : తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా శనివారం కాటారంలో కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల స్ఫూర్తిని చిరస్థాయిగా నిలబెట్టేం దుకు మే 26న తెలంగాణ జానపద గాయని బెల్లి లలిత వర్ధంతి నుంచి జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వరకు ప్రజాస్వామిక తెలంగాణ అమరవీరుల వారోత్స వాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వారోత్సవాల ముగింపు సందర్భంగా జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం లోని దొడ్డి కొమురయ్య హాలులో తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అమరవీరుల సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ ఆకాంక్షల సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ నిర్వహించే ఈ సదస్సును ప్రజలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, ఉద్యమకారులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

## నలుగురు పోలీసు అధికారులను ఘనంగా సత్కరించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 30 : పోలీసు శాఖలో సుదీర్ఘకాలం సేవలందించిన అధికారులు పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. పోలీసు శాఖలో విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన ఎస్సై కసిబోయిన సత్యనారాయణ రాజు, ఏఎస్సై జంపాల హనుమంతరావు, ఏఆర్ ఎస్సై ధారావత్ వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ ఎట్టా శ్రీనివాసరావులను శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, 42 సంవత్సరాలు సేవలందించిన కసిబోయిన సత్యనారాయణ రాజు, 37 సంవత్సరాలు పనిచేసిన జంపాల హనుమంతరావు, 41 సంవత్సరాల సేవ అనంతరం పదవీ విరమణ పొందిన ధారావత్ వెంకటేశ్వర్లు, 36 సంవత్సరాల సేవలతో పదవీ విరమణ పొందిన ఎట్టా శ్రీనివాసరావు పోలీసు శాఖకు విశేష సేవలందించారని కొనియాడారు. ప్రజలకు సేవలందించిన ఈ అధికారుల అనుభవాలను కొత్తగా పోలీసు శాఖలో చేరిన అధికారులు, సిబ్బంది స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. పదవీ విరమణ పొందిన సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఎదురైనా పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే వ్యాయామం, యోగా, ధ్యానం వంటి వాటిని నిత్య జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన అధికారులను శాలువాలు, పూలమాలలతో సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం వారు తమ సేవా అనుభవాలను ఎస్పీతో పాటు సహచరులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంజ్య, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, అడ్మిన్ ఆర్ఐ లాల్‌బాబు, ఎంటీఓ సుధాకర్, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణ, జిల్లా పోలీసు అధికారుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.



# ధాన్యం దిగుమతుల్లో వేగం పెంచాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కాటారం, మే 30 : జిల్లాలో ధాన్యం దిగుమతుల ప్రక్రియను మరింత వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జయశంకర్-భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శనివారం జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాటారం మండలం రేగులగూడెంలోని రుద్ర జిన్నింగ్ మిల్, మీనాక్షి ఆగ్రో జిన్నింగ్ మిల్లుల్లో జరుగుతున్న ధాన్యం దిగుమతి ప్రక్రియను అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, వారి పంటకు సరైన ధరతో పాటు కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం అన్‌లోడిం గ్‌లో ఎలాంటి జాప్యం లేకుండా అవసరమైన హమాలీలను అందుబాటులో ఉంచి ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే లారీల కొరత తలెత్తకుండా ఇసుక రవాణాకు వినియోగించే లారీలను కూడా ధాన్యం రవాణాకు ఉపయోగించాలని సూచించారు. ఈ మేరకు టీఎస్ఎండీసీ ప్రాజెక్టు అధికారి రామకృష్ణకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులు, గోదాములకు ధాన్యాన్ని వేగంగా తరలించేందుకు అవసరమైన రవాణా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లాలో ధాన్యం నిల్వల కోసం రైస్ మిల్లులతో పాటు అదనంగా ఐదు ప్రాంతాల్లో గోదాములను ఏర్పాటు చేసినట్లు వెల్లడించా రు. అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యానికి వెంటనే కాంటా నిర్వహించి,ఆలస్యం చేయకుండా లారీల ద్వారా మిల్లులకు తరలించాలని ఆదేశిం చా రు. అలాగే ధాన్యం కొనుగోలు ప్రక్రియలో కీలకమైన ట్యాబ్ ఎంట్రీలను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ధాన్యం సేకరణ, రవాణా, నిల్వ ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీఎం రాములు, తహసీల్దార్ నాగరాజు తదితర అధికారులు పాల్గొన్నారు.

# పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి



## భద్రాద్రి జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 30 : జూన్ 5 నుంచి 12 వరకు నిర్వహించనున్న పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మొత్తం 1,399 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కానుండగా, వారి కోసం నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల పర్యవేక్షణ కోసం నాలుగు మంది చీఫ్ సూపరింటెండెంట్లు, నాలుగు మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, నాలుగు సిట్టింగ్ స్క్వాడ్లు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్లను నియమించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, ఫ్యాన్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మరుగుదొడ్లు, ప్రాథమిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాల వివరాలను ముందుగానే తెలుసుకోవాలని, పరీక్ష జరిగే రోజు కనీసం గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరా, రవాణా, వైద్య సేవలు, భద్రత, తాగునీటి సదుపాయాల కల్పనలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పరీక్షలను విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి బి. నాగలక్ష్మి, వైద్యశాఖ ప్రతినిధి డా. టి. ప్రతాప్, విద్యుత్ శాఖ డీఈ పి.ఎస్.వి.ఎస్. నందయ్య, ఆర్టీసీ ప్రతినిధి కె. మోహన్‌రావు, పోలీసు శాఖ ప్రతినిధి పి.డి. క్రిస్టఫర్, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శంభు ప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ (పరీక్షలు) ఎస్. మాధవరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యా సంస్థలకు ఆహార పదార్థాల సరఫరాకు టెండర్లు

## ఆసక్తిగల సరఫరాదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానం.

## భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భద్రాద్రి-కొత్తగూడెం, మే 30 : 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోని గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలలు, గిరిజన వసతి గృహాలు, గురుకుల పాఠశాలలకు అవసరమైన కూరగాయలు, అరటిపండ్లు, స్కిన్‌లెస్ చికెన్ సరఫరా కోసం ఆసక్తిగల సరఫరాదారుల నుంచి సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. టెండర్ ఫారాలను రూ.2,000 డిమాండ్ డ్రాఫ్ట్ చెల్లించి మే 31 నుంచి జూన్ 5 వరకు భద్రాచలం ఐటీడీఏ లోని గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకుల కార్యాలయంలో పొందవచ్చని పేర్కొన్నారు. కూరగాయలు, పండ్లు, స్కిన్‌లెస్ చికెన్ సరఫరాకు విడివిడిగా రూ.50,000 చొప్పున ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఈఎండీ) డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో టెండర్ దరఖాస్తుతో జతచేయాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సరఫరాదారులకు ఈఎండీలో 20 శాతం రాయితీ వర్తిస్తుందని చెప్పారు. టెండర్ దరఖాస్తులను జూన్ 5 సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలని, పాన్ కార్డు, జీఎస్టీ/టిన్ నమోదు, స్వంత వ్యాపార సంస్థ, బ్యాంకు ఖాతా కలిగి ఉమ్మడి భద్రాద్రి జిల్లాకు చెందిన వారై ఉండాలని అర్హత నిబంధనలను వివరించారు. సమర్పించిన సీల్డ్ టెండర్లను జూన్ 6న ఉదయం 11 గంటలకు తెరిచి పరిశీలిస్తామని, ప్రాజెక్టు అధికారి తీసుకునే నిర్ణయమే తుది నిర్ణయంగా పరిగణించబడుతుందని ఐటీడీఏ పీఓ బి. రాహుల్ తెలిపారు.

# మక్కల కొనుగోళ్లలో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిర్మల్ జిల్లా

## ప్రతి గింజను కొనుగోలు చేస్తాం-రైతులు ఆందోళన

## చెందవద్దుజిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, మే 30 : నిర్మల్ జిల్లాలో యాసంగి సీజన్‌కు సంబంధించిన మక్కలు, వరి, జొన్నల కొనుగోళ్ల రవాణా ప్రక్రియలు వేగవంతంగా కొనసాగుతున్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మొక్కజొన్న, వరి, జొన్నల కొనుగోలు ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని అన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో కొనుగోళ్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

### మక్కల కొనుగోళ్లలో రికార్డు

మే 31 నాటికి 1.10 లక్షల మెట్రిక్ టన్నుల మక్కలను కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.2,400 ఉండటంతో రైతులు పెద్ద ఎత్తున కొనుగోలు కేంద్రాలకు పంటను తీసుకువచ్చారని తెలిపారు. బహిరంగ మార్కెట్లో క్వింటాలుకు రూ.1,700--1,800 మాత్రమే లభిస్తుండగా, ప్రభుత్వ కొనుగోళ్ల ద్వారా రైతులకు అధిక లాభం చేకూరిందన్నారు. రైతుల విజ్ఞప్తి మేరకు కేంద్రాలకు వచ్చిన ప్రతి గింజను కొనుగోలు చేయడం ద్వారా మే 30 నాటికే 1.61 లక్షల మెట్రిక్ టన్నుల మక్కల కొనుగోలు పూర్తిచేసి రాష్ట్రంలోనే నిర్మల్ జిల్లా అగ్రస్థానంలో నిలిచిందని కలెక్టర్ పేర్కొన్నారు.

### మక్కల రవాణా శరవేగం

ఇప్పటివరకు 1.34 లక్షల మెట్రిక్ టన్నుల మక్కలను గోదాములకు తరలించగా, సుమారు 30 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కేంద్రాల్లో మిగిలి ఉన్నాయని తెలిపారు. రోజుకు 5 నుంచి 6 వేల మెట్రిక్ టన్నుల చొప్పున రవాణా కొనసాగుతోందని, జూన్ 2 నాటికి ఈ ప్రక్రియ పూర్తవుతుందని వెల్లడించారు. వర్షాల నేపథ్యంలో మక్కలు తడిసి మొలకెత్తే ప్రమాదం ఉన్నందున వరి కంటే మక్కల రవాణాకే ప్రాధాన్యత ఇస్తున్నామని, ఒక్క కిలో కూడా నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

### వరి కొనుగోళ్లు ముమ్మరం

జిల్లాలో 1.80 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 1.08 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. గతేడాది కూడా ఇదే స్థాయిలో కొనుగోళ్లు జరిగాయని గుర్తు చేశారు. ఇప్పటివరకు 80 నుంచి 85 వేల మెట్రిక్ టన్నుల వరిని గోదాములకు తరలించామని, ప్రస్తుతం రోజుకు 6 నుంచి 7 వేల మెట్రిక్ టన్నుల వరి రవాణా జరుగుతోందన్నారు. మక్కల రవాణా పూర్తయిన తర్వాత అదనపు లారీలు, హమాలీలను వరి రవాణాకు వినియోగించి రోజువారీ సామర్థ్యాన్ని 9 వేల మెట్రిక్ టన్నుల వరకు పెంచుతామని తెలిపారు.

### వర్షాలపై ముందస్తు చర్యలు

రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. రోడ్లపై, లోతట్టు ప్రాంతాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని గుర్తించి రక్షణ చర్యలు చేపట్టామని, ఇప్పటివరకు ఒక్క బస్తా ధాన్యం కూడా తడవలేదని చెప్పారు. ఒకవేళ భారీ వర్షాలు కురిసినా ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని స్పష్టం చేశారు.

### జొన్నల కొనుగోళ్లకు సన్నద్ధం

జిల్లాలో జొన్నల కొనుగోలు కోసం 13 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మక్కల కొనుగోళ్లు పూర్తయిన వెంటనే జొన్నల కొనుగోళ్లను ముమ్మరం చేయనున్నట్లు చెప్పారు. క్వింటాలుకు రూ.3,700 మద్దతు ధరతో మార్క్‌ఫెడ్ ద్వారా 35 వేల నుంచి 40 వేల మెట్రిక్ టన్నుల జొన్నల కొనుగోళ్లు చేపట్టనున్నట్లు వెల్లడించారు.జొన్నల నిల్వ కోసం ఇప్పటికే 20 నుంచి 25 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములను సిద్ధం చేశామని, జూన్ 10 లేదా 11 నాటికి కొనుగోళ్లు, రవాణా పూర్తవుతాయని తెలిపారు.

### గోదాముల సామర్థ్యం పెంపు

భారీ స్థాయిలో పంట కొనుగోళ్లు జరుగుతున్న నేపథ్యంలో గోదాముల కొరత తలెత్తకుండా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 1.90 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. లోకేశ్వరం, కడెం మండలాల్లో అదనపు గోదాములను గుర్తించి వినియోగంలోకి తీసుకువచ్చామని, రైతుల పంట భద్రతకు పూర్తి స్థాయిలో చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, మార్క్‌ఫెడ్ డీఎం మహేష్, డిపిఆర్ఓ విష్ణువర్ధన్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడమే కాంగ్రెస్ కార్యకర్తల లక్ష్యం కావాలి :: కొత్వాల

## పాల్వంచలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పాల్వంచ, మే 30 : దేశ ప్రధానిగా రాహుల్ గాంధీని చూడడమే లక్ష్యంగా కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సహకార సంఘం అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం పాల్వంచ పట్టణంలోని 38వ డివిజన్ (టీచర్స్ కాలనీ), 39వ డివిజన్ (సబ్‌స్టేషన్ ఏరియా), 41వ డివిజన్ (బాపూజీనగర్), 44వ డివిజన్ (శ్రీనగర్ కాలనీ) ప్రాంతాల్లో నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ సమైక్యత, సమగ్రత, లౌకిక విలువల పరిరక్షణ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆయన అన్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు గ్రామ, వార్డు స్థాయిలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. రానున్న రోజుల్లో రాహుల్ గాంధీ నాయకత్వాన్ని దేశవ్యాప్తంగా మరింత బలోపేతం చేసి ఆయనను ప్రధానిగా చూడడమే కాంగ్రెస్ శ్రేణుల ధ్యేయమని కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ఈ సమావేశాల్లో డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కార్పొరేటర్లు పైడిపల్లి జయలక్ష్మి, సీరపు సుగుణ, నూకల సరిత, మాలంపాటి భవిత, దున్నపోతుల మణి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చీకటి కార్తీక్, సొసైటీ డైరెక్టర్ కనగాల నారాయణ, కాంగ్రెస్ నాయకులు ఆళ్ల మురళి, యర్రంశెట్టి ముత్తయ్య, నూకల రంగారావు, నరహరి, కోండం వెంకన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మే 30 : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో జూన్ 1న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో జిల్లా ఎస్పీ నికిత పంత్, ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ లు కేరామేరి మండలం గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తగూడ, అలాగే రెబ్బెన మండలం కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్డు ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న కార్యక్రమాలను పరిశీలించారు. ముందుగా కొత్తగూడలో ముఖ్యమంత్రి రాక కోసం ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్‌ను సందర్శించి, భద్రతా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. పర్యటన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం రెబ్బెన మండలం కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్డు వద్ద నిర్వహించనున్న బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. సభా ప్రాంగణం, పార్కింగ్ స్థలాలు, ప్రజల రాకపోకలకు ఏర్పాటు చేస్తున్న ఎంట్రీ-ఎగ్జిట్ మార్గాలను డ్రోన్ సాయంతో పరిశీలించి సంబంధిత పోలీసు అధికారులకు సూచనలు చేశారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, భద్రతా ఏర్పాట్లను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) చిత్తరంజన్, ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్, రెబ్బెన సర్కిల్ ఇన్స్పెక్టర్ సంజయ్, సబ్ ఇన్స్పెక్టర్లు వెంకటకృష్ణ, సుబ్బారావు తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



# రమేష్, సత్యనారాయణ సేవలు ఆదర్శప్రాయం

## ఎస్వో టూ జీఎం చంద్రశేఖర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 30: సింగరేణి ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో స్పోర్ట్స్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహించిన హనుమాన్ దాస్ రమేష్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ విభాగంలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఇందూరి సత్యనారాయణ ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం ఘనంగా సన్మానించారు. ఆర్జీ-1 జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్వో టూ జీఎం చంద్రశేఖర్ పూలమాలలు, శాలువాలతో వారిని సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ విరమణ ప్రతి ఉద్యోగి జీవితంలో సహజ ప్రక్రియ అని, రమేష్, సత్యనారాయణ క్రమశిక్షణ, అంకితభావం, స్నేహపూర్వక వైఖరితో సేవలందించి అందరి మన్ననలు పొందారని పేర్కొన్నారు. వారి భవిష్యత్ జీవితం సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులు, సహచర ఉద్యోగులు వారిని అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం ఫైనాన్స్ ధనలక్ష్మీ బాయి, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, ఏఐటీయూసీ ప్రతినిధి రాజు, సీఎంఓఏఐ ప్రతినిధి క్రాంతికుమార్, మోహన్‌రావు, నాగుల వేణు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్లు శ్రావణ్ కుమార్, హన్మంతరావు తదితర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



# పదవీ విరమణ పొందుతున్న మైనింగ్ సర్దార్‌కు ఘనంగా వీడ్కోలు

## ఏఐటియుసి ఆధ్వర్యంలో సన్మానం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 30 : భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-5 ఇంక్లైన్ గనిలో సుదీర్ఘకాలం పాటు సేవలందించి శనివారం పదవీ విరమణ పొందిన సీనియర్ మైనింగ్ సర్దార్ తప్పేట నారాయణ రెడ్డిని సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పిట్ సెక్రటరీ వి. రాజేందర్, బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గోవిందుల తిరుపతి, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ నారాయణమూర్తి, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ నల్ల సత్తి, నాగేంద్రబాబు తదితరులు పాల్గొని నారాయణ రెడ్డికి శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పిట్ సెక్రటరీ రాజేందర్ మాట్లాడుతూ, సింగరేణి సంస్థ అభివృద్ధితో పాటు గని భద్రతా చర్యల అమలులో నారాయణ రెడ్డి అందించిన సేవలు విశేషమని కొనియా డారు. విధి నిర్వహణలో ఆయన చూపిన నిబద్ధత, క్రమశిక్షణ, తోటి కార్మికులతో కలిసిమెలిసి పనిచేసిన తీరు అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం ఆయన ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమం లో షిఫ్ట్ ఇన్‌చార్జీలు మహేందర్, ప్రవీణ్, తిరుపతి, అసిస్టెంట్ ఇన్‌చార్జీలు చందు, నరేష్, టెంపుల్ కమిటీ చైర్మన్ బుద్దారపు రాయమల్లు, సేఫ్టీ కమిటీ సభ్యుడు రాంచందర్, టెంపుల్ కమిటీ సభ్యులు రాజు, రాజయ్య, భీమేష్, వెంకటేష్, మైన్స్ కమిటీ సభ్యులు సమ్మిరెడ్డి, రమేష్, తిరుపతి రెడ్డి, చుక్కన్న, కత్తెరశాల,సుధాకర్, వంశీ, సిసిందర్, శ్రీనివాస్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు. తోటి కార్మికులు, గని సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై నారాయణ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.

## కాంట్రాక్టర్ల ధర్నాకు బిఆర్ఎస్ మద్దతు

మొదటిపేజీ తరువాయి

రాకముందు ఎన్నో హామీలు ఇచ్చారు. రేవంత్.. పేమెంట్ కోటాలో సీఎం పదవి తెచ్చుకున్నాడు. మూడు నెలల్లో పిల్లలు పుడతారా అని సీఎం అంటున్నాడు. మూడు నెలల్లో పిల్లలు పుట్టరని తెలుసు.. 30నెలల్లో కూడా పిల్లలు పుట్టకుంటే ఏమంటారు? కాంట్రాక్టులన్నీ సీఎం బామ్మర్దికి, మంత్రి పొంగులేటి కొడుకుకు వస్తున్నాయి. ముఖం బాగాలేక అద్దం పగుల కొట్టినట్లు ఉంది పరిస్థితి. కేసీఆర్ అప్పుల పాలు చేశారు అంటు న్నాడు. కేసీఆర్ అప్పు చేసి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశారు. ఢిల్లీకి పోదాం.. జీవో నెంబర్ 17 రద్దు అయ్యేవరకు పోరాడుదాం. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. సెక్యూరిటీ లేకుండా రోడ్డు మీదకు రండి.. మీకు పరిస్థితి తెలుస్తుంది. మళ్ళీ 2028లో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది' అని కేటీఆర్ అన్నారు.

## రైతులకు వాతావరణ సూచనలు

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో, డెవలప్మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ ఇండియా (డీఐఎల్ ఇండియా), ఎవిడెన్స్ యాక్షన్ సంస్థల సహకారంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ, డెవలప్మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ ఇండియా మరియు ఎవిడెన్స్ యాక్షన్ సంస్థల మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఈ సందర్భం గా ఎవిడెన్స్ యాక్షన్ సంస్థ కంట్రీ డైరెక్టర్ శ్రీ అంకుర్ గర్ న్యూఢిల్లీ నుండి జూమ్ ద్వారా పాల్గొని, తమ సంస్థ రైతుల కోసం కృత్రిమ మేధస్సు ఆధారంగా అమలు చేస్తున్న కార్యక్రమాలను మంత్రి గారికి వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా లక్షలాది మంది తెలంగాణ రైతులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొంటూ, ఈ అవకాశాన్ని కల్పించిన తెలంగాణ ప్రభుత్వానికి మరియు ప్రత్యేకంగా మంత్రి గారికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి భవిష్యత్తులో మరిన్ని సేవలను రైతులకు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వాతావరణ మార్పులు వ్యవసాయ రంగానికి సవాళు గా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు ఖచ్చితమైన, సమయానుకూల వాతావరణ సమాచారం అందించడం అత్యంత అవసరమని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రైతులకు క్షేత్రస్థాయిలో ఉపయోగపడే సూచనలు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

## మోసపు హామీలతో గద్దెనెక్కి దగా

మొదటిపేజీ తరువాయి

వెళ్ళే వరకు మేలుకోలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానం గతంలో ఎలా ఉండేదో ఇప్పుడు అలానే ఉందని విమర్శించారు. రైతుల దగ్గర నుంచి కేంద్రం నేరుగా కొనదు.. మీ దద్దమ్మ తనం కేంద్రం మీద మోపుతున్నారని మండిపడ్డారు. దొడ్డు బియ్యం పండించే రైతుల పరిస్థితి ఏందని ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రైతులతో ఆడుకుంటున్నాయని.. ఈ ప్రభుత్వానికి కాంట్రాక్టులు, కమీషన్లు, భూ దందాల మీద ఉన్న దృష్టి రైతుల మీద లేదని విమర్శించారు. ఆ మంత్రి ఎంత ఈ మంత్రి ఎంత కమీషన్ తీసుకున్నారు.. నేనెంత తీసుకోవాలని చర్చిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. దేశ వ్యాప్తంగా విపరీతంగా ధాన్యం ఉత్పత్తి జరిగిందని.. ఎక్కడ గోదాంలు ఖాళీగా లేవని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. 'విదేశాలకు సప్లై చేయాలి అంటే ఫెస్టిసైడ్ వాడ కూడదు. క్షేత్ర స్థాయిలో ఆర్గానిక్ ఫార్మింగ్‌పై అవగాహన కల్పిస్తుందా? రైతుల ఉసురు తీసుకుంటుంది ఈ ప్రభుత్వం. ఆంధ్రప్రదేశ్‌లో ఈ సమస్య ఎందుకు లేదు. 6 నెలల ముందు గన్ని బస్తాలు తెచ్చుకుంటే ఏమయ్యింది. ఇక్కడ పండే సన్న బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు సప్లై చేస్తున్నారు. ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. తక్కువ ధరకు ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చి ఇక్కడ నాశి రకం సన్న బియ్యాన్ని పేద ప్రజలకి అందిస్తున్నారు. పేదలను, రైతులను మోసం చేస్తున్నారు. అందరికీ కేంద్రాన్ని విమర్శించడం అలవాటు అయింది. ఇతర రాష్ట్రాల కన్నా ఎక్కువ ధాన్యాన్ని తెలంగాణ నుంచి కేంద్రం తీసుకుంది. ఈ ప్రభుత్వం రైతులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని అనుకుంటుంది. ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ప్రధాని పదేపదే చెపుతున్నారు. ధాన్యం సేకరణపై కేంద్రం గతంలో 9 సార్లు పొడిగింపు ఇచ్చింది. ఎప్పుడూ ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయలేదు. రైస్ మిల్లర్లతో కుమ్మక్కు అయ్యారు. గతంలో బీఆర్ఎస్ అదే పని చేసింది. కేంద్రం ఇప్పటి వరకు ఇచ్చిన కోటను పూర్తి చేయలేదు. 52.24 లక్షల మెట్రిక్ టన్నులు కేంద్రంతో ఒప్పందం జరిగింది. ఇప్పటి వరకు 51 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వివరించారు.

## విజయవాడ హైవేపై బస్సు దగ్ధం

మొదటిపేజీ తరువాయి

బస్సులో ఉండగా.. అందరూ సురక్షితంగా బయటపడటంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రయాణ మధ్యలో బస్సు ఇంజన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పరిస్థితిని వెంటనే గుర్తించిన డ్రైవర్ అప్రమత్తమై బస్సును రోడ్డుపక్కన నిలిపివేసి ప్రయాణికులను వెంటనే దిగిపోవాలని హెచ్చరించాడు. దీంతో ప్రయాణికులంతా సురక్షితంగా బయటకు వచ్చారు. అయితే కొద్దిసేపటికే మంటలు బస్సు అంతటా వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే బస్సు పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరట కలిగించింది. బస్సులో మంటలు చెలరేగడానికి గల కారణాలపై అధికారులు విచారణ చేపట్టారు.

## ఎసిబికి పట్టుబడిన సైబర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్

మొదటిపేజీ తరువాయి

ఇప్పటికే ఐదు లక్షల రూపా యల నగదును గుట్టుచప్పుడు కాకుండా వసూలు చేశాడు. మిగి లిన 4 లక్షల రూపాయల కోసం బాధితుడిని మరోసారి బెదిరిం పులకు గురిచేశాడు. దీనితో విసిగిపోయిన బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. పక్కా ప్లాన్ ప్రకారం...శనివారం ఇన్‌స్పెక్టర్ మహేందర్ మిగిలిన 4 లక్షల రూపాయల లంచం డబ్బును తీసుకుంటుండగా, ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేసి అతడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ అరెస్ట్ అనంతరం అతడి అధికారిక నివాసంలో ఏసీబీ అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో లెక్కల్లో చూపని 13 లక్షల రూపాయల భారీ నగదుతో పాటు, పెద్ద ఎత్తున బంగారు ఆభరణాలు, కీలకమైన ఆస్తి పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ మహేందర్ వెనకాల ఉన్న అక్రమ ఆస్తులపై ఏసీబీ అధికారులు మరింత లోతైన విచారణను కొనసాగిస్తున్నారు. లంచం కేసులో అరెస్టయిన నిందితుడిని అధికారులు నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు.



## తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపు

మొదటిపేజీ తరువాయి

జూన్ 4వ తేదిన అన్ని పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి తగు సూచనలు, సలహాలు స్వీకరించాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనాడు ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న వారందరిని గుర్తించి ప్రభుత్వం సముచితంగా గౌరవించాలని ప్రభుత్వ లక్ష్యమని కమిటీ చైర్మన్ డా. కె. కేశవరావు తెలిపారు. అమరవీరుల కుటుంబాలు, తెలంగాణ ఉద్యమం తొలి, మలి దశ లలో క్షేత్రస్థాయిలో ఉద్యమంలో పాల్గొన్న వారి వివరాలు సేకరించి పారదర్శకంగా అర్హుల జాబితా తయారీకి తగు కార్యాచరణ రూపొందించాలని అధికారులను కమిటీ ఆదేశించింది. ఉద్యమకారుల గుర్తింపు ప్రమాణాలు, జైలు శిక్షలు అనుభవించిన వారు, పలు పోలీస్ కేసుల నమోదు, ఉద్యమంలో పాల్గొన్న మేధావులు, కళాకారులు, రచయితలు, ఉద్యోగులు, జర్నలిస్టులు, అడ్వకేట్ లు, విద్యార్థులు, ఆర్.టి.సి కార్మికులు, సింగరేణి కార్మికులు, వారందరిని గుర్తించి, సముచితంగా గౌరవించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడం, అలాగే వారి సేవలు, త్యాగాలకు తగిన గౌరవం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో విశేష కృషి చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం తరఫున తగిన గౌరవం, గుర్తింపు అందేలా సిఫార్సులు చేయాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని, సమాచార సేకరణలో ఎటువంటి విమర్శలకు తావు లేకుండా ఉద్యమంలో పాల్గొన్న వారందరిని గుర్తించి సముచితంగా గౌరవించాలని ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, హోం శాఖ ముఖ్యకార్యదర్శి శిఖా గోయల్, జి.ఎ.డి కార్యదర్శి రఘునందన్ రావు, జి.ఎ.డి ప్రోటోకాల్ డైరెక్టర్ హరీష్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహా రెడ్డి, న్యాయ శాఖ కార్యదర్శి పాపి రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

## బంగారానికి తగ్గుతున్న డిమాండ్

ముంబయి,మే30 : దేశంలో బంగారానికి డిమాండ్ భారీగా పడిపోయింది. పసిడి విక్రయాలు 70 శాతం తగ్గిపోయాయి. ఈ నేపథ్యంలో ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. శుక్రవారం హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం 1,57,640 రూపాయల వద్ద ట్రేడ్ అయింది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం 1,44,500 రూపాయల వద్ద ట్రేడ్ అయింది. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం 1,18,230 రూపాయల వద్ద ట్రేడ్ అయింది. శనివారం బంగారం ధరలు భారీగా తగ్గాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై రూ. 600.. 22 క్యారెట్ల బంగారంపై రూ. 550 .. 18 క్యారెట్ల బంగారంపై రూ. 450 తగ్గింది. గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం ఉదయం 11 గంటల సమయంలో హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం 1,57,040 రూపాయల వద్ద.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం 1,43,950 రూపాయల వద్ద.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం 1,17,780 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.

## బిఆర్ఎస్ నేతలవి దుర్మార్గపు ఆలోచనలు

మొదటిపేజీ తరువాయి

భాష, చేస్తున్న వివాదాస్పద వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. బీఆర్ఎస్ అగ్రనాయకత్వం అనుసరిస్తున్న రాజకీయ శైలిపై, వారి అణచివేత ధోరణిపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ.. 'బాల్క సుమన్‌తో ఎవరు మాట్లాడించారో కూడా తెలియాలి. పట్టాలు కోయాలని, దాడులు చేయాలని పిలుపునివ్వడం పూర్తిగా బీఆర్ఎస్ సంస్కృతి. ఇది ముమ్మాటికీ కేసీఆర్ నైజం. ఆయనకు తెలిసిన రాజకీయ నీతి ఇదే. కేసీఆర్ తనకు తెలిసిన కుటిల రాజకీయాన్నే కొడుకు కేటీఆర్‌కు నేర్పించారు. కేటీఆర్ తనకు తెలిసిన ఆ నీతినే బాల్క సుమన్‌కు నూరిపోశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ తప్పులు చేసి, దాన్ని ప్రశ్నిస్తే జై తెలంగాణ అంటారు. ఫార్ములా రేస్ నిధుల దుర్వినియోగంపై విచారణకు వెళ్తూ కూడా కేటీఆర్ జై తెలంగాణ అంటారు. తప్పులు చేసి వాటిని గొప్పగా చెప్పుకోవడం బీఆర్ఎస్ నేతలకే చెల్లింది. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగ సంఘాలు, చివరకు రైతులను కూడా రెచ్చగొట్టడమే ఏకైక ఎజెండాగా పెట్టుకున్న బీఆర్ఎస్ నాయకులు.. అధికారం కోసం ఎంతకైనా తెగిస్తారు. సుమన్‌తో మాట్లాడించింది ఎవరో పోలీస్ అధికారులు విచారణ చేయాలని అన్నారు. ఇలాంటి దుర్మార్గపు ఆలోచనల నుండి బిఆర్ఎస్ నేతలు బయటకు రావాలన్నారు.

## పట్టణ పేదలకు సిఎం రేవంత్ రెడ్డి కానుక

మొదటిపేజీ తరువాయి

ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సముదాయానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి పొంగులేటి మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం వలే ప్రజలు ఒకచోట ఇళు 30-40 కిలోమీటర్ల అవతల ఉండేలా చేయబోమని, ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్ గా తీసుకొని ఏ నియోజకవర్గ ప్రజలకు ఆ నియోజకవర్గంలోనే ఇళ్లు నిర్మిస్తామని ఇది పేదలకు పెద్దన్న, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కానుకగా అందిస్తామని అన్నారు. రాష్ట్రంలో పేదవాని గుమ్మం వద్దకే ప్రజా ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామన్నారు. స్టాంప్స్ / రిజిస్ట్రేషన్, సర్వే తదితర శాఖలు ఒకే చోట అందుబాటులోకి తెచ్చేలా ఈ సమీకృత భవనాల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. తమ ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలలో భాగంగా మూడు కార్పొరేషన్ల పరిధిలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటు రంగానికి ధీటుగా కార్పొరేట్ తరహాలో అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. అంతేగాక ప్రభుత్వానిపై ఈ నిధుల భారం పడకుండా రియల్ ఎస్టేట్ నిర్మాణరంగంలో ప్రసిద్ధమైన సంస్థలకు నిర్మించే బాధ్యత అప్పగిస్తున్నామన్నారు. మరి కొద్ది నెలల్లో ఇక్కడ ఫినిక్స్ సంస్థ 30వేల చదరపు అడుగుల్లో ఈ భవనాన్ని పూర్తి చేసి ఇస్తుందని వెల్లడించారు. బంజారాహిల్స్ సమీకృత భవనంలో ఎస్.ఆర్. నగర్, బంజారాహిల్స్, గోల్కొండ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు , డిఐజి కార్యాలయం, రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ – గోల్కొండ కార్యాలయాలు వస్తాయని వీటివలన ఈ ప్రాంత ప్రజలకు మరిన్ని ఉద్యోగ, వ్యాపార సౌకర్యాలు కలుగుతాయన్నారు. వందలాది సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో నమాజ్‌చేసుకుంటున్న ముస్లిం సోదరులకు ఏటా రెండు సార్లు నమాజు కార్యక్రమం నిర్వహించుకునేలా అధికారులను ఆదేశించామని ప్రకటించారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ అధ్యక్షత వహించగా ఎంపీ అనీల్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## మోటర్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీచేయను

మొదటిపేజీ తరువాయి

పెడితే, రైతులకు ఉచిత విద్యుత్ నిలిపివేస్తే.. తాము ఎన్నికల్లో పోటీ చేయబోమన్నారు. తాము ఉచిత విద్యుత్ కొనసాగిస్తే.. బీఆర్ఎస్ ఎన్నికలకు దూరంగా ఉంటుందా అని సిఎం రేవంత్ సవాల్ విసిరారు. రైతుల ముసుగులో కేసీఆర్ రాజకీయ లబ్ధికి యత్నిస్తున్నారని ఆరోపించారు. అన్నదాతలకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించేందుకే రైతు డిస్కం ఏర్పాటు చేస్తున్నాం. ఉచితంగా అందిస్తున్న విద్యుత్ వినియోగాన్ని దీనికి కనెక్ట్ చేస్తున్నాం. రైతు డిస్కంతో జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టాలని ప్రధాని మోడీ ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఇది చెప్పకున్నా బిఆర్ఎస్ తన రాజకీయ లబ్ది కోసం పదేపదే దీనిని వాడుకుందని ఆరోపించారు. ఎపిలో కూడా జగన్ స్మార్ట్ మీటర్లు పెడతానని ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఇకపోతే మేం ఏడాదికి రూ.70 వేల కోట్లు అప్పు చేస్తే.. రూ.95 వేల కోట్ల అప్పు తీరుస్తున్నాం. మేం తీరుస్తున్న అప్పుల గురించి హరీశ్‌రావు చెప్పడం లేదు. రూ.54 వేల కోట్లు అప్పులు తీసుకుంటామని ముందే చెప్పాం. ఎఫ్ఆర్‌బీఎం పరిధి దాటి అప్పులు చేయడానికి అనుమతి లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి వదిలేసిందే తప్ప ఒక్క గింజ కూడా కొనడం లేదని మండిపడ్డారు.

రాష్ట్రంలో వరి, జొన్న, మొక్కజొన్న పంటలను తమ ప్రభుత్వమే పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తోందని, ఇప్పటివరకు 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. తడిచిన ధాన్యానికి సైతం మద్దతు ధర కల్పిస్తున్నామని, సన్న వడ్లకు బోనస్ ఇస్తామని భరోసా ఇచ్చారు. బీజేపీ నేతలు ఢిల్లీకి బస్సులు వేసుకుని వెళ్లి ధాన్యం కొనుగోలుకు ఒత్తిడి తేవలన్నారు. లేకుంటే తాము వారి ఇళ్ల ముందుకే ట్రాక్టర్లతో వడ్లు తెచ్చి పోస్తామని ఆయన హెచ్చరించారు. అంతర్రాష్ట్ర జల వివాదాలపై ప్రధాని మోదీ మాటలు చెబుతున్నా, తుమ్మిడిహట్టి కోసం మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆక్షేపించారు. కేంద్రంలోని భాజపా సర్కారు వడ్లు సరిగ్గా కొనుగోలు చేయడం లేదు. రాష్ట్రంలో 32 శాతం ధాన్యం మాత్రమే కొంటోంది. ధ్యాన్యం కొనకపోతే భాజపా నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తాం. అంతర్రాష్ట్ర జలవివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని ప్రధాని మోదీ చెబుతున్నారు. ప్రాణహిత ప్రాజెక్టుపై మహారాష్ట్ర సీఎంతో చర్చలకు ప్రయత్నిస్తున్నాం. ఆయన ఎందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. హరీష్ రావు ఇదులకుంట చెరువు అక్రమాలపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎన్టీఆర్ విగ్రహం చుట్టూ ప్రాంతీయ, కుల వివాదాలు చేయడం బుద్ధిలేనితనమని, తన దృష్టి అంతా అభివృద్ధి పైనే ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ మీద ఒట్టేసి.. బీఆర్ఎస్‌లోనే ఉంటానని హరీశ్‌రావు చెప్పాలన్నారు. గతంలోనూ హరీశ్‌రావు.. వైఎస్సార్ దగ్గరికి వెళ్లారు. ఆయన ఎవరెవరితో మాట్లాడుతున్నారో నాకు తెలుసు.. కానీ చెప్పను. ఇటీవల పార్టీ మీటింగ్ వదిలేసి ఆయన దిల్లీకి ఎందుకు వెళ్లారు? భాజపా, బీఆర్ఎస్‌లు కలిసి పోటీ చేస్తాయనడంలో అనుమానమే లేదు. సీబీఎస్ఈలో జవాబపత్రాలు తారుమారు చేసిన గ్లోబరీనా.. కేటీఆర్ బినామీ సంస్థ. గ్లోబరీనా సంస్థ కేటీఆర్ బినామీదేనని ఆరోపించిన సీఎం అదే ఇప్పుడు పేరు మార్చుకుందన్నారు. 2034 వరకు రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటాను. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, నాది విజయవంతమైన కాంబినేషన్. మేం అన్ని ఎన్నికలు గెలిచాం. భవిష్యత్తులోనూ విజయం సాధిస్తాం. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆయనకు మంచి పదవి రావొచ్చు. జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పుడే తొందర లేదు. ఎన్టీఆర్‌ను కులం, ప్రాంతంతో పోల్చడం బుద్ధిలేనితనం. పొట్టి శ్రీరాములు వర్సిటీకి సురవరం పేరు పెట్టిందే నేను. వివాదాలు, సెంటిమెంట్‌తో రాజకీయాలు చేయాలని అనుకోవడం లేదని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు.

## తెలుగు రాష్ట్రాల్లో తగ్గని ఎండల తీవ్రత

### - ఎల్‌నినోతో ఆలస్యం కానున్న రుతుపవనాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 30 : తెలుగు రాష్ట్రాల్లో ఎండలకు తోడు, వడగాలులు కూడా ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అడపా దడపా కొన్నిచోట్ల ఉరుములతో కూడిన వర్షాలు పడుతున్నా, మొత్తంగా ఎండలు మాత్రం శాంతించడం లేదు. రుతుపవానలు కూడా ఆలస్యం అవుతున్నాయి. పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న 'సూపర్ ఎల్‌నినో' ప్రభావంతోజూన్ 1 నుంచి అక్టోబర్ వరకు నైరుతి సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదయ్యే పరిస్థితులు లేవని వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలో భిన్నవాతావరణం కొనసాగుతున్నది. తెల్లవారు జామున, రాత్రివేళలో వర్షం కురుస్తుండగా.. మిగతా సమయం లో ఎండలు దంచికొడుతున్నాయి. 17 జిల్లాల్లో 45 డిగ్రీలకుపై గా గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యాయి. మంచిర్యాల జిల్లా తాండూరులో అత్యధికంగా 46.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పెద్దపల్లి, వరంగల్ జిల్లాల్లో 46.3 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, కుమ్రం భీం ఆసిఫాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో 46.2 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యా యి. తెలుగు రాష్ట్రాల్లో వర్షపాతం కొద్దిగా ఆశించినస్థాయిలో ఉన్నప్పటికీ దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఇది దేశవ్యాప్తంగా రుతుపవనాల విస్తరణపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉన్నట్టు వెల్లడించింది. వాతావరణంలో నెలకొన్న ఈ అనిశ్చితి దృష్ట్యా నీటిని పొదుపుగా వాడుకొంటూ, పంటల ప్రణాళికలను రూపొందించుకోవాలని వాతావరణ నిపుణులు హెచ్చరించారు. 2026 నైరుతి రుతుప వనాల కాలానికి సంబంధించిన తుది దీర్ఘకాలిక వాతావరణ అంచనాలను భారత వాతావరణ శాఖ విడుదల చేసింది. ఈ సీజన్‌లో తెలంగాణలో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపా తం నమోదయ్యే అవకాశం ఉన్నట్టు తెలిపింది. ముఖ్యంగా హైదరాబాద్‌తోపాటు మధ్య తెలంగాణ ప్రాంతంలో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్టు వెల్లడించింది. ఈ వర్షాలు భూగర్భ జలవనరుల పునరుద్ధరణకు ఎంతో ఉపయోగపడుతా యని వివరించింది. సంవత్సరం వానకాలం ఎల్‌నినో ప్రభా వంతో 2018 మాదిరిగానే ఉంటుందని వాతావరణ నిపుణులు వెల్లడించారు. తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. 2025 సంవత్సరం మాదిరి వర్షాలను ఆశిం చవద్దని తెలంగాణ వెదర్‌మ్యాన్ సూచించారు. జూన్, జూలై నెలల్లో సాధారణ వర్షాలు ఉంటాయని, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సాధారణంకంటే తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని అంచనా వేశారు. అయినప్పటికీ.. 2014-15లా సాధారణ వర్షపాతం 905.4 మి.మీ. కురువాల్సి ఉండగా కేవలం 562.1 మి.మీ. కురిసినంత తీవ్రంగా ఉండకపోవచ్చని తెలిపారు. గత 5-6 సంవత్సరాలతో పోలిస్తే ఈ సంవత్సరం రుతుపవన వర్షాలు తక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ ఏడాది దక్షిణ, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్షాల లోటు తీవ్రంగా ఉంటుందని, మధ్య తెలంగాణలో మంచి వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు.

## బాల్క సుమన్ వ్యాఖ్యలు దుర్మార్గం

మొదటిపేజీ తరువాయి

కోపమా?. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నేనూ నిరసన కార్యక్రమాలు చేశాను. మేం ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు చేశాము' అని వెంకట్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నేత బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. సింగరేణిపై చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే జైలుకు పంపుతున్నారని బాల్క సుమన్ ఆరోపించారు. ఆయన మాటలకు కౌంటర్ గా ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ స్పందించారు. కేసీఆర్ ఒకయానికి డ్రగ్ శాఖ ఇచ్చాడు. మరొకరికి పిచ్చోడిలా వాగే శాఖ ఇచ్చాడు. సుమన్‌కి రైలు పట్టాలు కోసే శాఖ ఇచ్చాడు. బీఆర్ఎస్ పార్టీని ఎవరూ పట్టించుకోవడం లేదు. తెలంగాణలో శాంతిభద్రతలకు విఘాతం కల్పించాలని కేసీఆర్ కుట్ర చేస్తున్నారు. సుమన్ లాంటి వ్యక్తులపై పీడీ యాక్ట్ పెట్టాలి' అంటూ బల్మూరి వెంకట్ ఫైర్ అయ్యారు.

## సింగరేణిపై బాల్క సుమన్ వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం నన్ను టార్గెట్ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రశ్నిస్తూనే ఉంటాం. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు ఇస్తామ న్నారు. దానినే ప్రశ్నించా. మరోసారి నన్ను జైలుకు పంపాలని రేవంత్, వివేక్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నన్ను జైలుకు పంపి పైశాచిక ఆనందం పొందాలని చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రశ్నిస్తూనే ఉంటాం' అని అన్నారు. బాల్క సుమన్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఆనంద్ అనే వ్యక్తి బాల్క సుమన్‌పై నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బొగ్గు గని కార్మికుల సమావేశంలో బాల్క సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నాడు. 'సింగరేణిని తగలపెట్టండి. మిలిటెంట్ యాక్టివిటీ చేయాలి. ఆఫీస్‌లను తగలబెడదాం. నెల రోజులు జైలుకు పోయి వస్తాము' అని బాల్క సుమన్ కామెంట్లు చేసినట్లు ఆనంద్ తెలిపాడు.

## పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

నమ్మిందని కేటీఆర్ ప్రశ్నించారు. కేవలం ఆ సంస్థకు లబ్ది చేకూర్చేందుకే బోర్డు తన నిబంధనలను పదే పదే మార్చిందని ఆయన ఆరోపించారు. ఒక చిన్న పేరు మార్పు ప్రక్రియతో పాత తప్పులను దాచిపెట్టి, లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో, భవిష్యత్తుతో ఆడుకోవడం క్షమించరాని నేరమని స్పష్టం చేశారు. నిరుద్యోగం, పరీక్షల లీకేజీలు, తప్పుడు మూల్యాంకనాలతో దేశంలోని విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెట్టేస్తున్నారని, లక్షలాది మంది మానసిక క్షోభకు కారణమైన ఈ మార్కుల వివాదానికి కేంద్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి కచ్చితంగా దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు. బాధితులైన విద్యార్థులకు పూర్తి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉండి పోరాడుతుందని కేటీఆర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# బాధిత కుటుంబాలకు అండగా పీఎస్ఆర్ ట్రస్ట్

- మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం
- పాలేరు నియోజకవర్గంలో సుమారు 400 కుటుంబాలకు లబ్ధి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 30 : ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలోని పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ మృతి చెందిన వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తోంది. గత ఏడాది నవంబర్ 1 నుంచి ఈ ఏడాది ఏప్రిల్ 30 వరకు మరణించిన వ్యక్తుల కుటుంబాలకు ట్రస్ట్ తరఫున ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఖమ్మం రూరల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోట వీరభద్రం ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలకు ఈ ఆర్థిక సాయాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, పాలేరు నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 400 కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. కష్టకాలంలో కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో పీఎస్ఆర్ ట్రస్ట్ ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కళ్లెం వెంకటరెడ్డి, మాజీ ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, జిల్లా నాయకులు బండి జగదీష్, జిల్లా కార్యదర్శి చింతమల రవికుమార్, కుమ్మరి అంబేద్కర్, గునిగంటి రమేష్, ఉపగంధ ప్రసాద్, గాంధీ, జాన్‌రెడ్డి, బండి సతీష్, ముత్యం చిన్నకృష్ణారావు, తేజావత్ పంతులు నాయక్, దేవిశెట్టి శేషయ్య, గునిగంటి సురేష్, బుర్ర రాజేష్, తలసాని వెంకటరెడ్డి, కుక్కల అశోక్, దారోజు కార్తీక్, నూతలపాటి వెంకటేశ్వర్లు, సోమనబోయిన సత్యనారాయణ, కొంజాల రవి, బాదిగల రాములు, బూరుగడ్డ మోహన్‌రావు, తేలుపుడి భాస్కర్, మునిగంటి ఉపేందర్, బొడ్డు మోహన్‌రావు, జల్లేపల్లి వెంకటేశ్వర్లు, సోమనబోయిన లింగయ్య, సొంపసాని తిరపయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామాల వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి అభిమానులు, టీమ్ పొంగులేటి సభ్యులు, పీఎస్ఆర్ సోషల్ మీడియా వారియర్ కొండా బద్రిసాయి తదితరులు కార్యక్రమంలో పాల్గొని బాధిత కుటుంబాలకు తమ సంఘీభావం తెలిపారు.



# తొలగించిన ఐదుగురు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

## సింగరేణి జీఎంకు అఖిలపక్ష కార్మిక సంఘాల వినతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, మే 30 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా సింగరేణి మణుగూరు ఏరియాలోని ఓసీ-4 గనిలో దుర్గ కంపెనీ యాజమాన్యం విధుల నుంచి తొలగించిన ఐదుగురు కార్మికులను వెంటనే తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కార్మిక సంఘాల ప్రతినిధులు సింగరేణి మణుగూరు జనరల్ మేనేజర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకుడు వై. రాంగోపాల్, ఐఎన్‌టీయూసీ నాయకుడు పి. వీరభద్రం, టీబీజీకేఎస్ నాయకుడు ఊకంటి ప్రభాకర్, సీఐటీయూ నాయకుడు జి. శ్రీను, టీయూసీఐ నాయకుడు ఆర్. మధుసూదన్ రెడ్డి, ఐఎఫ్‌టీయూ నాయకుడు ఆంగోత్ మంగీలాల్, టీఎన్‌టీయూసీ నాయకుడు అమీనుద్దీన్ మాట్లాడుతూ, వేతనాలను సకాలంలో చెల్లించాలని కోరినందుకే కార్మికులను లక్ష్యంగా చేసుకుని విధుల నుంచి తొలగించడం అన్యాయమన్నారు. ఈ ప్రాంత ప్రజలు భూములు కోల్పోయి, కాలుష్య సమస్యలను ఎదుర్కొంటున్నప్పటికీ స్థానికులకు ఉపాధి కల్పించాల్సిన ప్రైవేట్ సంస్థలు స్థానికేతరులకు ఉద్యోగాలు ఇస్తూ స్థానికులను విస్మరిస్తున్నాయని ఆరోపించారు. కార్మికులు తమ జీతాల కోసం ప్రశ్నిస్తే వారిని అక్రమంగా తొలగించడం యాజమాన్యం నియంతృత్వ ధోరణికి నిదర్శనమని విమర్శించారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవడంతో పాటు స్థానికులకు 80 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గడ్డం వెంకటేశ్వర్లు, సురేందర్, రాంబాబు, వరదల సమ్మయ్య, అప్పారావు, సారబాబు, లింగరాజు, ఎం.డి. మున్వారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# కాన్వెంట్లకు దీటుగా అంగన్వాడి కేంద్రాలు

- మూడేళ్లు నిండిన ప్రతి చిన్నారిని అంగన్వాడికి పంపాలి
- సీడీపీఓ కమలప్రియ, మున్సిపల్ చైర్‌పర్సన్ పి. అనిత



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 30 : ప్రైవేట్ కాన్వెంట్లకు దీటుగా అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ సేవలు అందిస్తున్నామని ఐసీడీఎస్ ఖమ్మం రూరల్ మండల ప్రాజెక్టు అధికారి (సీడీపీఓ) కమలప్రియ, ఎదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పి. అనిత తెలిపారు. మూడేళ్లు నిండిన ప్రతి చిన్నారిని అంగన్వాడి కేంద్రాలకు పంపాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "అమ్మ మాట -- అంగన్వాడి బాట" కార్యక్రమంలో భాగంగా శనివారం జలగం నగర్ సెక్టార్ పరిధిలోని 23వ వార్డు ఇందిరమ్మ కాలనీ అంగన్వాడి కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకుని పాఠశాలల్లో ప్రవేశం పొందనున్న చిన్నారులకు ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం చిన్నారుల తల్లిదండ్రులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు చెల్లించాల్సి వస్తోందని, అంగన్వాడి కేంద్రాల్లో మాత్రం ఉచితంగా నాణ్యమైన ప్రీ-స్కూల్ విద్యతో పాటు పిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి అవసరమైన పోషకాహారం అందిస్తున్నామని తెలిపారు. ప్రీ-స్కూల్ పిల్లలకు ఆంగ్ల బోధన, ఆరోగ్య పరీక్షలు, మానసిక వికాసం కోసం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. అలాగే గర్భిణులు, బాలింతలు అంగన్వాడి కేంద్రాలను తరచూ సందర్శించి మహిళా, శిశు సంక్షేమ శాఖ ద్వారా అందుతున్న సేవలు, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించి వారి సమగ్ర అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమం అనంతరం కాలనీలో "అమ్మ మాట- అంగన్వాడి బాట" అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ పుష్పలత, అంగన్వాడి స్థాయి పర్యవేక్షణ కమిటీ సభ్యులు, చిన్నారుల తల్లిదండ్రులు, అంగన్వాడి టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.



# పినపాక ఎమ్మెల్యేకు సుందరయ్య నగర్ వాసుల విన్నపం

- వరదలు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోరిన ప్రజలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, మే 30 : మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య నగర్‌లో గత పదేళ్లుగా కొనసాగుతున్న వరదలు, డ్రైనేజీ ఓవర్‌ఫ్లో, ఆరోగ్య, ఆర్థిక సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు సమర్పించిన వినతిపత్రంలో, ప్రతి వర్షాకాలంలో చిన్నపాటి వర్షానికే కాలనీ మొత్తం నీటమునిగిపోతుందని, డ్రైనేజీ నీరు రోడ్లపైకి పొంగిపొర్లి ఇళ్లలోకి చేరుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఫర్నిచర్, విద్యుత్ పరికరాలు, పిల్లల పుస్తకాలు తదితర వస్తువులు దెబ్బతింటుండటంతో కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని తెలిపారు. మురుగు నీటి కారణంగా జ్వరం, డెంగ్యూ, వైరల్ ఫీవర్లు, చర్మవ్యాధులు వంటి సమస్యలు పెరుగుతున్నాయని, చిన్నపిల్లలు, గర్భిణీలు, వృద్ధులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి వర్షాకాలంలో ఇళ్లలోకి నీరు చేరడం వల్ల గోడలు, నేలలు దెబ్బతింటున్నాయని, మరమ్మతుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. గత పదేళ్లుగా పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతులు అందించినప్పటికీ శాశ్వత పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం, ఆస్తులను కాపాడేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. సుందరయ్య నగర్‌లో వరద నివారణ చర్యలు చేపట్టడం, డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా అభివృద్ధి చేయడం, పెండింగ్ రోడ్డు పనులను పూర్తి చేయడం, వర్షపు నీరు ఇళ్లలోకి రాకుండా శాశ్వత పరిష్కారం కల్పించడం, ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు మరియు వైద్య శిబిరాలు నిర్వహించాలని వినతిపత్రంలో డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వెంటనే స్పందించి తమ ప్రాంత ప్రజలను ఈ సమస్యల నుంచి గట్టెక్కిస్తారని ఆశిస్తున్నామని సుందరయ్య నగర్ ప్రజలు పేర్కొన్నారు.

# టీఆర్ఆర్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికిత్సలు

- అవయవ రక్షణలో విశేష విజయాలు.
- ఇలిజారోవ్ పద్ధతితో 13 సెం.మీ. ఎముక పునర్నిర్మాణం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 30 : ఖమ్మంలోని టీఆర్ఆర్ ఆర్థో యాక్సిడెంట్ కేర్ హాస్పిటల్‌లో క్లిష్టమైన ఎముక గాయాలు, ఇన్‌ఫెక్షన్లు, ప్రమాదాల్లో అవయవ రక్షణ చికిత్సలో విశేష ఫలితాలు సాధించినట్లు ప్రముఖ ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ తోట లక్ష్మణ్ కుమార్ తెలిపారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేవలం ఏడాదిన్నర కాలంలో అనేక అరుదైన, క్లిష్టమైన ఆర్థోపెడిక్ కేసులకు విజయవంతంగా చికిత్స అందించినట్లు వెల్లడించారు. తీవ్రమైన క్రష్ ఇంజరీలతో ఎముకలు, మృదు కణజాలం దెబ్బతిన్న రోగులకు ఇలిజారోవ్ టెక్నిక్ ద్వారా ఎముక పెంపు, పునర్నిర్మాణం చేసి అవయవాలను కాపాడినట్లు తెలిపారు. శ్రీలతకు జరిగిన తీవ్రమైన క్రష్ ఇంజరీ అనంతరం 12.2 సెంటీమీటర్ల ఎముక పెంపు చేసి అవయవాన్ని రక్షించగా, ఇన్‌ఫెక్టెడ్ నాన్-యూనియన్ టిబియా సమస్యతో బాధపడుతున్న ఉదయ్‌కు 6 సెంటీమీటర్లు, సురేష్‌కు 8 సెంటీమీటర్ల ఎముక పెంపు విజయవంతంగా నిర్వహించినట్లు చెప్పారు. అత్యంత క్లిష్టమైన కేసుగా లారీ డ్రైవర్ సోమేశ్వరరావు చికిత్సను పేర్కొన్న వైద్యులు, రెండు కాళ్లలో తీవ్రమైన క్రష్ ఇంజరీలు, సాఫ్ట్ టిష్యూ నష్టం కారణంగా కాలు తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడినా, ఇలిజారోవ్ పద్ధతి, స్కిన్ గ్రాఫ్టింగ్, దీర్ఘకాలిక పునరావాస చికిత్సల ద్వారా 13 సెంటీమీటర్ల ఎముక పునర్నిర్మాణం చేసి అవయవాలను కాపాడినట్లు తెలిపారు. 13 నెలల చికిత్స అనంతరం ఆయన తిరిగి నడిచే స్థితికి చేరుకున్నారని వెల్లడించారు. అలాగే తీవ్రమైన వాల్గస్ డిఫార్మిటీ, ఆస్టియోఆర్థ్రైటిస్‌తో బాధపడుతున్న ప్రమీలకు టోటల్ నీ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్స నిర్వహించి సాధారణ జీవితం అందించినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, దాడుల్లో గాయపడిన పలువురికి దశలవారీ శస్త్రచికిత్సలు నిర్వహించి పూర్తిగా కోలుకునేలా చేసినట్లు పేర్కొన్నారు. ఈ విజయాలు వైద్యులు, అనస్థీషియా నిపుణులు, నర్సింగ్ సిబ్బంది, ఫిజియోథెరపిస్టులు తదితరుల సమిష్టి కృషి ఫలితమని డాక్టర్ తోట లక్ష్మణ్ కుమార్ తెలిపారు. అత్యాధునిక సాంకేతికతతో నాణ్యమైన, అందుబాటు వైద్య సేవలు అందించేందుకు కృషి కొనసాగిస్తామని చెప్పారు.

# పంట అవశేషాలను కాల్చొద్దు

- విత్తనాల కొనుగోలులో రైతులు అప్రమత్తంగా ఉండాలి :: ఏడీఏ సతీష్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 30 : పంట అవశేషాలను తగలబెట్టడం వల్ల భూమి సారవంతత దెబ్బతింటుందని, రైతులు వాటిని కాల్చకుండా భూమిలో కలియదున్నాలని కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) సతీష్ సూచించారు. శనివారం కూసుమంచి మండలంలోని రావిచెట్టు తండా గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. పంట అవశేషాలను దహనం చేయడం వల్ల నేలలోని సూక్ష్మజీవులు నశించడంతో పాటు భూమి సారం తగ్గిపోతుందని వివరించారు. వాటిని భూమిలో కలియదున్నడం ద్వారా సేంద్రియ పదార్థం పెరిగి నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. అనంతరం నిషేధిత హెచ్‌టీ పత్తి సాగు, విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నకిలీ విత్తనాల గుర్తింపు, విచక్షణారహితంగా ఎరువుల వినియోగం వల్ల కలిగే నష్టాలు, నానో ఎరువుల వినియోగ ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎవరైనా అనుమతులు లేకుండా విత్తనాలు విక్రయిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి మాట్లాడుతూ, తగినంత వర్షపాతం నమోదైన తర్వాతే పత్తి విత్తనాలు విత్తాలని రైతులకు సూచించారు. పొడి వాతావరణంలో విత్తనాలు వేస్తే భూమి పొరల్లో అధిక ఉష్ణోగ్రతల కారణంగా మొలక శాతం తగ్గే ప్రమాదం ఉందని, దీంతో రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు జానీ, సాయిరాం తదితరులు పాల్గొన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరై వ్యవసాయ శాఖ సూచనలను తెలుసుకున్నారు.



# కూనవరంలో 'సర్ మ్యాపింగ్-భరోసా సర్ క్యాంప్'కు విశేష స్పందన

- భరోసా వెల్ఫేర్ సొసైటీ-గ్రామపంచాయతీ సంయుక్త ఆధ్వర్యంలో
- విజయవంతంగా నిర్వహణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, మే 30 : భరోసా వెల్ఫేర్ సొసైటీ మరియు కూనవరం గ్రామపంచాయతీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కూనవరం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన 'సర్ మ్యాపింగ్-భరోసా సర్ క్యాంప్'కు ప్రజల విశేష స్పందన మధ్య విజయవంతంగా ముగిసింది. కూనవరం గ్రామపంచాయతీ సర్పంచ్ ఎనిక శ్వేత బాలకృష్ణ ప్రతిపాదనతో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమం పంచాయతీ కార్యదర్శి సమక్షంలో క్రమబద్ధంగా సాగింది. గ్రామానికి చెందిన మహిళలు, యువకులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో హాజరై క్యాంప్‌లో అందుబాటులో ఉంచిన సేవలను వినియోగించుకున్నారు. క్యాంప్‌లో సర్ మ్యాపింగ్‌కు సంబంధించిన సేవలను సిబ్బంది వేగవంతంగా, సమర్థవంతంగా అందించడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామస్థుల చురుకైన భాగస్వామ్యం, సహకారంతో కార్యక్రమం ఆశించిన లక్ష్యాలను విజయవంతంగా చేరుకుందని నిర్వాహకులు తెలిపారు. గ్రామంలో ప్రజా ప్రయోజన కార్యక్రమాన్ని నిర్వహించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ, సర్పంచ్, గ్రామపంచాయతీ సిబ్బంది, భరోసా వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా భరోసా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మొహమ్మద్ అమీనుద్దీన్ మాట్లాడుతూ, కార్యక్రమం విజయవంతం కావడంలో సహకరించిన గ్రామ ప్రజలు, గ్రామపంచాయతీ సిబ్బంది, సొసైటీ సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు, అవగాహన శిబిరాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామస్తుల అవసరాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని మరిన్ని ప్రత్యేక సేవలను త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన తెలిపారు.

# చెరువులో జారి పడి వ్యక్తి మృతి

- వేంసూరు మండలంలో విషాదం - గేదెలు మేపుతూ ప్రమాదానికి గురైన వ్యక్తి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మే 30:ఖమ్మం జిల్లా వేంసూరు మండలం కుంచపర్తి గ్రామ పరిధిలో శుక్రవారం విషాద ఘటన చోటుచేసుకుంది. గేదెలు మేపేందుకు వెళ్లిన ఓ వ్యక్తి చెరువులో ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం, ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం సత్తన్నగూడెం గ్రామానికి చెందిన ఓమ్మి వెంకటేశ్వరరావు (40) కుంచపర్తి గ్రామ సమీపంలోని చెరువు వద్ద గేదెలు మేపుతున్నాడు. ఈ క్రమంలో గేదెలను తోలుకువచ్చేందుకు చెరువులోకి దిగగా ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడిపోయాడు. వెంకటేశ్వరరావుకు ఈత రాకపోవడంతో నీటిలో నుంచి బయటపడలేకపోయి మునిగిపోయాడు. దీంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వేంసూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. వెంకటేశ్వరరావు మృతితో ఆయన కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొనగా, గ్రామస్థులు మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

# సత్తుపల్లి సమస్యల పరిష్కారంపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే రాగమయి కీలక భేటీ

- అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనపై విస్తృత చర్చ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సత్తుపల్లి, మే 30: సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్‌తో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ శనివారం కీలకంగా సమావేశమ య్యారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలతో పాటు అభివృద్ధి పనులపై కలెక్టర్‌తో విస్తృతంగా చర్చించారు. ప్రత్యేకంగా తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, విద్యుత్ సదుపాయాల మెరుగుదల, వ్యవసాయ రంగ సమస్యలు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే రాగమయి దయానంద్ కోరారు. అలాగే నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు, పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. స్పందిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఈ సమావేశం ద్వారా సత్తుపల్లి నియోజకవర్గంలో పెండింగ్ సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల వేగవంతానికి మార్గం సుగమమవుతుందని స్థానిక ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# శ్రామికుల ఐక్యతకే సీఐటీయూ ఆవిర్భావం: మల్లూరు చంద్రశేఖర్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మే 30 : శ్రామిక వర్గాన్ని ఐక్యం చేసి వారి హక్కుల సాధన కోసం పోరాడడమే సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) ఆవిర్భావ లక్ష్యమని సీఐటీయూ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ పేర్కొన్నారు. వేంసూరు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట శనివారం సీఐటీయూ 56వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జెండాను ఆవిష్కరించి కార్మిక ఉద్యమ అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం కార్మికుల ఐక్యతకు మద్దతుగా నినాదాలు చేశారు. సభలో మల్లూరు చంద్రశేఖర్ మాట్లాడుతూ, దేశ జీడీపీ వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మిక వర్గాన్ని సంఘటితం చేసి వారి హక్కుల సాధన, కార్మిక రాజ్య స్థాపన లక్ష్యాలతో 1970 మే 30న సీఐటీయూ ఆవిర్భవించిందన్నారు. అప్పటి నుంచి కార్మికులు, కర్షకుల సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తూ అనేక విజయాలు సాధించిందని తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ కార్మిక సంఘాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సమ్మెలు నిర్వహించిన ఘనత సీఐటీయూదేనని పేర్కొన్నారు. తెలంగాణలో ఐకేపీ పరిధిలో పనిచేస్తున్న వీఓఏలు (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు) 12 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, వీఓఏల ఉద్యమానికి సీఐటీయూ సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తుంగా నాగరాజు, లింగాల కృష్ణ, అబ్బోజు నాగమణి, సీతారత్నం, నాగలక్ష్మి, పిల్లి జ్యోతి, రమాదేవి, కిన్నెర సద్గుణ, రవికుమారి తదితరులు పాల్గొన్నారు.

# బైక్ ప్రమాదంలో మహిళ మృతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



లక్షేటిపేట, మే 30 బైక్ ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన లక్షెట్టిపేట మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై గోపతి సురేష్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని గుల్లకోట గ్రామ స్టేజి సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన బైక్ ప్రమాదంలో లక్షెట్టిపేట ఎంపీడీవో కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న షేర్ల శైలజ(38) అనే మహిళ ఉద్యోగి మృతి చెందిందని తెలిపారు. మృతురాలు మంచిర్యాలలోని మేదరి వాడలో భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటు, లక్షెట్టిపేట ఎంపీడీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తోందని తెలిపారు. శుక్రవారం రాత్రి లక్షేటిపేట ఎంపీడీవో పదవి విరమణ కార్యక్రమానికి భర్త, పిల్లలతో కలిసి బైక్ పై వచ్చి రాత్రి 10గంటల ప్రాంతంలో ఇంటికి వెళుతున్న క్రమంలో గుల్లకోట వద్ద అడవి పంది అడ్డు రావడంతో దాన్ని ఢీ కొని కిందపడగా మృతురాలి తలకు తీవ్ర గాయమై చనిపోయిందని, ఈ ప్రమాదంలో భర్త,పిల్లలకు ఎలాంటి గాయాలు కాలేదని అన్నారు. మృతురాలి తమ్ముడు షేర్ల శివకృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయడం జరుగుతుందన్నారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL**, Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com